అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 23-6-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 115 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 10 పేజీలు | వెల : 6.50





బలిదానాలకు గుర్తుగా..

అమరజ్యోతి

యక్షప్రశ్నలకు సమాధానాలు చెప్పినం

- జయశంకర్..ఆజన్మ తెలంగాణవాది
- రాజీనామాలే అస్త్రాలుగా ఉద్యమం
- సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం : అమరజ్యోతి ప్రారంభసభలో సీఎం కేసీఆర్
- కొవ్వొత్తులతో ఘనంగా నివాళి
- ఆకట్టుకున్న 800డ్రోన్ల షో

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'అమరవీరుల బలిదానాలను గుర్తుచేసుకునేలా..ఎల్లకాలం గుర్తుండేలా..అందరి నోళ్లలో నానేవిధంగా..ఎక్కడా లేనివిధంగా అమరజ్యోతిని నిర్మించుకున్నాం. ఇక్కడి లైబ్రరీలో 1969 నుంచి ఉద్యమానికి సంబంధించిన ఫొటోల గుర్తులను ...2లో

మోసపోతే

రాష్ట్ర ప్రగతి దేశానికే ఆదర్శం

గోసపడ్డం

- అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ఆశీర్వదించండి
- చిమ్మ చీకటైతదన్నరు..వెలుగులు జిగేల్‌మంటున్నయి
- పటాన్‌చెరులో రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్ మంజూరు
- కొల్లాపూర్‌లో 'డబుల్' ఇండ్ల ప్రారంభం
- పటాన్‌చెరువులో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి సీఎం కేసీఆర్ భూమిపూజ

తెలంగాణలో ఎకరా అమ్మితే.. ఆంధ్రాలో పదెకరాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'మోసపోతే గోసపడ్తం.. కొనసాగుతున్న రాష్ట్ర ప్రగతి రాబోయే రోజుల్లోనూ కొనసాగాలంటే ప్రజలు మళ్లీ దీవించాలి.. మనం కడుతున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు.. మనం ఇస్తున్న ఇంటింటికీ మంచినీళ్లు దేశంలో ఎక్కడా లేవు. చిమ్మ చీకటైతది మీకు కరెంట్ రాదన్నారు. కానీ నేడు విద్యుత్ వినియోగంలో మనమే దేశంలో ...9లో



మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అద్భుతం

- కొండకల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభంలో సీఎం కేసీఆర్ 2లో

బోనమెత్తిన గోల్కొండ

జగదాంబికా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు 2లో..



- సబ్బండ వర్గాలకు పెద్ద పీట
- బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు వివరాలు 2లో..

చీకట్లోకి భారతం..

లా కమిషన్ సిఫారసులు తిరోగమనమే | **రాజద్రోహ చట్టంపై న్యాయ నిపుణుల మనోగతం**

స్వాతంత్ర్యానంతరం మరింత వెలుగులోకి ప్రయాణించాల్సిన ఆధునిక భారతావని ఇప్పుడు చీకటిలో దారి వెతుకుతోంది. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 సంవత్సరాలు దాటిన తర్వాత ఈ పరిస్థితి దాపురించడం ఓ విషాదం. బ్రిటీష్ పాలన కాలం నాటి రాజద్రోహ చట్టంలోని ఐపీసీ సెక్షన్ 124-ఏను కొనసాగించాలని, దానిలో నిర్దేశించిన శిక్షను పెంచాలని లా కమిషన్ చేసిన సూచనను గమనించిన వారు ఎవరైనా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. ఈ సిఫారసులు అమలు చేస్తే భారత్ 19వ శతాబ్దం దిశగా తిరోగమనంలోకి సాగుతుందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



న్యూఢిల్లీ : ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవర్తించే వారిపై ఉక్కుపాదం మోపడానికి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రాజద్రోహ చట్టాన్ని తీసుకొచ్చింది. దీన్ని జాతీయోద్యమ కాలంలోనే దేశం ముక్తకంఠంతో నిరసించింది. అయినా అది నేటికీ కొనసాగటం అమానుషమని దేశం ఘోషిస్తున్నంటే..ఈ రాజద్రోహ చట్టానికి మరింత పదును పెట్టాలని సూచిస్తోంది.



విభిన్న అర్థాలతో...

ప్రస్తుత లా కమిషన్ ఇప్పటి వరకూ కేవలం మూడు నివేదికలను మాత్రమే ప్రచురించింది. రాజద్రోహ చట్టాన్ని కొనసాగించాలన్న సిఫార్సు వాటిలో ఒకటి. బ్రిటిష్ పాలనలో ఇందులోని నిబంధనలను అప్పటి జాతీయ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ వ్యతిరేకత ఇప్పుడూ కొనసాగుతోంది. సెక్షన్ 124-ఏ అమలును సుప్రీంకోర్టు నిలిపివేసినప్పటికీ దానికి మరింత పదును పెట్టాలని లా కమిషన్ సిఫార్సు చేయడం గమనార్హం. పౌరుల ప్రయోజనాలను, వారి భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు ఆ నిర్ణయం తీసుకుంది. అయితే కోర్టు అభిప్రాయాలకు లా కమిషన్ వక్రభాష్యం చెప్పింది. ప్రభుత్వంపై అవిధేయత ప్రదర్శించడం, ఇష్టపడకపోవడం, ద్వేషించడం, నష్టం కలిగించడం, దురుద్దేశం వంటి పదాలకు ...9లో

2014 తర్వాతే అధికం

లా కమిషన్ తాజా సిఫారసుల ప్రకారం ప్రాథమిక డిమాండ్లపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు నిరసన ప్రదర్శనలు జరిపినా, రోడ్లను దిగ్బంధించినా అది రాజద్రోహ చట్టం పరిధిలోకే వస్తుంది. ఆర్టికల్ 14 ప్రకారం... పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో 25 రాజద్రోహ కేసులు, హత్రాస్ సామూహిక లైంగికదాడి ఘటన తర్వాత 22 కేసులు, రైతుల ప్రదర్శనల సమయంలో ఆరు, పుల్వామా దాడి తర్వాత 27 రాజద్రోహ కేసులు నమోదయ్యాయి. దేశ ఐక్యత, సమగ్రతల పరిరక్షణ కోసం ఈ చట్టం అవసరమేనని కమిషన్ నొక్కి చెప్పింది. రాజద్రోహ చట్టం కింద నమోదైన కేసులలో 96% కేసులు 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టినవే.

అమర వీరుల స్మారకంలోనూ

బీఆర్ఎస్ అవినీతి



నిర్మాణంలో నాణ్యతా లోపాలు

- శిలాఫలకంపై అమరుల పేర్లు లేకపోవడం దారుణం : రేవంత్‌రెడ్డి
- కేఏ పాల్‌లా మాట్లాడుతున్న బండి సంజయ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అమర వీరుల స్మారకంలోనూ బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిర్మాణంలోనూ నాణ్యతా ...9లో

పత్రికా స్వేచ్ఛపై మోడీతో చర్చించండి

బైడెన్‌కు అంతర్జాతీయ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్ డిమాండ్



వాషింగ్టన్ : భారత్‌లో పత్రికా స్వేచ్ఛకు ఎదురవుతున్న అవరోధాలపై ప్రధాని మోడీతో చర్చించాలని అంతర్జాతీయ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఐ) అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను డిమాండ్ చేసింది. మోడీ హయాంలో పాత్రికేయులపై చట్టం అనే ఆయుధాన్ని ప్రయోగిస్తున్నారని, అక్కడ ఇది సర్వసాధారణమై పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై శ్వేతసౌధం ...9లో

రాజ్యాంగానికే అవమానం

పీఠిక నుంచి సామ్యవాదం,లౌకిక పదాలు తొలగింపు

- పదో తరగతి సాంఘికశాస్త్రంలో విద్యాశాఖ అధికారుల అలసత్వం
- అధికారులపై చర్యలు తీసుకోవాలి : ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



వివరాలు 2లో..

మౌనంగా..దూరంగా...

ఇంటింటికీ బీజేపీలో కనిపించని ఈటల, రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో బండి దూకుడు పెరుగుతుండగా...ఈటల రాజేందర్ ఎక్కడా కనిపించడం లేదు. ప్రధానిగా నరేంద్ర మోడీ 9 ఏండ్ల పాలనలో అభివృద్ధిని గురించి చెప్పేందుకు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి పార్టీ పిలుపునిచ్చింది. ముఖ్యనేతలంతా తమ తమ నియోజకవర్గాల్లో పాల్గొనప్పటికీ ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాత్రం కనిపించలేదు. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మను కలిసి వచ్చినప్పటి నుంచి ఈటల రాజేందర్ మౌనంగానే ఉంటున్నారు. ఒకప్పుడు ఎక్కడికెళ్లినా ...9లో





సమరమే..

పేదలకిచ్చే రూ.3లక్షల గృహలక్ష్మి నిధులు సరిపోవు

బస్సు యాత్ర ముగిసేలోపు సమస్యలు పరిష్కరించాలి

- భూపోరాట పేదలకు పట్టాలివ్వాల్సిందే : ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య

నవతెలంగాణ - హసన్‌పర్తి/కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / గోదావరిఖని

పేదలు ఇల్లు కట్టుకునేందుకు ప్రకటించిన గృహలక్ష్మి పథకం కింద సొంత స్థలం ఉండి, రేషన్‌కార్డు ఉన్నవారికే రూ.3లక్షలు ఇస్తామంటే ఇంటిస్థలం లేని పేదలు ఎక్కడికిపోవాలని, సొంత స్థలం ఉన్నా.. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో ఇంటి నిర్మాణం సాధ్యమవుతుందా అని ప్రజాసంఘాల ...2లో



పోడు రైతులకు పట్టాలివ్వాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు,మాజీ ఎంపీ బాబురావు

- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ





నవతెలంగాణ-పినపాక

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల్లో సర్వే పూర్తి చేసి అందరికీ పట్టాలు ఇవ్వాలని, ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు వేధింపులు ఆపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం), తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు రైతులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ-బయ్యారం పోలీస్ స్టేషన్ నుంచి ఫారెస్ట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కిలోమీటర్ల మేర వేల సంఖ్యలో గిరిజనులతో పాటు ఎటు చూసినా ఎర్ర జెండా రెపరెపలాడింది. ర్యాలీలో భాగంగా ఈ-బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి అటవీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని, పోడు సాగుదారులపై అటవీ అధికారుల వేధింపులు ...9లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

రాజ్యాంగానికే అవమానం!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగం పట్ల పాఠశాల విద్యాశాఖ అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శించారు. పదో తరగతి తెలుగు, ఆంగ్ల మాధ్యమం సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లోని రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకిక పదాల్లేకుండా ముద్రించారు. అయితే ఇది యాదృచ్ఛికంగా జరిగిందా? లేదంటే ఉద్దేశపూర్వకంగా కావాలనే చేశారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. భారత్ గొప్ప ప్రజాస్వామ్య, లౌకికదేశమంటూ ప్రపంచమంతా కీర్తిస్తున్నది. ఇంకోవైపు 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాదం, లౌకిక పదాలను పీఠికలో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం రాజ్యాంగ పీఠికలో ఆ పదాల్లేకుండా ముద్రించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) పాఠ్యాంశాలతో కూడిన సీడీ ఆధారంగానే పుస్తకాలను ముద్రిస్తారు. అయితే పదో తరగతి తెలుగు, ఆంగ్ల మాధ్యమం పుస్తకాల్లోనే ఆ పదాల్లేవు. మిగిలిన తరగతులు, మాధ్యమాలకు చెందిన పుస్తకాల్లో వాటిని ముద్రించడం గమనార్హం. అంటే ఎస్సీఈఆర్టీ అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారన్నది స్పష్టంగా అర్థమవుతున్నది. దీంతో రాజ్యాంగాన్ని అవమానించారంటూ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు విమర్శించాయి. సామ్యవాదం, లౌకిక పదాలు తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇంకోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, ప్రజాస్వామ్యం సూత్రాలకు భిన్నంగా అంధవిశ్వాసాలను పెంపొందించేలా జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ఉందన్న విమర్శలొస్తున్నాయి. శాస్త్రీయ విధానంతో రాసిన సైన్స్, చరిత్రను తొలిగించి, అవాస్తవమైన, అభూత కల్పనలతో కూడిన అంశాలను చరిత్ర పాఠాలుగా ప్రవేశ పెడుతున్నది. ఎస్సీఈఆర్టీ సిలబస్ నుంచి గాంధీ, భగత్ సింగ్ పాఠాలతోపాటు జీవ పరిణామ క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

మొఘలుల చరిత్ర, గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత శాస్త్ర సాంకేతిక విద్యాసంస్థలకు చెందిన 1,800 మంది సైన్స్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు ఎస్సీఈఆర్టీ చర్యలను తప్పుపడుతూ ఆ సంస్థ డైరెక్టర్‌కు లేఖలు రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొరపాటు జరిగింది : రాధారెడ్డి, డైరెక్టర్, ఎస్సీఈఆర్టీ

పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లోని కవర్ పేజీపై ఒరిజినల్ రాజ్యాంగ పీఠికను ముద్రించాం. కవర్ పేజీ డిజైనింగ్ సమయంలో డౌన్‌లోడ్ చేసేటపుడు పొరపాటు జరిగింది. అయితే ఇది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదు. ఇతర తరగతులకు చెందిన లోపలి పేజీల్లో సవరించిన రాజ్యాంగ పీఠికను ముద్రించాం. అనుకోకుండా పొరపాటు జరిగింది.

కావాలనే ముద్రించారు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకం కవర్ పేజీపై రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాల్లేకుండా ముద్రించడం శోచనీయమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. లోపలి పేజీలో ముద్రించిన పీఠికలో ఆ రెండు పదాలున్నాయని పేర్కొన్నారు. అయితే ఇది కావాలనే ముద్రించినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. ఈ తప్పుడు ముద్రణకు బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖను డిమాండ్ చేశారు.

ఎస్సీఈఆర్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలి : టీఎస్‌యూటీఎఫ్

పదో తరగతి సాంఘిక శాస్త్రం కవర్ పేజీపై రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించి తప్పుగా ముద్రించిన ఎస్సీఈఆర్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం లేఖ రాశారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976, డిసెంబర్ 18న ఆ రెండు పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చారని తెలిపారు. ఎనిమిది, పదో తరగతి సాంఘికశాస్త్రం లోపలి పేజీల్లో ఆ రెండు పదాలతో కూడిన రాజ్యాంగ పీఠికను ముద్రించారని గుర్తు చేశారు. దేశంలో లౌకికత్వానికి ప్రమాదం ఏర్పడిందంటూ విశ్వవ్యాప్తంగా చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన జాతీయ పాఠ్య గ్రంథాలపై అమల్లో ఉన్న రాజ్యాంగ పీఠికను కాకుండా కొందరు కోరుకుంటున్న విధంగా పాత రాజ్యాంగ పీఠికను ముద్రించడం అనేక అనుమానాలకు ఆస్కారమిస్తున్నదని విమర్శించారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగినా లేక ఏమరుపాటుగా జరిగినా పెద్ద తప్పిదమేనని తెలిపారు. తప్పుగా ముద్రించిన విషయంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సరైన రాజ్యాంగ పీఠికను ముద్రించాలని వారు డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పీఠికకు అవమానం : టీపీటీఎఫ్

రాజ్యాంగ పీఠికకు అవమానం జరిగిందని టీపీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ విమర్శించారు. సామ్యవాదం, లౌకిక పదాలకు విద్యాశాఖ నీళ్లొదిలిందని తెలిపారు. 1976లో రాజ్యాంగ పీఠిక సవరించబడిందని పేర్కొన్నారు. కొంత మేర అమలవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఆయా అంశాలను తొలగించాలనే ప్రయత్నంలో ఉన్న క్రమంలో ఆ భావజాలంతో ఉన్న వారు కావాలనే ముద్రించినట్టు భావించాల్సి వస్తుందని తెలిపారు. రాజ్యాంగ పీఠికను తప్పుగా ముద్రించడంలో బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమరమే..

(మొదటిపేజీ తరువాయి)

ఐక్య పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య ప్రశ్నించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ గృహాల సాధన కోసం ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర గురువారం ఉదయం హన్మకొండ జిల్లా హసన్‌పర్తిలో గుడిసెలు వేసుకున్న కేంద్రాన్ని సందర్శించింది. అనంతరం అక్కడినుంచి సిద్దిపేట పట్టణం మీదుగా సాయంత్రం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి యాత్ర చేరుకుంది. అక్కడ నగరంలో చేపట్టిన భూపోరాట పేదలను యాత్ర బృంద సభ్యులు కలిశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో వేదిక జిల్లా కన్వీనర్ వేల్పుల కుమారస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే అన్ని వస్తాయని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లు పూర్తయినప్పటికీ నిరుపేదలకు కనీసం ఇండ్లు నిర్మించలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలకు సోయిలేకనే నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆడవారికి తడక చాటు స్థలం లేని దీనపరిస్థితిలో ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిరుపేదలు ఇండ్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మిస్తామని మోసం చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ వ్యాపారులు, భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే రాబోయే రోజుల్లో పేదలకు కనీసం 100 గజాల ప్రభుత్వ స్థలం లేకుండా పోతుందని గుర్తించారని అన్నారు. అందుకే ఇండ్లు లేని నిరుపేదలు 100 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుంటున్నారని అన్నారు.


పేదలు ఇల్లు కట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఎర్రజెండా ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాల్లోని 61కేంద్రాల్లో సాగుతున్న భూపోరాట కేంద్రాలను సందర్శిస్తూ వారికి మద్దతుగా బస్సుయాత్ర సాగుతోందని తెలి పారు. ఈ యాత్రలో వారితో బస చేసి వారి కష్టాలు, సమస్యలు అర్థం చేసు కుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్ల విషయమై నిర్దిష్ట కాల పరిమితితో విధివిధానాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ భూపోరాటాల వేదికల నుంచే పేదలతో కలిసి సమరశీల పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. బహిరంగసభల్లో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి టి.స్కైలాబ్‌బాబు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, వృత్తిదారుల సంఘం నాయకులు పి.ఆశయ్య, సీఐటీయూ కోశాధికారి వంగూరి రాములు, సోషల్ మీడియా ఇన్‌చార్జి జగదీష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టి.రాజారెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షులు వేముల ఆనంద్, వివిధ జిల్లాల ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా...

ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు బస్సుయాత్రలో భాగంగా గోదావరిఖనిలో గురువారం సాయంత్రం చేపట్టిన సభకు చేరుకుని పేదలనుద్దేశించి మాట్లాడుతున్న సమయంలోనే వర్షం జోరందుకుంది. అయినప్పటికీ అదే వర్షంలో నేతలు పేదలను ఉద్దేశించి ఇండ్లు, ఇండ్ల స్థలా ల విషయమై ప్రభుత్వాన్ని నిగ్గదీస్తూ మాట్లాడుతున్నారు. ఆ సమయంలో సభలో పాల్గొన్న పేదలందరూ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నాయకులతో పాటే తడుస్తూ వారి ప్రసంగాన్ని వింటూ పోరాట స్ఫూర్తిని చాటుకున్నారు.

మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అద్భుతం

నవతెలంగాణ-శంకర్‌పల్లి



మేధా సర్వో డ్రైవ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేస్తున్న రైల్వే కోచ్, రైల్వే బోగీలు రెండు తెలుగు రాష్ట్రాలకే కాకుండా ప్రపంచ స్థాయిలో కూడా ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం మహా అద్భుతమని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో వంద ఎకరాల్లో రూ.850 కోట్లతో ఏర్పాటుచేసిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని గురువారం ఆయన ప్రారంభించారు. రైల్వే కోచ్ విడిభాగాల తయారీ యూనిట్లను మేధా సంస్థ ప్రతినిధులు కశ్యపరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్‌తదితరులతో కలిసి యూనిట్లను సీఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు.. 2017లో కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయగా తెలంగాణ ప్రభుత్వం కంపెనీకి 310 సర్వే నంబర్‌లో వంద ఎకరాల భూమిని అప్పగిస్తూ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ కంపెనీ ఏర్పాటుతో సుమారు 2000 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. ప్రపంచానికి అవసరమయ్యే రైల్వే విడిభాగాలు రూ.2500 కోట్లతో తయారుచేసే యూనిట్ మన వద్ద ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. రైల్వే కోచ్ తయారీ ఎగుమతులకు కేంద్రంగా ఇక్కడి ప్రాంతం నిలువనుందని చెప్పారు. తెలంగాణ బిడ్డలయిన సంస్థ ప్రతినిధులు కష్యపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఎంతో కష్టపడి దేశానికి, ప్రపంచానికి అవసరమైన ప్రాజెక్టును మ్యానుఫ్యాక్చరింగ్ పూర్తి చేసి తనతో ప్రారంభింపజేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుల, జిల్లా కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, మేధా కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బలిదానాలకు గుర్తుగా అమరజ్యోతి

(మొదటిపేజీ తరువాయి)

పొందుపర్చాం. దీపాలను చేతబూని అమరులకు అర్థవంతమైన నివాళులర్పించాం' అని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తీరాన ఏర్పాటు చేసిన అమరజ్యోతిని కేసీఆర్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీసులు ఫైరింగ్ చేశారు. అనంతరం ఉద్యమప్రస్థానం, రాజకీయ ప్రక్రియలకు సంబంధించిన డాక్యుమెంటరీని సీఎం వీక్షించారు. సభీకులందరూ దీపాలతో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ నివాళి గేయం ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్ర పెద్దదని అన్నారు. తెలంగాణ విలీనం సమయంలో అనేక కుట్రలు జరిగాయని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా ఇల్లందులో పోలికేక మొదలైందని, ధైర్యసాహసాలున్న విద్యార్థులు, టీఎన్‌జీఓలు అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. 1969 ఉద్యమ సమయంలో టీఎన్‌జీఓ నాయకులు అమోస్ అనుభవించని బాధల్లేవని అన్నారు. జయశంకర్ అజన్మ తెలంగాణవాదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేశారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులే కాకుండా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు తెలిపారు. వామపక్షపార్టీలు కూడా తెలంగాణ ఉద్యమానికి జీవం పోశాయని గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం గాంధీ స్ఫూర్తితో రాజీనామాలే అస్త్రాలుగా లెక్కచేయకుండా విసిరి పారేశామని అన్నారు. ఉద్యమ సమయంలో తనపై జరిగిన్ని దాడులు ప్రపంచంలో ఏ నేతపై కూడా జరగలేదని, వాళ్ల తిట్లే దీవెనలుగా భావించామన్నారు. అప్పటి సీఎం రోశయ్య తీసుకొచ్చిన 14ఎఫ్‌కు నిరసనగా సిద్దిపేటలో ఉద్యోగ గర్జన సందర్భంగానే అమరణ నిరాహార దీక్ష చేపట్టానని, 'కేసీఆర్ సచ్చుడో..తెలంగాణ వచ్చుడో' నినాదంతో ముందు కెళ్లామని తెలిపారు. చివరి నిమిషం వరకు కుట్రలు జరిగాయంటూ పార్లమెంట్‌లోనూ పెప్పర్‌స్ప్రే ఘటనను సీఎం గుర్తుచేసుకున్నారు. రక్తాన్ని చిందించకుండా తెలంగాణ సాధించాలని అనుకున్నాం కానీ, ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో బలిదానాలు తనను కలిచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల త్యాగాలను నిరంతరం గుర్తుచేసుకునేలా అమరజ్యోతి నిర్మిస్తుంటే కొంత మంది విమర్శలు చేశారని, కానీ అనుకున్నవిధంగా దీన్ని నిర్మించామని తెలిపారు. ఇతర రాష్ట్రాల, విదేశీ నాయకులు, పర్యాటకులు అమరజ్యోతిని సందర్శించి నివాళులర్పించిన తర్వాతే ఇతర కార్యక్రమాలు చేపట్టేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. ఉద్యమ సమయంలో తెలంగాణ అభివృద్ధిపై లక్షలాది యక్ష ప్రశ్నలకు సమాధానాలు చెప్పామని, నేడు తలసరి ఆదాయంలో నెంబర్‌వన్‌గా ఉన్నామని, విద్యుత్ రంగంలోనూ ముందువరుసలో ఉన్నామని చెప్పారు. పంజాబ్‌ను తలదన్నేలా ధాన్యం ఉత్పత్తిలో ప్రగతి సాధించామని తెలిపారు. దళితుల వెనుకబాటు తనం దేశానికి మచ్చగా ఉందని, వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపాలనే దళితబంధు పథకం తీసుకొచ్చామని తెలిపారు. సమతా సిద్ధాంత కర్త అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం, సచివాలయం, అమరజ్యోతితో ఈ ప్రాంతం యూనిక్ ప్లేస్‌గాను, ల్యాండ్ మార్క్‌గాను మారిందని తెలిపారు. ఇదే ప్రాంతంలోనూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణార్పణ చేసిన అమరులకు మరోక్కసారి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని సీఎస్ శాంతికుమారి అన్నారు. భిన్న దశల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో, ఎంతో మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. ఏ జీవికైనా ప్రాణాన్ని మించింది లేదని, ప్రజల ఆకాంక్ష కోసం విలువైన ప్రాణాలను బలిపెట్టడం మహోన్నతమైన త్యాగమన్నారు. న్యాయబద్ధమైన డిమాండ్ కోసం ప్రాణత్యాగం చేసిన వారు జ్ఞాపకాల్లో సజీవులై మనకు నిరంతర ప్రేరణ అందిస్తున్నారని తెలిపారు. అమరవీరుల ఆశయాలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పరిశ్రమిస్తున్నదని తెలిపారు. సాధించుకున్న స్వరాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిచేవిధంగా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారని చెప్పారు. నాడు పోరాటానికి, నేడు ప్రభుత్వానికి నాయకత్వం వహించిన కేసీఆర్ అమరుల స్మృతిలో ఒక స్మారక కేంద్రం ఏర్పాటు కావాలని ఆశించారని, అందుకు అనుగుణంగా ఈ అమరజ్యోతి నిర్మితమైందని వివరించారు.

అమరుల కుటుంబాలకు సన్మానం

అమరజ్యోతి ప్రారంభోత్సవం సభలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలను ఈ సందర్భంగా సన్మానించారు. శ్రీకాంతచారి తల్లి, పోలీసు కిష్టయ్య భార్య, కూతరు, వేణుగోపాల్‌రెడ్డి తల్లి, సిరిపురం యాదయ్య కుటుంబ సభ్యులు, యాదిరెడ్డి తల్లి చంద్రమ్మ, కావలి సువర్ణ కుటుంబ సభ్యులను సీఎం కేసీఆర్, మంత్రులు, శాసనసభ స్పీకర్, మండలి చైర్మెన్, సీఎస్ సన్మానించారు.

ఆకట్టుకున్న డ్రోన్ల షో

హుస్సేన్‌సాగర్, సచివాలయం, అమరజ్యోతి ప్రాంగణంలో 800 డ్రోన్లతో నిర్వహించిన షో అందరిని ఆకట్టుకుంది. షోలో అమరజ్యోతితోపాటు తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, కేసీఆర్ చిత్రం పలు అంశాలతో నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అమరవీరుల సంస్మరణ ర్యాలీ

అంతకుముందు నెక్లెస్‌రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి సభ ప్రాంగణం వరకు అమరవీరులకు జోహార్లు అర్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆరువేల మంది కళాకారులు అమరవీరుల స్మృతి వనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరజ్యోతి ప్రారంభోత్సవం సందర్భంగా సాంస్కృతిక బృందాలు వివిధ కళారూపాలతో ర్యాలీ నిర్వహించారు. చిందు యక్షగానం, ఒగ్గు డోలు, బోనాల కోలాటం, కాటికాపరులు, బైండ్ల కళాకారులు, డుబ్బుల కళాకారులు, కోలాటం, మహిళా డప్పులు, గొల్లసుద్దులు, వీర ప్రభలు, బోనాలు, డప్పులు, బంజారా/బిందెలా బంజారా, గుస్సాడీ, కొమ్ము కోయ, రాజన్న డోలు/రాజకోయ, బతుకమ్మ, పులివేషాలు, కోలాటం, చిరుతల భజన, మహిళా డప్పులు, బుడబుక్కలు, తోలు బొమ్మలు, చెంచులు, పీర్లు, కలిక వేషాలు, కోలాటం, డప్పులు, కోలాటం, మహిళా డప్పులు, లంబాడా నత్యం, లేడీస్ డప్పులు, పేరిణి, కథక్, కూచిపూడి, భరతనాట్యంతో ఊరేగింపు వచ్చారు. కళాకారులు నిర్వహిస్తున్న ర్యాలీలో రాష్ట్ర సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్ డప్పుతో దరువేయగా రాష్ట్ర మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ కళాకారులతో కలిసి చిందులేశారు. మంత్రులతో పాటు సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి, అధికార భాష సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవిలు కళాకారులతో కలిసి స్టెప్పులు వేశారు.

నేడు పాట్నాలో ప్రతిపక్షాల భేటీ

- హాజరుకానున్న 20 పార్టీల అధినేతలు
- బీఆర్ఎస్,టీడీపీ,వైసీపీ,బీజేడీ,బీఎస్పీ,జేడీఎస్ దూరం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కేంద్రంలోని మోడీ సర్కార్‌ను గద్దెదించేందుకు ప్రతిపక్షాలు ఏకం అవుతున్నాయి. నేడు (శుక్రవారం) బీహార్‌లోని పాట్నాలో బీజేపీయేతర పార్టీల మధ్య చారిత్రక సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో 20 పార్టీల నుంచి ఆయా పార్టీల అధినేతలు పాల్గొననున్నారు. హాజరయ్యే నాయకులకు స్వాగతం పలుకుతూ బీహార్ అధికార కూటమిలోని సభ్యులు పాట్నా వీధుల్లో భారీ ఆర్చ్‌లు, బ్యానర్‌లను ఏర్పాటు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీయేతర పార్టీలను ఏకం చేసేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేస్తున్న ప్రయత్నాల్లో ఈ సమావేశం ఒక భాగం. ఈ సమావేశానికి కాంగ్రెస్, డీఎంకే, జేడీయూ, ఆర్‌జేడీ, సీపీఐ(ఎం), సీపీఐ, ఎన్‌సీపీ, టీఎంసీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), జేఎంఎం, ఆప్, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ(ఎంఎల్), నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, కేరళ కాంగ్రెస్, ఐయుఎంఎల్ తదితర పార్టీల నేతలు హాజరుకానున్నారు. ఆర్ఎల్‌డీ అధినేత జయంత్ చౌదరి తాను విదేశీ పర్యటనలో ఉన్నందున సమావేశానికి హాజరుకాలేనని, తమ మద్దతు ఉంటుందని బీహార్ సీఎం నితీష్ కుమార్‌కు లేఖ రాశారు. ఏపీలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వైసీపీ, టీడీపీ, తెలంగాణలోని అధికార పార్టీ బీఆర్ఎస్ ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి. వైసీపీ, టీడీపీ పార్టీలు తొలి నుంచి బీజేపీతో అంటకాగుతున్నాయి. పార్లమెంట్‌లో అనేక సందర్భాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వైసీపీ, టీడీపీ పార్టీలు బీజేపీకి మద్దతు తెలిపాయి. మరోవైపు బీజేపీపై పోరాడుతున్నట్టు చెబుతున్న బీఆర్ఎస్ కూడా ఈ సమావేశానికి దూరంగా ఉంది. అలాగే బీజేడీ, బీఎస్పీ, జేడీఎస్ తదితర పార్టీలు కూడా ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.

మణిపూర్‌పై చర్చించేందుకు 24న అఖిలపక్షం

న్యూఢిల్లీ : ఈశాన్య మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై చర్చించేందుకు ఈ నెల 24న అఖిలపక్ష సమావేశాన్ని కేంద్ర హౌం మంత్రిత్వ శాఖ నిర్వహించనున్నది. మణిపూర్‌లో మే 3న ప్రారంభమైన హింస నేటికీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. వందలాది మంది మరణించారు. దాదాపు 60 వేల మంది శరణార్థులయ్యారు. వందలాది ఇండ్లు, షాప్‌లు దహనమయ్యాయి. ఇంటర్‌నెట్ పునరుద్ధరణ కాలేదు. దాదాపు 50 రోజులు కావస్తున్నది. నేటికీ హింస కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఈ నేపథ్యంలో మణిపూర్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రితో సహా పది రాజకీయ పార్టీల నేతలు ఢిల్లీ పర్యటన చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి తమ గోడును వినిపించుకుందామని భావించారు. అయితే ప్రధాని మోడీ వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అమెరికా పర్యటనకు వెళ్లిపోయారు.

దీంతో మణిపూర్ అఖిలపక్ష నేతలు వివిధ జాతీయ పార్టీల నేతలను కలిసి తమ సమస్యలను వివరిం చారు. ఆయా సందర్భంగాల్లో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ తది తర పార్టీలు అఖిలపక్ష సమా వేశం ఏర్పాటు చేసి, ఆ రాష్ట్ర రాజకీయ నేతలతో చర్చించా లని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర హౌం మంత్రిత్వ శాఖ స్పందించింది. మణిపూర్‌లో పరి స్థితిపై చర్చించేందుకు కేంద్ర హౌం మంత్రి అమిత్ షా జూన్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారని హౌం మంత్రిత్వ శాఖ ఒక ట్వీట్‌లో పేర్కొంది.

బోనమెత్తిన గోల్కొండ

నవతెలంగాణ-మెహదీపట్నం


గోల్కొండ కోట బోనమెత్తింది. డప్పు చప్పుల్ల హోరు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు.. యువత కేరింతలతో రాష్ట్రానికి ప్రత్యేకమైన బోనాల పండుగ ఉత్సవాలు గురువారం హైదరాబాద్ గోల్కొండలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల ఉత్సవాలు చారిత్రక కోట గోల్కొండ నుంచి తొలి బోనం బయలుదేరడంతో షురూ అయ్యాయి. దాంతో నగరంలో నెల రోజులపాటు జరగనున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.

మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ లంగర్‌హౌస్ చౌరస్తా వద్ద బంగారు బోనానికి దీపం వెలిగించి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఊరేగింపును ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలకు ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుల ఇంట్లో పూజలు నిర్వహించారు. లంగర్ హౌస్ నుంచి ప్రారంభమైన రథం, తొట్టెల ఊరేగింపు కోటలోని జగదాంబికా ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి 2022 వరకు రూ.78 కోట్లు కేటాయించిందని తెలిపారు. బోనాల పండుగ ముందు రోజే తొలకరి పలకరింపు శుభదాయకం అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఈ బోనాల జాతర తక్కువ మందితో ప్రారంభమయ్యేదని, నేడు లక్ష మందికి పైగా ప్రజలు గోల్కొండ బోనాల జాతరలో పాల్గొనేందుకు వస్తున్నారని తెలిపారు. బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 కోట్లు కేటాయించిందని చెప్పారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు ఇతర ఆలయాలకు కూడా ఆర్థిక సహాయం చేస్తున్నట్టు తెలిపారు.

సబ్బండ వర్గాలకు పెద్ద పీట

- బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

గోల్కొండ ఆషాఢ బోనాల పండుగ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు రాష్ట్ర ప్రజలకు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నదనీ, తద్వారా సబ్బండ వర్గాల సంస్కృతికి పెద్దపీట వేసిందని తెలిపారు. డప్పులు, మేళ తాళాల నడుమ మహిళలు బోనమెత్తుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పిస్తారని పేర్కొన్నారు. తర తరాల తెలంగాణ సాంస్కృతిక ఆధ్యాత్మిక అస్తిత్వానికి బోనాల పండుగ ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ఈ పండుగ ప్రారంభం సందర్భంగా వాన చినుకుల రూపంలో మనందరిమీద అమ్మవారు కరుణాకటాక్షాలు కురిపిస్తుండడం శుభసూచకమన్నారు. అమ్మవారి ఆశీస్సులు, దీవెనలు రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా కొనసాగుతూనే ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా, దేశవ్యాప్తంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు.



వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక వాహనం

- అటవీ శాఖకు అందజేసిన యూనియన్ బ్యాంకు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఆపదలో ఉన్న వన్య ప్రాణులు, పక్షులను కాపాడేందుకు అటవీ శాఖ సరికొత్త రక్షణ వాహనాన్ని (రెస్క్యూ వెహికిల్) అందుబాటులోకి తెచ్చింది. సామాజిక బాధ్యతలో భాగంగా హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కేంద్రంగా పనిచేస్తున్న యూనియన్ బ్యాంక్ శాఖ సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో ఈ వాహనాన్ని సమకూర్చింది. అరణ్య భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు, అటవీ శాఖకు ఈ వాహనాన్ని అందించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు, చుట్టు పక్కల జిల్లాల్లో వన్య ప్రాణులు మానవ ఆవాసాల్లోకి వచ్చినపుడు, ప్రమాదాల బారిన పడినా, నెమళ్లు, ఇతర పక్షులు చిక్కుకుపోయిన సందర్భాల్లో వాటిని రక్షించేందుకు ఈ వాహనం పనిచేస్తుందని చెప్పారు. జంతువుల వేట, స్మగ్లింగ్ కార్యకలాపాలను నిరోధించేందుకు కూడా ఈ వాహనంతో కూడిన యాంటీ పోచింగ్ టీమ్ సత్వరంగా స్పందిస్తుందన్నారు. ప్రత్యేక వాహనంతో, సుశిక్షితులైన సిబ్బంది, ఆధునిక యంత్ర సామాగ్రి రెస్క్యూ టీమ్ లో అందుబాటులో ఉంటారని తెలిపారు. అరణ్య భవన్ టోల్ ఫ్రీ నెంబర్ 18004255364 కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే, రెస్క్యూ టీమ్ వెంటనే స్పందిస్తుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారులు చీఫ్ జనరల్ మేనేజర్ కే. భాస్కర రావు, డీజీఎం కే. శ్రీధర్ బాబు, విజయ్ కుమార్, అటవీ శాఖ ప్రత్యేక అధికారి (వైల్డ్ లైఫ్) శంకరణ్, డీసీఎఫ్ సంహిత, యాంటీ పోచింగ్ రేంజ్ ఆఫీసర్ రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను గుంజుకుంటున్నారు

హెచ్ఎండీఏ లేఅవుట్లు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగం

పరిహారం ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ల్యాండ్ పూలింగ్ పేరుతో 30ఎకరాల భూములను లాక్కొవడానికి అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఎకరాకు 500 గజాల స్థలం ఇస్తామంటూ పట్టాలు ఇవ్వకుండా నమూన పట్టాలు ఇస్తున్నారు' అని బాచుపల్లికి చెందిన కమ్మెట రామస్వామి ఆవేదన వ్యక్తంచేశారు.

'70ఏండ్లుగా సాగు చేసుకుంటున్నాం. కరెంట్ సౌకర్యంలేకపోతే పోరాడి తెచ్చుకున్నాం. తీరా పంటలు వేసుకునే సమయంలోనే అధికారులు మా భూములు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు.

భూమిని నమ్ముకుని బతుకు తున్నాం. దీన్ని గుంజుకుంటే బదికేదెలా?' అని బోడుప్పల్‌కు చెందిన నత్తిమైసయ్య వాపోయారు. ఇలాంటి పరిస్థితి ఇద్దరికే కాదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అసైన్డ్ భూ బాధితులందరిదీ ఇదే దుస్థితి. సర్కార్ ఇచ్చిన అసైన్డ్ భూముల్లోనే లేఅవుట్లతోపాటు వైకుంఠదామాలు, రైతు వేదికలు, పల్లె పకృతి వనాలను నిర్మిస్తున్నారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడెకరాల భూమిలో జాంభవంతుని గుడితోపాటు వేద పాఠశాల, కమ్యూనిటీ హాల్ ఉన్నా ఈ భూమిని లాక్కొవాలని అధికారులు కసరత్తు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. భూములను తీసుకుంటున్న ప్రభుత్వం ఏలాంటి పరిహారం ఇవ్వడానికి కూడా ముందుకురావడంలేదు.

30వేల ఎకరాలకు ఎసరు

రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో మోడల్ లేఅవుట్ల పేరుతో అభివృద్ధి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. అప్పట్లో పేదలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్, భూదాన్, సీలింగ్ భూములను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నది. భూ యజమానులకు నామమాత్రపు పరిహారం ఇచ్చి లాక్కోవాలని ప్రయత్నాలు చేస్తున్నది. అందులోభాగంగానే ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు సర్కార్ ఇచ్చిన అసైన్డ్, భూదాన్, సీలింగ్ భూములు మొత్తం సుమారు 30వేల ఎకరాలను గుంజుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లిలో 30 ఎకరాలను 20మంది రైతులకు అప్పట్లో ఇచ్చారు. మేడిపల్లిలో 116ఎకరాల భూమిని 38మంది రైతులకు, బోడుప్పల్‌లో 61మంది రైతులకు 336 ఎకరాలు ఇచ్చారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని మేకలగట్టు గ్రామంలో 70 మంది రైతులకు 120 ఎకరాలు, సూర్యాపేటలో 23మంది రైతులకు 60 ఎకరాలు కేటాయించారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో 27 మందికి చెందిన 102ప్లాట్లు, కవాడిపల్లిలో 32 మందికి చెందిన 91 ప్లాట్లు, రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్‌లో 120 మంది రైతులకు సంబంధించిన 200 ఎకరాలు, తుర్కఎంజాల్ మున్సిపాలిటీ పరిధిలో తొర్రూర్‌లో 100 ఎకరాలు, మోకిలా గ్రామంలో 160 ఎకరాలు, మన్సాన్‌పల్లిలో 38.22 ఎకరాల భూములపై అధికారులు కన్నేశారు.

> **ఆ భూములను లాక్కోవద్దు**
>
> భూమి హక్కు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి భూమిని పేదలకు దూరం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. అసైన్‌భూములను గుంజుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నది. నిషేధిత జాబితా నుంచి అసైన్ భూములను తొలగించడంతోపాటు రీసర్వే చేయాలి. రైతు బంధు కూడా ఇవ్వాలి.
>
> - తెలంగాణ భూ రక్షణ సమితి (టీబీఆర్ఎస్) అధ్యక్షులు బుగ్గ మైసయ్య

పరిహారం ప్రశ్నార్థమే

పేదలకు సంబంధించిన అసైన్డ్ భూములను లబ్ధిదారుల నుంచి రెవెన్యూశాఖ సరెండర్ చేసుకుని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగిస్తున్నారు.

ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని బాచుపల్లి, మేడిపల్లి, మన్నెగూడ, మునగనూరు, కవాడిపల్లి, బుద్వేల్ ప్రాంతాల్లో అసైన్డ్ భూములను వేలం ద్వారా అమ్మడం, పెద్దపెద్ద లేఅవుట్లలో ప్లాట్లు చేసి అమ్ముతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్నారు. ఈ అసైన్డ్ భూముల ద్వారా కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్న సర్కార్ పేదలకు నయాపైసా పరిహారం ఇవ్వడానికి ముందుకురావడంలేదు.

సర్కార్ కేటాయించిన అసైన్డ్ భూమి తనకు దక్కదేమోనని సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని బోర్పట్లకు చెందిన జక్కు నందీశ్వర్ ఆత్మహత్య చేసుకున్నాడు.

యుఐటీపీ అవార్డు కోసం నామినేషన్లకు ఎల్అండ్‌టీ మెట్రో ఎంపిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (యూఐటీపీ) అవార్డులు-2023 కోసం స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఈనెల 4 నుంచి 7వరకు యూఐటీపీ గ్లోబల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎలివేటింగ్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ హైదరాబాద్, ఇండియాపై సమర్పించిన నామినేషన్ ఫైనలిస్టులలో ఒకటిగా ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ (ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్) ఎంపికైంది. మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ కేటగిరీ కింద వచ్చిన 500 నామినేషన్‌లలో ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్ నామినేషన్ ఫైనలిస్టులలో ఒకటిగా షార్ట్‌లిస్ట్ చేశారు.

ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ సీఎండీ కె.వి.బి.రెడ్డి మాట్లాడుతూ.. తమ నామినేషన్ ఫైనలిస్టులలో ఒకటిగా షార్ట్‌లిస్ట్ కావడం గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌కు, ప్రయాణీకులకు పర్యావరణ అనుకూలమైన రవాణాను అందించడంలో తమ ప్రయత్నాలను గుర్తించినందుకు అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణీకుల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. సురక్షితమైన, సమర్థవంతమైన రవాణా పరిష్కారాలను అందించడానికి అంకితం చేయడం జరిగిందన్నారు.

వాన కబురు

- పలు జిల్లాలకు భారీ వర్షసూచన
- వేగంగా విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు
- రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో భారీ వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు అన్నదాతలకు వాన కబురును పంపాయి. ఖమ్మం గుమ్మంలో అడుగుగిడిగిన రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు రోజుల్లో రాష్ట్రమంతటా వ్యాప్తి చెందే అవకాశమున్నాయి. తెలంగాణమీదుగా కిందిస్థాయి నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 40 డిగ్రీలకు పడిపోయాయి. పలు జిల్లాల్లో వచ్చే నాలుగైదు రోజుల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించిన ఆ జాబితాలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలున్నాయి. 25,26 తేదీల్లో కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికను విడుదల చేసింది. రాబోయే 48 గంటల పాటు హైదరాబాద్ పరిధిలోనూ వాతావరణం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయి.

307 ప్రాంతాల్లో వర్షం

నైరుతి రుతుపవనాల ఆగమనంతో రాష్ట్రంలో గురువారం రాత్రి 10:30 గంటల వరకు 307 ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో ఎక్కువ ప్రాంతాల్లో వానలు పడ్డాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో 9.7 సెంటీమీటర్ల భారీ వర్షం పడింది. ఆ తర్వాత నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్‌లో 7.0, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం అలంగాపురంలో 6.45 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. 90 ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది.

కేసీఆర్ పాలనకు చరమగీతం

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- భట్టి విక్రమార్కకు పరామర్శ



నవతెలంగాణ-కేతపల్లి

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేందుకే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర చేపట్టారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాదయాత్రలో భాగంగా నల్లగొండ జిల్లా కేతపల్లి మండల కేంద్రంలో అస్వస్థతకు గురైన భట్టి విక్రమార్కను గురువారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి పొంగులేటి పరామర్శించారు.బీఆర్ఎస్ పరిపాలనలో ప్రజల కష్టాలను తెలుసుకొని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎర్రటి ఎండను, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పేరిట వంద రోజుల్లో 1,150 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు తన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కలలు నెరవేరాలంటే ఎవరితో సాధ్యమో అందరికీ తెలుసునని పొంగులేటి అన్నారు. ఆ కలలు నెరవేర్చడానికి భట్టి పాదయాత్ర నూటికి నూరు శాతం విజయవంతం కావాలని కోరుకుంటున్నానన్నారు. సీఎం కేసీఆర్ మాయ మాటలతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతాయని, 100శాతం కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చేరికల సమయంలో తమ మధ్య సీట్ల ఒప్పందం లేదన్నారు. కేసీఆర్ ఓటమే లక్ష్యంగా ఐక్యతతో పని చేస్తాం అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరిని తీసుకోవాలో వద్దో తాను చెప్పే వ్యక్తిని కాదన్నారు.

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలోకి ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్వాగతిస్తున్నామన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో డీహైడ్రేషన్‌కు గురైన భట్టి విక్రమార్కను వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని చెప్పారు. అందువల్ల పాదయాత్రకు రెండు, మూడ్రోజులు విరామం ఇవ్వాలని ఒత్తిడి చేసినట్టు తెలిపారు. భట్టి కోలుకున్న తర్వాత సూర్యాపేటలో పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు.

ప్రజల సంపదను దోపిడీ చేస్తున్న బీఆర్ఎస్ పాలకులు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంపదను బీఆర్ఎస్ పాలకులు దోపిడీ చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కలలు, లక్ష్యాలు నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అప్పుడే ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని గ్రహించి కాంగ్రెస్‌లోకి రావాలని నిర్ణయించుకున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సీఎల్పీ పక్షాన స్వాగతిస్తున్నామని చెప్పారు. సోనియా గాంధీ ఆశించిన తెలంగాణ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశం అయిన తర్వాత పార్టీలో చేరికలు, పాదయాత్ర ముగింపు సభ తేదీ ప్రకటన ఉంటుందని తెలిపారు. ఏఐసీసీ నిర్ణయం మేరకు బహిరంగ సభలు ఉంటాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఖమ్మం సభ ద్వారా ప్రజలకు సందేశం, భరోసా ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కంప సాటి శ్రీనివాస్ యాదవ్, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మెన్ బోళ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవమే లక్ష్యంగా జూలైలో టీడీపీ బస్సు యాత్ర

- త్వరలోనే షెడ్యూల్ : కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం పార్టీ పునర్ నిర్మాణం, పూర్వ వైభవమే లక్ష్యంగా జూలై మొదటి వారంలో బస్సు యాత్రను చేపట్టనున్నట్టు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి నాయకులతో రూట్‌మ్యాప్ ఖరారుపై చర్చించిన తర్వాత బస్సు యాత్ర షెడ్యూల్‌ను ప్రకటిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో మల్కాజ్‌గిరి, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో జ్ఞానేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు ఎంతో దూరంలో లేవనీ, పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువచ్చి గెలుపు కోసం శ్రమించాలని పార్టీ నేతలకు సూచించారు. ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు.

టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారాక, అధికార పార్టీ పట్ల ప్రజా వ్యతిరేకత బాగా పెరుగుతున్నదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచే అవకాశాల్లేవన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంతటా సమిష్టిగా కృషి చేస్తే బస్సుయాత్ర విజయవంతం అవుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్ర విజయవంతమైతే పార్టీకి మంచి ఊపు రావడం తథ్యమనీ, అది వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు దోహదపడుతుందన్నారు. వాస్తవానికి తెలంగాణలో టీడీపీ ఇప్పటికీ బలంగా ఉందన్నారు. పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ప్రజా తీర్పును, క్యాడర్ నమ్మకాన్ని వమ్ము చేసి అధికార పార్టీలోకి ఫిరాయించి మోసం చేశారని విమర్శించారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ముఖ్య నేతలు పార్టీని వీడటంతో కొన్నేండ్లుగా నిస్తేజంలో ఉన్న పార్టీ శ్రేణులు, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ద్వారా ఉత్సాహంతో ఉరకలేస్తున్నాయని అన్నారు.

తాను టీడీపీ పగ్గాలు చేపట్టిన తర్వాత క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి 96 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారం భించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నందమూరి సుహాసిని, సాయితులసి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై సామూహిక లైంగికదాడి

- జువైనైల్ హోంకు నిందితులు

నవతెలంగాణ-ఘట్కేసర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన జరిగింది. గురువారం ఓ బాలికపై ఇద్దరు మైనర్‌లు లైంగికదాడి చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఘట్కేసర్‌లో పనిచేస్తున్న ఓ బాలికను అదే ప్రాంతంలో నివాసముంటున్న ఓ బాలుడు ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. దాంతో ఆమెను తీసుకెళ్లి ఘట్కేసర్‌లోని స్నేహితుని ఇంటిపైన ఇద్దరూ కలిసి బాలికపై లైంగికదాడి చేశారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇద్దరు బాలురులను అదుపులోకి తీసుకున్నారు. వారిని జువైనైల్ హోమ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు మైనర్లపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

13 ఏండ్ల బాలికపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్పడిన లైంగికదాడి ఘటన మరవకముందే.. మరో ఇద్దరు మైనర్లపై లైంగికదాడి జరిగిన ఘటనలు ఆలస్యంగా వెలుగుచూశాయి. ఓ ఘటనలో పదేండ్ల బాలికపై మైనర్ అబ్బాయి లైంగికదాడికి పాల్పడగా.. మరో ఘటనలో 16 ఏండ్ల అమ్మాయిపై 21 ఏండ్ల యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలు నిజామాబాద్ రూరల్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూశాయి. రూరల్ మండలంలోని మారుమూల గ్రామంలో పదేండ్ల బాలికపై 16 ఏండ్ల మైనర్ బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురించి ఎవరికైనా చెబితే చంపేస్తానని మైనర్ బాలుడు భయపెట్టినట్టు తెలిసింది.

పది రోజులుగా మానసికంగా కృంగిపోయిన బాలిక గురువారం ఆమెకు జరిగిన దారుణాన్ని వాళ్ల మేనమామ దృష్టికి తీసుకెళ్లింది. దాంతో బాలిక తల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, బాలిక తండ్రి పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాడు.ప్రస్తుతం అబ్బాయి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మరో ఘటనలో ముబారక్‌నగర్‌లోని 16 ఏండ్ల అమ్మాయిపై 21 ఏండ్ల యువకుడు లైంగిక దాడి ఘటన.. అమ్మాయి గర్భందాల్చడంతో రహస్యంగా అబార్షన్ చేయించినట్టు తెలిసింది.

నిజమైన తెలంగాణ నిర్మాణమే కాంగ్రెస్ లక్ష్యం

అనైక్యత వల్లే రెండుసార్లు ఓడిపోయాం... ఈసారి విజయం మాదే...

- బీజేపీ గెలిస్తే రాజకీయాలు వదిలేస్తా
- బీఆర్ఎస్, బీజేపీకి లోపాయికారి ఒప్పందం
- రెండు నెలల ముందే 50 మంది అభ్యర్థులను ప్రకటిస్తాం
- కుటుంబానికి ఒక్కటే టికెట్
- మెజార్టీ ఎమ్మెల్యేల నిర్ణయమేరకే సీఎం అభ్యర్థి ఎంపిక
- వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేస్తా
- నవతెలంగాణ ఇంటర్వ్యూలో మహేష్‌కుమార్ గౌడ్




నిజమైన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకుపోతుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. మాలో ఉన్న అనైక్యత వల్లే రెండుసార్లు కాంగ్రెస్ ఓడిపోయిందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీజేపీ పది, పదిహేను సీట్లకు మించి గెలవదన్నారు. బీజేపీ గెలిస్తే రాజకీయాలు వదిలేస్తానని చెప్పారు. ఆపార్టీకి పోటీ చేసేందుకు అభ్యర్థులే లేరని తెలిపారు. ఎన్నికలకు రెండు నెలల ముందుగానే 50 మంది అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. పార్టీ నిబంధనావళి ప్రకారం ఒక కుటుంబానికి ఒక్కటే టికెటు ఇస్తామని వెల్లడించారు. మెజార్టీ ఎమ్మెల్యేల నిర్ణయంమేరకే సీఎం అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. సీఎం అయ్యే శక్తి సామర్థ్యాలు చాలా మందికి ఉన్నాయని తెలిపారు. పార్టీ కార్యకర్తగా తాను పోటీ చేయాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నవతెలంగాణకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలన ఎలా ఉంది? ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిందా?

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ...ఆనాడు కేసీఆర్ చేసిన అబద్ధపు ప్రచారాలు, ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు. కాంగ్రెస్‌లో ఉన్న అనైక్యత వల్ల 2014,2018 ఎన్నికల్లో ఓడిపోయాం. తొమ్మిదేండ్ల తర్వాత ప్రజలు మళ్లీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకను గుణంగా బీఆర్ఎస్ పాలన జరగలేదు. ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం...దాదాపు 15వేల కోట్లకు పైగా మిగులు ఉన్నది. కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతో అప్పుల రాష్ట్రంగా అవతరించింది. ఎన్నికల్లో ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చలేదు. ఆచరణ సాధ్యం కానీ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కమీషన్లు దండుకున్నారు.ఆ ప్రాజెక్టు పేరిట లక్షల కోట్లు గోదావరి నదిలో పోసింది. అధికారులు, తాబేదార్లుగా ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు, ధనికులయ్యారు. ధనిక రాష్ట్రం ఇవాళ బీద రాష్ట్రమైంది. ప్రత్యేకంగా ధరణి పోర్టల్ లోసుగులు ఉపయోగించుకుని ధనికులు మరింత ధనికులవుతున్నారు. బీదవారిని ధనికులను చేయడం లేదు. పేదలకు వైద్యం అందడం లేదు. దేశంలోనే బీద రాష్ట్రంగా దిగజారిపోతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, వెనక్కు నెట్టివేయబడ్డారు. గొర్లు, బర్లు ఇచ్చిన సంతృప్తి పరిచారు. ఇవన్నీ చూసిన ప్రజలు ఇక చాలు దొర అంటున్నారు. కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. కాంగ్రెస్ మాటిస్తే నిలబడుతుంది. నిజమైన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుంది.

కాంగ్రెస్‌లో అంతర్గత కొట్లాటలే తప్ప పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే తపన లేదన్న భావన క్యాడర్‌లో ఉన్నది? మీ అభిప్రాయం?

అంతర్గత విభేదాలు ప్రతీ పార్టీలోనూ ఉంటాయి. బీజేపీలో లేవా? బీజేపీ అధ్యక్షుడిని తొలగించి కొత్త అధ్యక్షుడిని నియమించాలనే ప్రయత్నాలున్నాయి. కాంగ్రెస్‌లో ముఠాలు ఉంటాయనేది నానుడి. పార్టీలో పరిపూర్ణమైన స్వేచ్ఛ ఉంటుంది. బాహాటంగా విమర్శించుకుంటారు. బాహాటంగా అభిప్రాయాలు వెలిబుచ్చే అవకాశం ఉన్నది. సమయం వచ్చినప్పుడు ఏకమవుతారు. కర్నాటకలో చూశాం. రెండు పెద్ద పవర్ సెంటర్లు ఉన్నప్పటికీ ఎన్నికలొచ్చినప్పుడు సిద్ధరామయ్య, డికే శివకుమార్ కలిసి పని చేశారో, ఇక్కడ కూడా ఎంత పెద్ద నాయకులు ఉన్నా...అధికారం మా కోసం కాదు...ప్రజల కోసమైన అధికారం రావాలి. తెలంగాణ ప్రజలు దగాపడ్డారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుకు పోతాం.



> **ఈసారి మీరెక్కడ పోటీ చేస్తారు?**
>
> నేను ఒక కార్యకర్తగా పోటీ చేయాలని కోరుకోవడం సహజం. పార్టీ నిర్ణయమే శిరోధార్యం. నేడు పోటీ చేయాలనుకుంటున్నది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం.

కాంగ్రెస్‌లో మనస్పర్థలు సమసిపోయినట్టేనా?

ఉంటాయి. ఇంత పెద్ద పార్టీ అయినప్పుడు మనస్పర్థలుం టాయి. నాయకుల మధ్య విభేదా లుంటాయి. ఏఐసీసీ ఇంచార్జి ఆధ్వర్యంలో వ్యక్తిగత తగాదాలు సద్దుమణుగుతాయి. వ్యక్తిగత, ప్రజాస్వామిక స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉన్నట్టు ఏ పార్టీలో ఉండదు. ఏ ఇతర పార్టీల్లో ఉండదు.

బీజేపీకి బీఆర్‌స్సే ప్రత్యామ్నాయమనేది బాగా వినిపిస్తుంది? కాంగ్రెస్ పరిస్థితి ఏంటి?

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు చెప్పకనే చెప్పారు. అభ్యర్థులు కూడా లేరని కూడా చెప్పారు. బీజేపీకి 10 నుంచి 15 సీట్లు మినహా వచ్చే అవకాశం లేదు. ఒకవేళ గెలిస్తే మేము రాజకీయాలను వదిలేస్తాం. మతాల మధ్య విచ్చిన్న సంస్కృతి ఉన్న నియోజకవర్గాలు తప్ప ఆపార్టీ గెలిచే అవకాశం లేదు. ఎమ్మెల్యే స్థాయి నాయకులు అసలే లేరు. కాంగ్రెస్ పార్టీని గెలువనీయంటున్నారు. దీని అర్థమేంటి? వారిద్దరికి లోపాయికారి ఒప్పందం ఉంది. కేసీఆర్‌కు స్పష్టమైన ఒప్పందం ఉంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌ను ఎన్నుకునే ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. దక్షిణాదిలో బీజేపీకి అవకాశం లేదు. కర్నాటకలోనూ అవకాశం ఉంది. తెలంగాణలో ఉన్న కుల, మత సమీకరణ వల్ల బీజేపీకి చాన్స్ లేదు. గెలిస్తే పది సీట్లకు మించి గెలువదు.

బీఆర్ఎస్ బీజేపీపై దాడి చేస్తుంది? కేసీఆర్‌ను తప్ప బీజేపిపై విమర్శలు చేయరు కదా?

రెండు పార్టీలకు సమాన దూరంగా ఉన్నాం. బీఆర్ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదు. ఆ విషయాన్ని రాహుల్‌గాంధీ చెప్పారు. బీజేపీకి, బీఆర్ఎస్‌కు లోపాయికారి ఒప్పందం ఉన్నది. బీజేపీ ఇక్కడ ఉందనే చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నాయి కాబటి బీఆర్ఎస్‌ను టార్గెట్‌గా చేసుకున్నాం. అంత మాత్రానా బీజేపీని వదిలే ప్రసక్తే లేదు. ఈ రెండు పార్టీలను వేరుగా చూడటం లేదు. లిక్కర్ స్కాంలో కవితను ఏ విధంగా తప్పించారో చూశాం.

కాంగ్రెస్‌ను తట్టుకునేందుకు ఈ రెండు పార్టీలు వేర్వేరు అన్నట్టు డ్రామాలాడుతున్నాయి. కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ అంటూ యూపీఏ భాగస్వామి పార్టీల వద్దకు పోతున్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల వద్దకు పోలే. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీతో కలిసి ఉండాలనేది కేసీఆర్ ప్రయత్నం.

ఎన్నికలకు ఆర్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటిస్తామంటూ రేవంత్‌రెడ్డి చెప్పారు? అటువంటి ప్లాన్ ఉందా?

గతంలో అనుకున్నాం కానీ సాధ్యం కావట్లేదు. అయితే రెండు నెలల ముందు 50 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటిస్తాం. క్లియర్‌గా ఉన్న సీట్లను ముందు ప్రకటిస్తాం. అటువంటి సీట్లు 50 వరకు ఉండొచ్చు. మిగతా 69 సీట్లలో వివాదాలు లేవు కానీ పోటీ తీవ్రంగా ఉంది. బీజేపీలో పోటీ చేస్తామని అడిగే నాథుడే లేరు. గతంలో చివరి నిమిషంలో ప్రకటించడం ద్వారా పార్టీకి కొంత నష్టం జరిగింది. ఈసారి అలా జరగకూడదని నిర్ణయించాం.

కర్నాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణపై ఎలా ఉండబోతుంది?

ఎన్నికల్లో ప్రజల తీర్పు కీలకమైంది. ప్రజా సొమ్ము దోస్తే ఊరుక్కోబోమంటూ అక్కడి ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇక్కడ కూడా బీఆర్ఎస్ దోపిడీని వ్యతిరేకిస్తున్నారు. కర్నాటకలో సగభాగం తెలంగాణలో ఉండేది. ప్రజల ఆలోచనల్లో సారూప్యత ఉంది. బీజేపీ ట్రయాంగిల్ ఫైట్ అయితే బీఆర్ఎస్ లాభపడుతుంది అని కేసీఆర్ ఆలోచన. కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్సే మధ్య పోటీ ఉంటుంది. స్ట్రెట్ ఫైట్‌లో మేమే గెలుస్తాం. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలకు దోచుకున్న డబ్బుఉంది. కర్నాటక ఎన్నికలు చూసిన తర్వాత డబ్బు పని చేయదనేది తేలిపోయింది. దాన్ని అధిగమించి గెలిచి తీరుతాం.

షర్మిల డికె శివకుమార్ భేటీ కావడం పట్ల మీ అభిప్రాయం?

బీజేపీ ఎలుబడిలో ఉన్న రాష్ట్రం కర్నాటక. అటువంటి రాష్ట్రంలో ఒక సెక్యూలర్ పార్టీ అధికారంలోకి రావడం శుభా పరిణామం. ఈ సందర్భంగా డికేను వైఎస్ షర్మిల కలిసి అభినందించడం సహజం. అది ఎవరైనా చేస్తారు. అందులో తప్పేమీ లేదు.

వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్ధకం మెదడును నిస్తేజం చేస్తుంది - డావిన్స్

నోరు పారేసుకున్న జో బైడెన్

సంపాదకీయం

చైనా అధినేత షీ జిన్‌పింగ్ ఒక నియంత అని అమెరికా అధ్యక్షుడు మంగళవారం నోరు పారవేసుకున్నాడు. విషమించిన సంబంధాల పునరుద్దరణలో భాగంగా తమ విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్‌ను బీజింగ్ పంపిన బైడెన్ అతగాడు స్వదేశం తిరిగి రాగానే అలా ఎందుకు మాట్లాడినట్లు? నోరా చెంపకు చేటు తేకే, కాలు జారితే తీసుకోవచ్చు గానీ

> ఉక్రెయిన్‌కు మద్దతుగా నేరుగా రాలేదని అనుకుంటున్నారేమో తైవాన్ అంశంలో ఊరుకునేది లేదని గతంలో జో బైడెన్ అన్నాడు. తమ అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకుంటే మాడు పగలగొడతామని షీ తీవ్రంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. తమ నేతను నియంతగా వర్ణించిన బైడెన్ మంచీ మర్యాద తెలియని వ్యక్తిగా చైనా ప్రతినిధి వర్ణించాడు. బైడెన్ మాటలు వాస్తవాలకు విరుద్దంగా ఉన్నాయి. దౌత్య మర్యాదలను తీవ్రంగా ఉల్లంఘించటమే. చైనా రాజకీయ మర్యాదను అతిక్రమించటమే అన్నాడు. వదరుబోతుతనం ప్రపంచ రాజకీయాలలో నష్టం కలిగించేదే తప్ప లబ్ధి పొందిన ఉదంతమేదీ లేదు.

నోరు జారితే వెనక్కు తీసుకోలేమనే సామెతల గురించి అగ్రరాజ్య అధినేత, ఎనభై సంవత్సరాలు దాటిన జో బైడెన్‌కు తెలియదా? లేక ముదితో మతి తప్పిన మాటలుగా భావించాలా? ఏ వంకా లేకపోతే డొంకను పట్టుకు ఏడ్చాడట వెనుకటి కెవడో. జనవరిలో వాతావరణ పరిశోధనల కోసం చైనా వదిలిన ఒక బెలూన్ అమెరికా, కెనడాల వైపు వెళ్లింది. దాన్ని గూఢచర్యం కోసం పంపినట్లు ఆరోపించిన అమెరికా కూల్చివేసేందుకు శత్రుదేశం మీద దాడికి దిగిన మాదిరి యుద్ధ విమానాలను పంపి పెద్ద హడావుడి చేసింది. జనం ఆ ఉదంతాన్ని మరచిపోయారు. డెమోక్రటిక్ పార్టీ నిధుల సేకరణ కార్యక్రమంలో జో బైడెన్ మాట్లాడుతూ సదరు బెలూన్ కూల్చివేయటంతో షీ జిన్‌పింగ్ కిందు మీదులయ్యాడని, దాన్ని పంపినట్లు అతనికి తెలియదని, తానీ అంశాన్ని సీరియస్‌గా చెబుతున్నానని, నియంతలకు అలాంటి అంశాలు తెలియవని బైడెన్ అన్నాడు.

అసలు డెమోక్రటిక్ పార్టీ నిధుల సేకరణకు చైనా బెలూన్ కూల్చివేత ప్రస్తావనకు సంబంధం ఏమిటి? 'బోడి గుండుకు మోకాలికి ముడిపెట్టినట్లు' అసందర్భప్రలాపిగా బైడెన్ తనను తానే ప్రదర్శించుకున్నాడు. చైనాతో సత్సంబంధాలు కోరుకుంటున్నట్లు చెబుతున్న పెద్దమనిషి ఇలా మాట్లాడటం ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నది ఒక స్పందన. బైడెన్ మాట్లాడుతున్న సమయంలో తాము కూల్చివేసిన చైనా బెలూన్ ఉదంతం గురించి చెప్పుకోవటాన్ని ముగించాలని బ్లింకెన్ ఒక టీవీ ఛానల్‌తో చెప్పాడు.



కావాలనే అదే ఉదంతాన్ని ప్రస్తావించి జో బైడెన్ మాట్లాడినట్లు స్పష్టం అవుతోంది. దీని వెనుక రెండు కారణాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. పద్ధతిగా ఉంటే మేమూ అలాగే ఉంటాం, లేకపోతే కుక్క కాటుకు చెప్పు దెబ్బ మాదిరి తమ స్పందన ఉంటుందని, అమెరికా ఉడుత ఊపులకు జంకేది లేదని బ్లింకెన్ బీజింగ్ పర్యటనలో చైనా నేతలు స్పష్టం చేసినట్లు వార్తల సారం. అహం దెబ్బతిని ఉక్రోషంతో ఏదో ఒక సాకుతో వదరుబోతుతనాన్ని ప్రదర్శించటం ఒకటైతే, రెండవది, అమెరికా పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోడీని సంతుష్టీకరించేందుకు, సంతోష పెట్టేందుకు కూడా అలా మాట్లాడి ఉండాలి. లడఖ్ సరిహద్దులోని గాల్వాన్ ఉదంతాలకు ముందు నుంచే తమతో జట్టుకట్టాలని నరేంద్రమోడీ మీద ఒత్తిడి తెస్తున్న అమెరికా ఘర్షణల సందర్భంగా తప్పుడు సమాచారమిచ్చి చైనా-భారత్ మధ్య దూరాన్ని మరింతగా పెంచాలని చూసింది. దాంతో తమ ఒడిలోకి వచ్చినట్లే కనిపించిన మోడీ ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉంటామన్న వైఖరితో అమెరికా ఆశాభంగం చెందింది. మింగా కక్కలేని స్థితిలో అయినను పోయిరావలె అన్నట్లుగా చేయని యత్నం లేదు. బెదిరింపులు-బుజ్జగింపుల ఎత్తుగడలో భాగంగా మరోసారి ప్రయత్నించి చూద్దాం అన్నట్లుగా చైనా నేతను నిందిస్తే మోడీ తమ చంకనెక్కుతారన్న చౌకబారు ఎత్తుగడ బైడెన్ మాటల వెనుక ఉందన్నది స్పష్టం. ప్రతి బెలూన్ గురించి ఏ దేశాధినేతకూ తెలియదు, అవసరమూ లేదు. అది చైనా నిఘా బెలూన్ అని జో బైడెన్‌కు వెంటనే తెలిసి ఉంటే కూల్చివేసేందుకు వారం పాటు ఎందుకు తటపటాయించినట్లు? ఆ బెలూన్ ఉదంతాన్ని సాకుగా చూపి నిరసన పేరుతో ఫిబ్రవరిలో జరపాల్సిన బీజింగ్ టూర్‌ను బ్లింకెన్ రద్దు చేసుకొని ఈ నెలలో వచ్చాడు. జో బైడెన్ ఆ ఉదంతాన్నే సాకుగా చూపి షీ జిన్‌పింగ్‌పై నిందలు వేశాడు. నియంత అన్న వారితో ఏమి చర్చించాలని తన మంత్రిని చైనా పంపినట్లు?

ఉక్రెయిన్‌కు మద్దతుగా నేరుగా రాలేదని అనుకుంటున్నారేమో తైవాన్ అంశంలో ఊరుకునేది లేదని గతంలో జో బైడెన్ అన్నాడు. తమ అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకుంటే మాడు పగలగొడతామని షీ తీవ్రంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. తమ నేతను నియంతగా వర్ణించిన బైడెన్ మంచీ మర్యాద తెలియని వ్యక్తిగా చైనా ప్రతినిధి వర్ణించాడు. బైడెన్ మాటలు వాస్తవాలకు విరుద్దంగా ఉన్నాయి. దౌత్య మర్యాదలను తీవ్రంగా ఉల్లంఘించటమే. చైనా రాజకీయ మర్యాదను అతిక్రమించటమే అన్నాడు. వదరుబోతుతనం ప్రపంచ రాజకీయాలలో నష్టం కలిగించేదే తప్ప లబ్ధి పొందిన ఉదంతమేదీ లేదు. అమెరికా ఉడుకుమోత్తనం మరోసారి వెల్లడైంది.



గాడ్సేను శ్లాఘించే పార్టీ!

ముస్లిం మైనారిటీలపై అడ్డూ అదుపులేని దాడులు, దానికి తోడు విద్వేష ప్రసంగాలు, మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సేను శ్లాఘించడం... వంటి వాటితో 'అమృత కాలం' అసలు అర్థం బయటపడుతోంది. మహారాష్ట్రలో, షిండే- బీజేపీ ప్రభుత్వం ముస్లిం పేర్లు ఉన్న నగరాలన్నింటికీ ఆ పేర్లను రద్దు చేసి కొత్త పేర్లు పెడుతున్న ప్రక్రియను కొనసాగిస్తోంది. ఔరంగాబాద్ ఛత్రపతి శంభాజి నగర్‌గా మారింది. ఉస్మానాబాద్ ఇప్పుడు దారాశివ్ అయింది. అహ్మద్‌నగర్ జిల్లాను అహల్యాబాయి హెూల్కర్ నగర్‌గా మార్చారు. ఈ మార్పులకు తోడు మెజారిటీవాదుల విజయం, ముస్లిం పాలకులు, చారిత్రక వ్యక్తులను రాక్షసుల్లాగా చిత్రీకరించడం జరుగుతోంది. దీనికి ముందు, మహారాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నెలల పాటు 'హిందూ జన ఆక్రోశ్ మోర్చా' ర్యాలీలు 50 వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలు ముస్లింల పట్ల విద్వేషాన్ని, హిందూ మతోన్మాదాన్ని బహిరంగంగానే ప్రదర్శించాయి. అహ్మద్‌నగర్ జిల్లాలోని షివ్‌గావ్ గ్రామంలో మత హింస చోటు చేసుకుంది. ఆ వెంటనే కొల్హాపూర్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఈ పరిస్థితికి కారణం "ఔరంగజేబ్ వారసులం"అని మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర స్థాయిలో హెూం మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ బీజేపీ నేత ఇటువంటి ప్రకటన చేయడం చూస్తుంటే ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్న వారు అనుసరించే విద్వేష రాజకీయాలు ఎలాంటివో తెలుస్తున్నాయి.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను వారి స్థానాల్లో ఉంచి ఆర్థికంగా వారిని దెబ్బ తీయడమనేది ఉద్దేశ్యపూర్వకంగా అనుసరిస్తున్న విధానంగా కనిపిస్తోంది. ఉత్తరాఖండ్‌లో ముస్లింలు జనాభాలో చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఉత్తర కాశీలోని పురోలాలో ముస్లిం దుకాణదారులను వారి దుకాణాలను ఖాళీ చేయాల్సిందిగా కోరారు. ముస్లిం దుకాణాలకు నల్లటి క్రాస్ గుర్తు పెట్టి జూన్ 15 తేదీకల్లా వాటిని ఖాళీ చేయాలని అల్టిమేటం జారీ చేశారు. మైనర్ బాలికను అపహరించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉందని వెల్లడి కావడం అందులో ఒకరు ముస్లిం యువకుడు కావడం ఇందుకు కారణంగా ఉంది. ఇప్పటికే మార్కెట్‌లో కొంతమంది ముస్లింలు తమ దుకాణాలను మూసివేసి వెళ్లిపోయారు. ఇతర ప్రాంతాల్లో కూడా బజార్లను వీడి వెళ్లాల్సిందిగా ముస్లిం వ్యాపారస్తులను డిమాండ్ చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ముస్లిం విద్వేషమే విద్వేష రాజకీయాలు, బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి మతోన్మాదంలో భాగంగా ఉంది. ఇటీవల, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ... నాథూరామ్ గాడ్సేను భారత 'పుత్రుడి'గా అభివర్ణించారు. "ఆయన మహాత్మా గాంధీ హంతకుడైనా... భారతమాత పుత్రుడు కూడా" అని పేర్కొన్నారు. గాడ్సేను ఇలా కీర్తించడమనేది బీజేపీ నాయకత్వానికి నిత్యకృత్యమై పోయింది. గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలు వెలువడడానికి కొద్ది రోజులు ముందు, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ మాట్లాడుతూ... "గాంధీజీ హత్యకు గురయ్యారు. అది వేరే విషయం. కానీ గాడ్సే కూడా దేశభక్తుడే" అని పేర్కొన్నారు. అంతకు ముందు 2019లో భోపాల్ బీజేపీ ఎంపీ తీవ్రవాద కేసులో నిందితురాలు ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ మాట్లాడుతూ... గాడ్సేను దేశభక్తుడిగా కీర్తించారు. కర్నాటకకు చెందిన బీజేపీ ఎంపీ నళిన్ కుమార్ కటీల్ కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. "గాడ్సే ఒకరినే చంపారు కానీ రాజీవ్ గాంధీ 17వేల మందిని చంపారు" అన్నారు. ఇలా అన్ని స్థాయిల్లో బీజేపీ గాడ్సే పట్ల ప్రేమ చూపించడమన్నది సర్వసాధారణంగా మారింది. గాంధీ విద్వేషకుడు సావర్కర్ పట్ల ఆరాధన కూడా దీనితో పాటూ కోరస్‌గా వినిపిస్తూ ఉంటుంది. గాడ్సేను శ్లాఘిస్తూ హిందూత్వ దేశాన్ని స్థాపించాలనుకుంటున్న పార్టీ 'నూతన భారత దేశం' గురించి చెప్తున్నదిదే.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఆది పురుష్ అంటే దేవుడనే రాముడేనా? ఎలా?

రామాయణం కావ్యంలో కథానాయకుడు రాముడు. రాముడు కల్పిత పాత్రే అయినా, ఆ కావ్యం రాయబడ్డ కాలం నాటికి లక్షల సంవత్సరాలుగా ఆది మానవ జాతులు ప్రపంచ వ్యాప్తంగా జీవిస్తున్నాయి. అలాంటప్పుడు రాముడు ఆది పురుషుడు ఎలా అవుతాడు? జీవ పరిణామ రీత్యా రాముడు ఆది పురుషుడు కాదు. అది ఒక భావన అనుకుంటే - ఆ భావనకు స్ఫూర్తినిచ్చిన గౌతమ బుద్ధుడు ఏం కావాలీ? ఖుషీనగర్‌లో పవళించి ఉన్న బుద్ధ విగ్రహ స్ఫూర్తితోనే కదా వైదికులు పాలకడలిలో విష్ణుమూర్తికి రూపకల్పన చేసుకున్నారూ? విష్ణుమూర్తి అవతారాలలో ఒకటిగా చెప్పబడే రామావతారం - ఏడవది! మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ అవతారాల్ని తీసేద్దాం. అవి పూర్తి మానవ రూపం దాల్చినవి కావు. మరి వామన, పరుశురామ అవతారాలు పూర్తి మానవ రూపాలే కదా? ఆ పురాణాల ప్రకారం చూసినా కూడా రాముడు ఆది పురుషుడు కాడు. సైన్సు ప్రకారం అసలే నిలవడు. ఎందుకంటే సృష్టివాదాన్ని, అవతార వాదాన్ని సైన్సు ఒప్పుకోదు - ఇక కొన్నేళ్ళ క్రితం రాముడిపై వచ్చిన ఒక వాస్తవ సినిమా గూర్చి చూద్దాం! ఇటీవల విడుదలైన సోదిపురుష్ గురించి కాదిది-



డాక్టర్ దేవరాజు మహారాజు

రామాయణ కావ్యాన్ని ఆధారం చేసుకుని చాలా చలన చిత్రాలు వచ్చాయి. అందులో విషయాలు, పాత్రలు, సన్నివేశాలు కాలానుగుణంగా వివిధ ప్రాంతాల్లో వివిధ రూపాలు సంతరించుకున్నాయి. మళయాళ దర్శకుడు జి. అరవింద్ 'కాంచ సీత'లో రామాయణ కావ్యాన్ని ఒక కొత్త

> 'కాంచన సీత' విడుదలయ్యాక గోదావరి ఇసుక తిన్నెలు, చెట్లు, పూలు, ఆకాశం, పంట పొలాలు, బీడు భూములు దర్శకుడు అరవిందన్ చిత్రీకరించిన తీరుకు నమస్కరించాల్సిందే! ముఖ్యంగా సీతను ఒక పాత్రగా చూపించకుండా ప్రకృతిగా చూపించిన పద్ధతికి ప్రేక్షకులు ఉద్విగ్నులయ్యారు. ఊహకు అందని అరవిందన్ శైలికి జేజేలు పలికారు. రాళ్ళ నుండి రతనాలు ఏరటం లాంటి పని. మట్టి నుండి మాణిక్యాలు తీయటం లాంటి పని - అరవిందన్ అత్యద్భుతంగా చేశాడు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని అరణ్యాల అందాలు కాదక్కడ... దర్శకుడిగా అరవిందన్ హృదయ సౌందర్యాన్ని శ్లాఘించాలి!

దృక్పథంతో దర్శించాడు. ప్రఖ్యాత మళయాళ రచయిత సి.యన్. శ్రీకాంతన్నాయర్ వాల్మీకి రామాయణంలోని ఉత్తర కాండతో ప్రభావితుడై రాసిన ఒకానొక నాటికే మళయాళ చిత్రం 'కాంచన సీత'గా రూపొందించబడింది. ఈ సినిమా పేరు రాముడు అశ్వమేధ యాగంలో తన పక్కన నిలుపుకున్న బంగారు సీత ప్రతిరూపాన్ని సూచిస్తుంది. ఈ యాగంలో అశ్వాన్ని అగ్నిదేవుడికి త్యాగం చేయడం ఒక ఆచారం. సతీ సమేతంగా చేయాల్సిన ఈ యాగం చక్రవర్తి ప్రాభవానికి చిహ్నం. రాముడు అప్పటికే పన్నెండు సంవత్సరాలుగా సతీవియోగంలో ఉన్నాడు. అందువల్ల సీతకు బదులుగా సీత ప్రతిరూపాన్ని పక్కన పెట్టుకుని యాగం కొనసాగించవచ్చని కుల గురువు వశిష్ఠుడు సలహా ఇస్తాడు. చిత్రానికి శ్రీకాంతన్నాయర్ నాటిక ఆధారమైనప్పటికీ, ఇది దానికి భిన్నంగా రూపొందించబడింది. చిత్రంలో సీత పాత్ర కనిపించదు. అనంతమైన 'ప్రకృతి' సీతగా చిత్రీకరించబడింది. సీత మనఃప్రకృతిని, వేర్వేరు మానసిక స్థితులను ప్రకృతిలోని వేర్వేరు ఆకృతుల ద్వారా చూపించడం జరిగింది. ఇది గొప్ప సాహసం! రామలక్ష్మణులు శంభూకుడిని చంపేందుకు వెళుతున్నప్పుడు చిత్రం ప్రారంభమవుతుంది. శంభుకుడి భార్య ప్రాధేయపడటం వల్ల వాళ్ళు అతణ్ణి క్షమిస్తారు. రామలక్ష్మణులు తిరిగి అయోధ్య చేరుకుంటారు. లక్ష్మణుడి భార్య ఊర్మిళను కలుసుకుంటారు.

అంతకు ముందే రామలక్ష్మణులు ప్రయాణించి వచ్చిన దండకారణ్యంలో సీత ఉంది. అయినా వీరు ఆమెను అక్కడే వదిలేసి వచ్చారని ఊర్మిళ నిందిస్తుంది. అందుకు రాముడు సీత భర్త - కేవలం అయోధ్య ప్రజల 'సేవకుడు మాత్రమే' - అని వివరణ ఇచ్చుకుంటాడు. ఆ మరునాడే అశ్వమేధ యాగం ప్రారంభించమని చెప్పడానికి వశిష్ఠుడు వస్తాడు. కానీ, అర్ధాంగి పక్కన లేనిది యాగం జరపడానికి వీలులేనందు వల్ల - రెండవ వివాహం చేసుకుంటే వీలవుతుందని సలహా ఇస్తాడు. ఈ విషయంలో రాముడు కోపోద్రిక్తుడవుతాడు. ఇంతలో పన్నెండేళ్ళ క్రితం అయోధ్యను వదిలి వెళ్ళిన భరతుడు తిరిగి వస్తాడు. సీత లేకుండా యాగం చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తాడు. వాదోపవాదాలు మితిమీరి యుద్ధానికి సిద్ధమవుతారు. అప్పుడు ప్రకృతి మధ్యవర్తి అవుతుంది. ఆకాశం తెరుచుకుని భోరుమని కురిసిన వర్షం - వారిద్దరినీ చల్లబరుస్తుంది. యాగాశ్వంతో లక్ష్మణుడు బయలుదేరుతాడు. యాగం మొదలవుతుంది. తిరిగి తిరిగి యాగాశ్వం వాల్మీకి ఆశ్రమంలో ప్రవేశిస్తుంది. అక్కడ రాముని కుమారులైన లవకుశులు పెరుగుతుంటారు. లవుడు అశ్వాన్ని బంధించి, లక్ష్మణుడితో యుద్ధానికి సిద్ధమవుతాడు. అశ్వాన్ని వదిలేయమని లక్ష్మణుడు ఆజ్ఞాపిస్తాడు. మరొకసారి ప్రకృతి తన ప్రభావం చూపుతుంది. తను చూసినదానికి విస్మయానందంలో మునిగిపోయిన వాల్మీకి ఉత్తర రామ చరిత రాయడానికి ఉపక్రమిస్తాడు. అశ్వాన్ని మళ్ళీ అయోధ్యకు తీసుకుపోతారు.

చేయవల్సిన ఆచారం కర్మకాండ ప్రకారం, యాగం రెండోభాగం మొదలవుతుంది. అదే సమయానికి మళ్ళీ శంభుకుడు విజృంభించాడని సంహరించేందుకు లక్ష్మణుడు వెళ్ళాడని వార్త అందుతుంది. అదే సమయానికి లవకుశులతో వాల్మీకి అక్కడికి చేరుకుంటాడు. వాల్మీకి యజ్ఞశాలలోకి ప్రవేశించడాన్ని వశిష్ఠుడు అభ్యంతరం తెలియజేస్తాడు. అతణ్ణి బహిష్కరిస్తాడు. కానీ, రాముడు లవకుశులను తన కుమారులుగా గుర్తించి హృదయానికి హత్తుకుంటాడు. అప్పుడు సీత పొందిన ఆనందం శోభాయమానమైన ప్రకృతి ద్వారా వ్యక్తీకరించబడుతుంది. రాముని మహాప్రస్థానం చిత్రీకరించడంతో చలనచిత్రం ముగుస్తుంది. రాముడు సరయూనదిలో మునిగి, సీతతో అంటే... ప్రకృతితో ఐక్యమైపోతాడు.

రాముడు దేవుడనే అభిప్రాయం సన్నగిల్లి... ఈ చిత్రం ద్వారా అతడు ఒక ఆదిమానవుడు అనే అభిప్రాయం బలపడుతుంది! హర్మ్యాలు ఆభరణాలు, పరిచారికలు వగైరా లేకుండానే రాజసానికి ఒక కొత్త రూపును సంతరించాడు దర్శకుడు. చిత్రకళ, సంగీతం, దర్శకత్వశాఖలలో సాధికారికంగా కృషిచేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి గోవిందన్ అరవిందన్ (1935-1991) యాభై యారేండ్లలోనే ఆయన జీవితం అకస్మాత్తుగా ముగిసిపోయింది. భారతీయ చలన చిత్రరంగం ఒక అత్యంత ప్రతిభాశాలిని పోగొట్టుకుంది. సత్యజిత్ రే తర్వాత ఎవరూ? అనే ప్రశ్న వచ్చినప్పుడు చాలా మంది విమర్శకులు అరవిందన్ పేరు సూచించారు. నిజానికి మళయాళంలోనే అదూర్ ఉన్నాడు. బుద్ధదేవ్, శ్యామ్‌బెనెగల్, మణికౌల్ వంటివారు ఎందరో ఉన్నారు. వారందరిలో లేనిది అరవిందన్ చేసిన కృషిలో ఏముందీ? అంటే, వైవిధ్యం గల సినిమాలు ఎక్కువ సంఖ్యలో తీశాడు. వివాదాస్పదమైన అంశాలకు తావులేకుండా అన్ని సినిమాలలో ఒక పరిపూర్ణతను సాధించాడు. మానసిక చైతన్యాన్ని, పరివర్తనల్ని రంగుల ప్రపంచంలోకి మార్చి వెండి తెరకెక్కించడం సులభమైన విషయం కాదు. గొప్ప సినిమా చూసి కవిత్వం రాయడం వేరు. ఆ పని చాలామంది చేయగలరు. కాని, జీవితాన్ని కవిత్వీకరిస్తూ సినిమా తీయడం వేరు. ఇది శ్రమతోనూ, ఖర్చుతోనూ కూడుకున్న పని! అంతకంటే కొన్ని రెట్ల మేధోశక్తి అవసరం. అవన్నీ అరవిందన్ సమకూర్చుకోగలిగాడు. చేసి చూపించగలిగాడు.

అరవిందన్‌కు మన తెలంగాణ ప్రాంతానికీ కొంత సంబంధం ఉంది. ఆయన 'కాంచన సీత' తీసింది భద్రాచలం పరిసర ప్రాంతాల్లోనే గోదావరి నదీతీరంలో. సికింద్రాబాదు రైలు బోగీలో కుంభమేళాకు పోతున్న ఒక సాధువును, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక మైదానంలో గుడిసె వేసుకుని ఉన్న ఇద్దరు కోయసోదరులను, విజయవాడ లాడ్జిలో పట్టుబడ్డ ఒక అమ్మాయిని 'కాంచన సీత' పాత్రధారులుగా ఎన్నుకున్నాడు.



ఆ రోజుల్లో తెలుగు పత్రికలు వీటిని కథనాలుగా ప్రకటించాయి. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే... సినిమా రంగానికి ఏమాత్రం సంబంధం లేని వ్యక్తుల్ని ఎన్నుకుని సినిమా తీయడమే సాహసం. అదే సినిమాతో ఇక జాతీయ బహుమతి సాధించడమంటే ఏమనాలీ? సినిమా మాధ్యమంపై ఎంత అవగాహన,ఎంత ఆత్మస్థైర్యం, ఎంత చొరవ, ఎంత విశ్లేషణా సామర్థ్యం ఉంటేనో గానీ... విజయం ఆస్థాయిలో సాధించలేడు కదా? "గొప్ప ప్రకృతి సౌందర్యం గల కేరళను వదిలి, ఈ తెలంగాణ బీడు భూముల్లో ఏం ఉందని వచ్చారూ?" అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానం ఆశ్చర్యాన్ని కలిగించింది. "మా కేరళలో ప్రకృతి అందాలన్నీ ఒకేచోట కేంద్రీకృతమై ఉంటాయి. అందువల్ల అప్రయత్నంగానే మనం వాటిని అక్కడ ఆనందించవచ్చు. ఇక్కడ పరిస్థితి వేరు. రమణీయమైన ప్రకృతి అందాలున్నాయి. కానీ, అన్నీ ఒక చోట లేవు. వాటిని అన్వేషించి, అన్వేషించి ఆనందించాల్సి ఉంటుంది. వెతుక్కుని సాధించి ఆనందించడంలో గొప్ప సంతృప్తి ఉంది" అని అరవిందన్ సమాధానమిచ్చారు.

'కాంచన సీత' విడుదలయ్యాక గోదావరి ఇసుక తిన్నెలు,

> "గొప్ప ప్రకృతి సౌందర్యం గల కేరళను వదిలి, ఈ తెలంగాణ బీడు భూముల్లో ఏం ఉందని వచ్చారూ?" అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానం ఆశ్చర్యాన్ని కలిగించింది. "మా కేరళలో ప్రకృతి అందాలన్నీ ఒకేచోట కేంద్రీకృతమై ఉంటాయి. అందువల్ల అప్రయత్నంగానే మనం వాటిని అక్కడ ఆనందించవచ్చు. ఇక్కడ పరిస్థితి వేరు. రమణీయమైన ప్రకృతి అందాలున్నాయి. కానీ, అన్నీ ఒక చోట లేవు. వాటిని అన్వేషించి, అన్వేషించి ఆనందించాల్సి ఉంటుంది. వెతుక్కుని సాధించి ఆనందించడంలో గొప్ప సంతృప్తి ఉంది" అని అరవిందన్ సమాధానమిచ్చారు.

చెట్లు, పూలు, ఆకాశం, పంట పొలాలు, బీడు భూములు దర్శకుడు అరవిందన్ చిత్రీకరించిన తీరుకు నమస్కరించాల్సిందే! ముఖ్యంగా సీతను ఒక పాత్రగా చూపించకుండా ప్రకృతిగా చూపించిన పద్ధతికి ప్రేక్షకులు ఉద్విగ్నులయ్యారు. ఊహకు అందని అరవిందన్ శైలికి జేజేలు పలికారు. రాళ్ళ నుండి రతనాలు ఏరటం లాంటి పని. మట్టి నుండి మాణిక్యాలు తీయటం లాంటి పని - అరవిందన్ అత్యద్భుతంగా చేశాడు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని అరణ్యాల అందాలు కాదక్కడ... దర్శకుడిగా అరవిందన్ హృదయ సౌందర్యాన్ని శ్లాఘించాలి!

అరవిందన్ ఉత్తరాయణం, కాంచన సీత, కుమ్మటి, పొక్కువేయిల్, ఒరిదత్, చిదంబరం వంటి సినిమాలు, ఎస్తప్పన్, ఉన్ని, వాస్తుహార, థంపూ వంటి చిత్రాల ప్రదర్శనలు అనేకచోట్ల జరుగుతూనే ఉంటాయి. ఆయన సినిమాల మీద చర్చలు పత్రికలలో, సెమినార్‌లలో కొనసాగుతూనే ఉంటాయి. కానీ, బాధల్లా ఒకటే. కొత్తవేవీ రాకుండా పోయాయి కదా అని! ప్రవాహం ఆగిపోయిందన్న బాధ సృజనాత్మకత అనే ఒక విద్యుత్ అకస్మాత్తుగా ఆగిపోయిందన్న తల్లడింపు. యాభైఆరేళ్ళకే ప్రపంచ దర్శకుల స్థాయినందుకున్న ఈ సృజన శీలి మరి కొంత కాలం బతికి ఉంటే, మరిన్ని 'మాస్టర్ పీసెస్' భారతీయ చిత్రసీమకు అందేవి.

అరవిందన్ గూర్చి వినడం, చదవడం, ఆయన సినిమాలు చూసి క్షుణ్ణంగా జీర్ణించుకోవడం వేరు. ఆయనను కలుసుకోవడం వేరు. హైదరాబాదు సారథి స్టూడియోలో ఆయన సినిమా 'ఒరిదత్' ప్రదర్శించినప్పుడు ఆయన అక్కడికి వచ్చారు (1989). దేశంలోని గొప్ప సినీ దర్శకులలో తాను ఒకడినన్న అహంభావం గానీ గర్వంగానీ లేవు. ఎత్తయిన విగ్రహం, కానీ చాలా సిగ్గపడుతూ వినయంగా మాట్లాడాడు. ఆయన పత్రికల్లో నిర్వహించిన కార్టూన్ శీర్షిక "చిన్న మనిషి - పెద్ద ప్రపంచం" ఆయన పట్ల అక్షరాలా నిజం! "మీలోని పెద్ద ప్రపంచం మీ సినిమాల్లో ప్రతిఫలిస్తోంది. మేం ఇంకా ఆశిస్తున్నాం" అని ఇంగ్లీషులో నేను చెప్పినప్పుడు, చిన్న పిల్లాడిలా వంకర్లు తిరిగిపోయి "థాంక్యూ ఫర్ ద ఎక్స్‌పెక్టేషన్స్" అంటూ సగానికి వంగి నాతో చేయికలిపాడు. ఆపూట మరో రకంగా కూడా అనిపించింది. నేనొక చిన్న మనిషినైతే - నేను కలిసిన పెద్ద ప్రపంచం - అరవిందన్ అని!!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవశాస్త్రవేత్త.

ఆత్మవిమర్శ గొప్పది మోడీజీ!

'విమర్శల్లోకెల్లా ఆత్మవిమర్శ గొప్పది' అన్నారు పెద్దలు. దయచేసి వారి సూచన పాటించండి మోడీజీ. "వసుదైవ కుటుంబమే మా భారతీయుల నైజం", "భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్టత", "ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్" అంటూ అంతర్జాతీయ వేదికలపై 'విశ్వగురువు'లా ప్రవచించారు. కానీ దేశంలోని వివిధ రాష్ట్రాలలో 'హిందూ-ముస్లిం' 'హిందూ-క్రిస్టియన్' 'ముస్లిం-క్రిస్టియన్' విద్వేషాలను స్వాగతిస్తున్నారు! ప్రధాని హోదాలో 'జైభజరంగ బలీ' అని నినదిస్తున్నారు. ఇంతకూ తమరు విశ్వగురువులా? విద్వేష రాజకీయవేత్తలా?



పాతూరి వెంకటేశ్వరరావు
9849081889

యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాను - విదేశాల్లోని నల్ల ధనాన్ని రప్పించి ప్రతి భారతీ యుని ఖాతాలో లక్షల రూపాయలు జమ చేయిస్తాను వంటి ఆశాజనక - వాగ్దానాలతో, మీడియా ప్రచార హోరుతో ప్రధాని అయ్యారు. యేటాకాదు గదా, ఈ తొమ్మిదేండ్లలో రెండు కోట్ల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోయారు. పైగా పెద్దనోట్లరద్దు వంటి అనాలోచిత చర్యతో నాలుగు లక్షల పరిశ్రమలు మూతబడి కోట్లాది ఉద్యోగులు, కార్మికులు వీధినపడ్డారు. ఫలితంగా 2023 మార్చికి ప్రభుత్వ గణాంకాల ప్రకారం నమోదు చేసుకున్న నిరుద్యోగులు 29కోట్లు. ఇంకా అసంఘటిత వర్గాల వివరాలు తెలియరాలేదు. గతంలో కనీవినీ ఎరుగని అతిపెద్ద నిరుద్యోగ రేటిది అంటున్నాయ్ నివేదికలు! విదేశీ నల్ల ధనాన్ని రప్పించటమలా ఉంచితే, "ఎగవేతదారుల వలన 2014 నుంచి, భారతీయ బ్యాంకులు సగటున రోజుకు వందకోట్ల రూపాయలను కోల్పోతున్నాయి' అన్న రిజర్వుబ్యాంకు ప్రకటనను 'ది ఎకనామిక్ టైమ్స్' పత్రిక ప్రచురించింది. అంతేగాదు యేటా వేలాది కోట్ల నల్లధనం విదేశాలకు తరలిపోతుందని అంతర్జాతీయ నివేదికలు చాటుతున్నాయి. విజయ్‌మాల్యా, మరో 28మంది గుజరాతీ వ్యాపారులు ఎగ్గొట్టిన బ్యాంకు రుణాలు రూ.10లక్షల కోట్లన్న వాస్తవం తమకు తెలియనిది కాదు. ఎవరెవరు ఎంతెంత నల్లధనం ఏయే దేశాల్లో దాచారో, ఆ వివరాలను 'పనామా' 'పండోరా' 'ప్యారడైజ్' పేపర్లు ప్రకటించాయి. అయినా సరే ఈడీ, సీబీఐ ఇంకా సదరు వ్యవస్థలను వాళ్ళవైపు వెళ్ళ నీయటం లేదెందుకంటున్నారు ప్రజలు! ప్రజా ధనానికి కాపలాదారుగా ఉంటానన్నారు గదా? అంటే ఎవరు ఎంతెగ్గొడుతున్నారో, విదేశాలకెంత తరలించుకెళ్తున్నారో చూస్తుండటమేనా మీ వాగ్దానానికి అర్థం?

అప్పులు, అవినీతిలో మునిగి తేలుతుందన్న ప్రచార హోరుతో గత ప్రభుత్వాన్ని దించి, గద్దెనెక్కిన తమరు తమ పార్టీ నేతలు అభివృద్ధి సంక్షేమ ప్రధాన పరుగులు తీస్తున్న తెలంగాణ ప్రభుత్వాన్నీ, అప్పుల గద్దె నెక్కిగూడ తన వాగ్దానాలను నెరవేర్చుతున్న ఏపీ ప్రభుత్వాన్నీ, ఆ రాష్ట్రాలను అప్పుల్లో ముంచేస్తున్నారంటూ హేళన చేస్తుంటే... 'గురువిందగింజ' గుర్తుకొస్తుంది మోడీజీ! ఎందుకంటే దశాబ్దాలుగా గత ప్రభుత్వాలన్నీ కేంద్రంలో చేసిన అప్పు రూ.55లక్షల కోట్లు. మీ ప్రభుత్వం కేవలం తొమ్మిదేండ్లలో చేసిన అప్పు రూ.103లక్షల కోట్లు కదా! మరి మీరు దేశాన్ని ముంచుతున్నట్లా, తేల్చుతున్నట్లా? ఇక అవినీతి ప్రభుత్వాలంటూ బీజేపీయేతర ప్రభుత్వా లను విమర్శిస్తున్న మీరు 40శాతం కమీషన్లు ఇవ్వలేక ఘనమైన బీజేపీ సర్కారు వారి కర్నాటకలో మీ కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకున్నా... ప్రభుత్వపు మంత్రే కోట్లాది అవినీతి నోట్ల కట్టలతో రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కినా - మీ బీజేపీ సర్కారే గోవాలో అవినీతి గబ్బులేపినా మిన్నకుండిపోయారు కదా! 'బేటీ బచావో బేటీ పఢావో' అంటుంటే స్త్రీ జనోద్ధారకుడు మా మోడీ అంటూ పాపం తెగ ఆనందపడిపోయారు మహిళలు! కానీ గుజరాత్‌లో బిల్కిస్‌బానో వంటి గర్భిణిని రేప్ చేసిన బీజేపీ కార్యకర్తలను, క్షమాభిక్ష పేరిట విడిపించటమే గాక, దండలతో సన్మానించి, హారతు లతో స్వాగతిస్తుంటే



> బాబోయ్...నష్టాలతో ఉన్నావంటూ ప్రభుత్వరంగ సంస్థల్ని ఆశ్రిత కార్పొరేట్లకు తెగనమ్ముతున్నారు! పాపం నష్టాలతో ఉన్నవంటూ ప్రయివేటు సంస్థల రుణాలను మాఫీ చేస్తున్నారు. అలా అప్పులెగేసిన కార్పొరేట్లందరికీ 'క్లీన్‌చిట్' ఇవ్వమని రిజర్వు బ్యాంకు చేత చెప్పిస్తున్నారు. అవునులే పాపం మళ్ళీ వాళ్ళకు అప్పుపుట్టాలిగదా! ఆహా ఎంతటి ముందుచూపో తమది! అది సరే దశాబ్దాల పాటు శ్రమించి నిర్మించుకున్న ప్రభుత్వ సంస్థలు, ఓడరేవులు, రైల్వేస్టేషన్లు వగైరాలను లీజుల పేరిట తెగనమ్మటం దేనికని ప్రజలడుగుతుంటే, మళ్ళీ కొత్త, కొత్త వాటిని నిర్మించు కోటానికి డబ్బుకావాలి గదా! అందుకోసం అంటున్నారు. మరి కొత్తవి దేనికి? ఓహెూ మళ్ళీ అమ్ముకోటానికా? వాహ్వా ఏం మాస్టర్ ప్లాన్ మోడీజీ!

అలాగే చూస్తుండిపోయిన తమను చూసి విస్తుపోయారు భారతీయ మహిళలు! ప్రజాస్వామ్య దేవాలయమంటూ కొత్త పార్లమెంటు భవనంలో మీరు ప్రణమిల్లినందుకు హర్షించారు ప్రజలు! కానీ ఆ దేవాలయం ముందుకొచ్చి 'మోడీజీ మీ పక్కనే ఉన్న ఎంపీ బ్రిజ్‌భూషణ్‌చే లైంగికంగా వేధింపబడిన బాధితులం, మాకు న్యాయం చేయండి' అని మొరపెట్టుకుంటున్న మహిళా రెజ్లర్లను ఈడ్చుకెళ్ళారు పోలీసులు. 'దేశానికే గర్వకారకులంటూ ప్రశంసిస్తూ వాళ్ళతో ఫొటోలు కూడా దిగారు గదా మీరు. మరి దేశానికి కీర్తికిరీటాల వంటి వాళ్ళకన్యాయం జరిగితేనే పట్టించుకోని మోడీ పాలనలో ఇంక మాగతేంటని వాపోతున్నారు సాధారణ మహిళలు. ఇందుకే కాబోలు 'మహిళలకు ప్రమాదకర దేశాల సూచికలో భారత్ కూడా చేరింది! తమ హయాంలో ఇలా జరగటం అవమానకర మనిపించటం లేదా మోడీజీ?

'మా మోడీ హయాంలో దేశవ్యాపితంగా విస్తరించింది మా పార్టీ' అంటూ డప్పుగొట్టుకొంటున్నది బీజేపీ! అది ప్రజాభిమానంతోనా? ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చేసా? ఎలా విస్తరించిందో మీకూ తెలుసు, దేశానికీ తెలుసు! 2016లో అరుణాచలప్రదేశ్, 2017లో మణిపూర్ అండ్ గోవా, 2019లో కర్నాటక అండ్ సిక్కిం, 2020లో మధ్యప్రదేశ్, 2021లో పుదుచ్చేరి, 2022లో మహారాష్ట్రలో బీజేపీ యేతర ప్రభుత్వాలను కూల్చి గద్దెనెక్కింది బీజేపీ! అందుకు ఉపయోగించిన ఆయుధం 'ఈడీ-ఐటీ-సీబీఐ త్రిశూలం! దానితో మీరు చేయించిన దాడులు 5,422. వాటిలో ఛార్జిషీటు వేసినవి 999 అయితే నిరూపించబడినవి కేవలం 23 కేసులు మాత్రమే! మీరు చేయించిన దాడులలో 97శాతం ప్రతిపక్ష పార్టీల నేతలు, మీకు గిట్టని బిబిసి, ట్విట్టర్ వగైరా వ్యాపార సంస్థలపైనేనని పరిశీలకులు తేల్చారు. దీనిని బట్టి బీజేపీ యేతర ప్రజా ప్రతినిధులను బెదిరించి, వచ్చిన వారిని చేర్చుకుని బీజేపీని బలోపేతం చేసుకోవటం, వచ్చిన వాళ్ళపై మోపిన కేసులను అటకెక్కించడం మీరు ప్రవేశపెట్టిన అస్త్రశస్త్రాలే కదా! షిండేలను రూపొందించి, ఆయా ప్రభుత్వాలను కూల్చడం, ప్రతిపక్షాల ఆర్థిక మూలాలను దెబ్బతీయటం, వాళ్ళను అవినీతిపరులుగా ప్రజల్లో అపఖ్యాతిపాలు చేయటమే బీజేపీ లక్ష్యాలని ఇప్పటికర్థమైంది ఆయా పార్టీలకు, ప్రజలకు కూడా! కోట్లాది రూపాయల ప్రజాధనంతో, గతంలో ఏ ప్రధానీ చేయనన్ని విదేశీ పర్యటనలు చేశారు. కానీ దేశానికొక్క పరిశ్రమనూ తేలేకపోయారు. అంబానీ, అదానీలకు మాత్రం ఆయా దేశాలతో పలు ప్రాజెక్టులు, కాంట్రాక్టులు, వ్యాపార లావాదేవీలు కుదిర్చిపెట్టారు. అంతర్జాతీయంగా తమరు సాధించిన ఘన విజయమిదేకదా మోడీజీ! జాతీయంగా చూసినా ఆయిల్స్, టెలికాం, విద్యుత్, ఇన్సూరెన్స్, మీడియాలను అంబానీకి! ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లు, బొగ్గుగనులు, ప్రభుత్వరంగ సంస్థలను అదానీకి కట్టబెట్టారు. ఇక ప్రజలకు మాత్రం తక్కువేం చేసారు. బోలెడు అప్పులు, అధిక పన్నులు, మన్‌కీ బాత్‌లు, వినసొంపైన నినాదాలు, హావభావాలతో ఉపన్యాసాలు, నిరుద్యోగ, దరిద్ర్య భారాలన్నీ వాళ్ళనెత్తిన బెట్టారు! ఇవి ప్రతిపక్షాల వారి మాటలు కావు, జాతీయ, అంతర్జాతీయ నివేదికలు వెల్లడించిన నగ్నసత్యాలు మోడీజీ!

బాబోయ్... నష్టాలతో ఉన్నావంటూ ప్రభుత్వరంగ సంస్థల్ని ఆశ్రిత కార్పొరేట్లకు తెగనమ్ముతున్నారు! పాపం నష్టాలతో ఉన్నవంటూ ప్రయివేటు సంస్థల రుణాలను మాఫీ చేస్తున్నారు. అలా అప్పులెగేసిన కార్పొరేట్లందరికీ 'క్లీన్‌చిట్' ఇవ్వమని రిజర్వు బ్యాంకు చేత చెప్పిస్తున్నారు. అవునులే పాపం మళ్ళీ వాళ్ళకు అప్పుపుట్టాలిగదా! ఆహా ఎంతటి ముందుచూపో తమది! అది సరే దశాబ్దాల పాటు శ్రమించి నిర్మించుకున్న ప్రభుత్వ సంస్థలు, ఓడరేవులు, రైల్వేస్టేషన్లు వగైరాలను లీజుల పేరిట తెగనమ్మటం దేనికని ప్రజలడుగుతుంటే, మళ్ళీ కొత్త, కొత్త వాటిని నిర్మించుకోవడానికి డబ్బుకావాలి గదా! అందుకోసం అంటున్నారు. మరి కొత్తవి దేనికి? ఓహెూ మళ్ళీ అమ్ముకోడానికా? వాహ్వా ఏం మాస్టర్ ప్లాన్ మోడీజీ! 'చాయ్ వాలాగా శ్రమించి, ఈస్థాయి కెదిగిన ఒక బీసీ!' తనకంటూ ఎవరూలేని, ఏమీ చేసుకోని సర్వసంగ పరిత్యాగి' ప్రజల కోసమే పరిశ్రమిస్తున్న ప్రధాని మా మోడీ అంటూ ఊదరగొడుతున్న మీ బీజేపీ! కానీ మీరు నెలకు రూ.2.80లక్షల జీతం పుచ్చుకోవటం, లక్షల ఖరీదు చేసే సూటు వేయటం, విదేశాల నుండి ఖరీదైన ఫుడ్ తెప్పించుకోవటం, వందల కోట్లతో సువిశాల నివాస భవనాన్ని నిర్మించుకోవటం చూశాక బడాకార్పొరేట్ల కోసం పరిశ్రమిస్తున్న షావుకారు ప్రధాని మీరని భారతీయులిప్పటికి గ్రహించగలిగారు మోడీజీ!!

ధోకా.. దోఖా..

నేను బరితెగించాను
అయినా నమ్మకం కుదర్లా నీకు
మొన్న గుజరాత్, నిన్న కాశ్మీర్
నేడు మణిపూర్
మంటల్లో మండుతున్నా
నీకు నాపై ఆశచావదు.
విధ్వంసం సృష్టికర్తకే
విధ్వంసం ఆపమని విన్నపాలా..?
నా మౌనమే నీకు
అస్సలర్థమవడం లేదు.
నీ దెబిరింపులు
ప్రజాస్వామ్య మర్యాదలు
నా దగ్గరా...
నా పాత్ర నేను రంజుగా
రసవత్తరంగా పోషిస్తున్నాను
నీవే... గందరగోళంలో
మునిగి తేలుతున్నావు.
చాపం కింద నీరులా
నాలా పని చేయడం
చేత కాదు నీకు
నీకా తెలివి రానంతవరకు
నాకు ధోకా లేదు.
... .
నీది ధోకాకాదు దోఖా...
దేవుని పేరిట ధర్మం పేరిట
నీ బాగోతాలు బూటకాలు
చరిత్ర చూస్తూనే ఉన్నది.

నేను పిపీలికాన్నే కావచ్చు
నా ఉచ్చులోనే ఉండొచ్చు.
నీతో పోరాడుతూనే
నిన్ను అంతం చేసే
తెలివి తెచ్చుకుంటాం
కచ్చితంగా...

- శైలి, 9959745723

పారాబైల్డ్ రైస్ మిల్లు అసోసియేషన్ సంఘం అధ్యక్షుడిగా పురుషోత్తమరావు



నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : సుల్తాన్ బాద్ మండలం రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రవెల్లి పురుషోత్తం రావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రైస్ మిల్లర్స్ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్నిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎడవల్లి విజయపాల్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్గా సముద్రాల ధర్మేందర్ కోషాధికారిగా పల్ల సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొమురవెల్లి శ్రీకాంత్,ఉపాధ్యక్షులుగా ఇనుగాల అనంతరెడ్డి, ఆనందరావు, సంతోష్ రావు, గోపాల్ రెడ్డిలు, ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా ఎర్రవెల్లి లక్ష్మణరావు, కొమురవెల్లి రాజేష్, ఆడేపు పాండు,రామారావు ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా శంకర్ రెడ్డి,ప్రకాష్ రావు రంగారెడ్డి పన్నాల రాములు ఎన్నిక అయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శరత్,అశోక్ లు ఎన్నికయ్యారు. ఈ సమావేశం లొ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం నాయకులు మొరపల్లి తిరుపతిరెడ్డి ప్రధాన కార్యదర్శి రాజన్నలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం

- శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్
- ప్రతి రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించింది
- అమరుల కుటుంబాలకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంది



సిరిసిల్ల : అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న బోయిన్పల్లి వినోద్ కుమార్



వేములవాడ : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



పెద్దపల్లి టౌన్ : అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టులు



ఓదెల : అమరుల సంస్మరణ దినోత్సవంలో ఎంపీపీ రేణుకాదేవి

నవతెలంగాణ - పెద్దపల్లి/ సిరిసిల్ల

అమరుల త్యాగఫలంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం పెద్దపల్లి నియోజక, జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద గల అమరుల స్థూపం వద్ద నిర్వహించిన అమరుల సంస్మరణ దినోత్సవంలో శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి లు పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు మాట్లాడుతూ తొలి, మలి, తుదిదశ ఉద్యమాల్లో రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనేక మంది త్యాగధనులు ఉద్యమంలో పాల్గొన్నారని, వారి త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరవీరుల పాత్ర శాశ్వతంగా నిలిచిపోతుందని, రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అన్ని రంగాలలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని, గత 20 రోజులుగా వివిధ శాఖల నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను, వచ్చిన మార్పులను వివరిస్తూ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో రాష్ట్ర సాధన కోసం 37మంది ఆత్మ బలిదానం చేసుకున్నారని, వీరి త్యాగాలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థిక సహాయం, అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాలకు ఆసరాగా, అండగా సీఎం కేసీఆర్ నిలిచారని తెలిపారు.

అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని అమరవీరుల కుటుంబాల వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం సమీకత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరవీరుల కుటుంబాలతో కలిసి శాసనమండలి చీఫ్ విప్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్ వి.లక్ష్మీ నారాయణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో అమరుల ప్రాణ త్యాగాలు మరవలేనివి

రాష్ట్ర సాధనలో అమరులు చేసిన ప్రాణ త్యాగాలు మరవలేనిదని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం పెద్దపల్లి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

నవతెలంగాణ - సిరిసిల్ల : అమరుల త్యాగఫలమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమని, వారి త్యాగాలు వెలకట్టలేనివని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం సిరిసిల్ల పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమర వీరులకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బి.వినోద్ కుమార్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్ మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణా రాఘవ రెడ్డి, ఉపాధ్యక్షులు సిద్ధం వేణు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్డీఓ టి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు ఆకునూరి శంకరయ్య రైతు బంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హల్‌లో జిల్లాలోని 30 అమర వీరుల కుటుంబాలను సన్మానించారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన లో అసువులు బాసిన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ తుపాకీ చెబట్టి పెత్తందార్లకు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలు నైజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో ప్రతి కుటుంబానికి పోరాట చరిత్ర ఉందన్నారు. గడిచిన 9 ఎండ్లలో అమరుల ఆశయాలే స్ఫూర్తిగా, ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలే ఊపిరిగా, తెలంగాణ ఉద్యమ నినాదాలే మైలురాళ్లుగా, దేశంలోనే రాష్ట్రాన్ని సిఎం కేసిఆర్ అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి సామూహిక భోజనాలు చేశారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలో పురపాలక సంఘం తెలంగాణ ఉద్యమ కారులను ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యమకారులను సన్మానించారు. వల్లంపట్ల గ్రామ శివారులో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని జిల్లా ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మెరుగైన వైద్యచికిత్స అవసరమనుకుంటే హైదరాబాద్‌కు కూడా పంపిస్తామని భరోసానిచ్చారు.

నవతెలంగాణ-వేములవాడ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన అమరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు పాల్గొని, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, కమిషనర్ అన్వేష్, బి.ఆర్. ఎస్ పార్టీ అధ్యక్షులు పుల్కం రాజు, గోస్కుల రవి, మల్యాల దేవయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : అమరవీరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రమని పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డా. దాసరి మమతా రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరులకు మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో కలిసి గురువారం నివాళులర్పించారు. అమరవీరులను స్మరించుకుంటూ ఒక్క నిమిషం పాటు మౌనం పాటించి, సంస్మరణ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంత చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ నజీమిన్ సుల్తానా మోబిన్,మున్సిపల్ కమిషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముస్తాబాద్

మండలంలోని తుర్కపల్లె, ఆవునూరు గూడెం ముస్తాబాద్‌తోపాటు పలు గ్రామలలో గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేక సభా సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ అమర వీరులకు ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు ఎంపీటీసీలు వార్డు సభ్యులు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శరత్ రావు, ఎంపీడీవో రమాదేవి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీర్నపల్లి : రాజన్న సిరిసిల్ల జిల్లా, వీర్నపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో, గ్రామాలలో గురువారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో చివరి రోజు తెలంగాణ అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇసంపల్లి హేమా,ఎంపిటిసి అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపిటిసిలు రేణుక హన్మండ్లు, సర్పంచ్ పాటి దినకర్, ఉప సర్పంచ్ రవి, ఇంచార్జి ఎంపిడివో నరేష్, మండల నాయకులు భగవంతం , శ్రీరామ్ నాయక్, కటుకురి రాజు, కార్యదర్శి పురుషోత్తం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఇల్లంతకుంట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంతో పాటు ఆయా గ్రామాల్లో అమర వీరులకు గురువారం ఘన నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో అమరుల ఆశయం అయిన స్వపరిపాలన లక్ష్యాన్ని సాధించాలన్నారు . దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న సకల దరిద్రాలను దూరం చేసి ప్రజలను కష్టాల కడలి నుంచి గట్టెక్కించే ఆ మహా యజ్ఞం మహోజ్వలంగా సాగిందనడానికి తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానమే నిదర్శనం అని అన్నారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీర్జా, సర్పంచులు , ఎంపిటిసిలు, కో- ఆప్షన్ సభ్యుడు సలీం ,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు .

నవతెలంగాణ - జూలపల్లి(ఎలిగేడు)

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన తెలంగాణ అమరుల త్యాగాలు మరవలేని అని ఎలిగేడు స్రవంతి జులపెల్లి ఎంపీపీ రమాదేవి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మండిగా రేణుకలు అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా అమరుల కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సింధుజ వెంకటేశ్వరరావు,గొల్లే కావేరి,భూమేష్ ఐలయ్య యాదవ్, ప్రభావతి జితేందర్ రెడ్డి, స్వప్న, ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరులకు జర్నలిస్టుల ఘన నివాళి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్) పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని వినోద్, జిల్లా సహాయ కార్యదర్శి సాబీర్ పాషా, సుల్తానాబాద్ మండలం అధ్యక్షుడు పల్ల మహేష్, మండల ప్రధాన కార్యదర్శి నూక రామదాసు, మండల కోశాధికారి పిట్టల పరమేష్,మండల ఉపాధ్యక్షుడు గోపికృష్ణ, మండల జాయింట్ సెక్రెటరీ ఓంకార్ గౌడ్, సబ్బు సతీష్ పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్

అమరుల ఆశయాలను ద్వితీయ ప్రతి తెలంగాణ బిడ్డ కొనసాగించాలని సుల్తానాబాద్ మండలంలోని చిన్న బొంకూర్ గ్రామ సర్పంచ్ రాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అయిన అమరవీరుల దినోత్సవం కార్యక్రమాన్ని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అమరవీరుల స్థూపం నమూనాను ఏర్పాటు చేసి గ్రామ ప్రజలతో కలిసి నివాళులర్పించారు.

నవతెలంగాణ - ఓదెల : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవంలో భాగంగా గురువారం రోజున ఓదెల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రేణుకాదేవి ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి పూలమాలవేసి స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి సత్తయ్య, ఎంపీఓ అబ్దుల్ వాజిద్, శ్రీధర్ ఏఈ సమ్మిరెడ్డి, వెటర్నరీ డాక్టర్ కుమారస్వామి, ఏపీఎం లతా మంగేశ్వరి, ఏఈఓ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖని : నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్

అమరవీరులు కన్న కలలు నిజం చేసిన సీఎం కేసీఆర్

నవతెలంగాణ-గోదావరిఖని: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిపి అమరవీరులు కన్న కలలను సిఎం కెసిఆర్ నిజం చేశారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి ఖని ప్రధాన చౌరస్తా లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. జాతి పిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. సభా ప్రారంభానికి ముందు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు



నవతెలంగాణ - రాయికల్ : సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు.గురువారం రాయికల్ పట్టణంలోని 6 వ వార్డులో రూ.12 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత వర్షాకాలంలో మట్టి రోడ్డు వాళ్ళ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నా విషయాన్ని స్థానిక కౌన్సిలర్ అన్వరీ బేగం తమ దృష్టికి తీసుక రావడంతో ప్రజల సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అన్వరీ బేగం,మహేందర్,మహేష్ గౌడ్, నాయకులు హుస్సేన్,తిరుపతి, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



నవతెలంగాణ రాయికల్ : రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాలలో కూర్చునే 10 సిమెంట్ బెంచీలను బుధవారం లయన్స్ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డీసీ లు బత్తిని భూమయ్య,మ్యాకల రమేష్ ,చౌడరపు లక్ష్మినారాయణ,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎద్దండి దివాకర్ రెడ్డి,కొమ్ముల ఆదిరెడ్డి,కొత్తపెల్లి రంజిత్,కడకుంట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన రూరల్ మండల నాయకులు

నవతెలంగాణ-వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండల పరిధిలోని హన్మాజీపేట నక్క వాగుపై రూ. 11.55 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరీకి కృషి చేసిన ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబును గురువారం సెస్ డైరక్టర్ దేవరాజం, హనుమాజిపేట సర్పంచ్ విజయ, బొల్లారం సర్పంచ్ లచ్చయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హన్మాండ్లు తదితరులు కలసి ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటగా బ్రిడ్జి మంజూరీ కొరకు సహకరించిన మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డిలతో పాటు రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ వినోద్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. 100 రోజుల్లోపు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చుతామని, నియోజకవర్గంలో చేపట్టవల్సిన అన్ని రోడ్లు, వంతెనల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని త్వరలోనే పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణి వర్క్‌షాప్‌ను ప్రయివేటుపరం చేసే కుట్ర

యూనియన్ జాతీయ కార్యదర్శి బి.జనక్ ప్రసాద్



నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి వర్క్‌షాప్‌ను ప్రైవేటు వ్యక్తులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి చర్యలను సహించేది లేదని, యాజమాన్యం ఇలాంటి చర్యను వెంటనే విరమించుకోవాలని ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ హెచ్చరించారు. సింగరేణి ఆర్జీ 1 ఏరియా వర్క్‌షాప్, ఏరియా ఆసుపత్రిలో గురువారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఉన్న బొగ్గు గని కార్మికులకు వేతన సవరణలో కార్మికుల ప్రయోజనాలను కాపాడి మెరుగైన వేతన సవరణ జరిగేలా చూడటంలో జాతీయ కార్మిక ఐఎన్టీయూసీ చురుకైన పాత్ర పోషించిదన్నారు. ఐఎన్‌టియుసి చొరవతోనే 25శాతం అలవెన్సుల పెరుగదల సాధించామన్నారు. మెడికల్ స్టాఫ్ నర్సులకు క్యాడర్ స్కీమ్‌లో అన్యాయం జరిగిందని, వారికి మెరుగైన క్యాడర్ స్కీమ్ అమలు అయ్యేలా కృషి చేస్తామన్నారు. సింగరేణి ఉద్యోగులకు 11వ వేజ్ బోర్డు వేతనాలు వచ్చేనెల నుండి, ఏరియల్స్ వీలైనంత త్వరగా కార్మికులకు ఇప్పించేలగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ రెడ్డి, ధర్మపురి, వికాస్ కుమార్ యాదవ్, దేవుపల్లి రాజేందర్, సదానందం, ట్రైసన్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎన్టీపీసీ కాంటాక్ట్ కార్మికుల అగ్రిమెంట్‌ను అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ముత్యం రావు



నవతెలంగాణ - గోదావరిఖని: యాజమాన్యం మొండి వైఖరి విడనాడి ఎన్టిపిసి కాంటాక్ట్ కార్మికుల అగ్రిమెంట్‌ను అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ముత్యం రావు డిమాండ్ చేశారు. గురువారం ఎన్టిపిసి ప్రాజెక్టు గేట్ 2 వద్ద యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన మహా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు తమ హక్కుల కోసం పది నెలల నుండి పోరాడుతున్న ఎన్‌టీపీసీ యజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నదని, మహారత్న కంపెనీలో కార్మికుల శ్రమ ఉందని యజమాన్యం గుర్తించాలని, ఎన్టిపిసి కార్మికులకు పోరాటం కొత్త కాదని వారి సహనాన్ని పరీక్షించవద్దన్నారు. కార్మికులు సమ్మె బాట పట్టకముందే వారి సమస్యలను పరిష్కరించాలని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, గోదావరి యూనియన్ కౌశిక్ హరి, రాజమల్లు, బిఎమ్ఎస్ బి.లక్ష్మీనారాయణ, టి.శ్రీనివాస్, ఐఎఫ్టియు చిలుక శంకర్, బుచ్చన్న, టిఆర్ఎస్ ఈ.భూమయ్య, చింతల సత్యం, ఏఐటియుసి ఎం.శంకర్, ఆర్.లక్ష్మణ్, ఐఎన్టియుసి బి.చందర్, జమీల్, టిఎన్టియుసి కంది చంద్రయ్య, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు అనన్య సామాన్యం

రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్



నవతెలంగాణ-గోదావరిఖని

తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాలు అనన్య సామాన్యమని రామగుండం నగర మేయర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అమరవీరులకు నివాళులర్పించడానికి గురువారం ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించడానికి ఈ సమావేశంలో ప్రవేశ పెట్టిన ఏకైక అజెండా అంశాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. అనంతరం ఎనిమిదవ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 28 అంశాలు ప్రవేశపెట్టగా అన్నీ ఆమోదం పొందాయి. సభ్యుల కోరిక మేరకు అన్ని డివిజన్ లలో ప్రధానమైన ప్రాంతాలో సిసి కెమెరాలు ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని మేయర్ ఆదేశాలు జారీ చేశారు. డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షా కాలంలో రోడ్లపై నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సుమన్ రావు, డిప్యూటీ కమిషనర్ నారాయణ రావు, ఎస్ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-ముత్తారం

జూన్ 16, 2023 తేదీ వరకు పట్టా పాసు బుక్ పొందిన రైతులు రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. రైతులు రైతు బంధు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్ జిరాక్స్, పట్టా పాసు బుక్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో రైతు వేదికలో ఎఈవోలను సంప్రదించాలని తెలిపారు. కొత్తగా మండల వ్యాప్తంగా 477 మంది రైతులు రైతు బంధుకు అర్హత సాధించారని తెలిపారు.

త్వరలోనే బొగ్గు గని కార్మికుల సిఎంపిఎఫ్ ఆన్‌లైన్

సిఎంపిఎఫ్ రీజనల్ కమీషనర్ శ్రీహరి పచౌరీ



నవతెలంగాణ-గోదావరిఖని: : బొగ్గు గని కార్మికుల సిఎంపిఎఫ్ ఆన్‌లైన్ త్వరలోనే జరుగుతుందని, దీని ద్వారా కార్మికులకు మెరుగైన సేవలు అందిస్తామని సీఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ శ్రీహరి పచౌరీ తెలిపారు. సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ ఆధ్వర్యంలో గోదావరిఖని కమ్యూనిటీ హాల్‌లో రామగుండం ఏరియా 1 ఎల్20 సమావేశం అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. బిఎంఎస్ జాతీయ నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌ఛార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, సిఎంపిఎఫ్ కమీషనర్ శ్రీహరి పచౌరీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి అధ్యక్షతన భారతదేశంలో ఈ సంవత్సరం జి20 సదస్సు జరుగుతుందని, దానిలో భాగంగానే ఎల్20 కార్మికుల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి జీ20 సదస్సులో తీర్మాణాలు చేయాల్సిన అవసరం ఉందని, దీన్ని బిఎంఎస్ జాతీయ అధ్యక్షులు హిరణ్మె పాండే అధ్యక్షతన దేశంలో 100 ఎల్20 సదస్సులు జరుపుకుంటున్నామని, అందులో భాగంగా సింగరేణిలో ఎల్20 నాలుగు సదస్సులు జరుపుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా గోదావరిఖనిలో ఈ కార్యక్రమం జరిగిందని, ఈ సమ్మిట్‌లో బొగ్గు గని పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చ జరుగుతుందని వారు వివరించారు.

పోతిపెద్ది ప్రభాకర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

పెద్దపల్లి జెడ్పీ చైర్మెన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-ముత్తారం: ఓడేడు గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ పోతిపెద్ది ప్రభాకర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని పెద్దపల్లి జడ్పి చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో మాజీ సర్పంచ్ పోతిపెద్ది ప్రభాకర్ రెడ్డి విగ్రహాన్ని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా జెడ్పీ చైర్మెన్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి పోతిపెద్ది ప్రభాకర్ రెడ్డి ఎంతగానో కృషి చేశారని, వారి జ్ఞాపకాలు చరిత్రలో నిలిచిపోయేలా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఓడేడు గ్రామ ప్రజల గుండెల్లో ప్రభాకర్ రెడ్డి ఎల్లపుడు ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చంద్రుపట్ల రాంరెడ్డి, గుజ్జుల రామక్రిష్టా రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు దాసరి రాజలింగు, అనంతరెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జడ్పిటిసి చెలుకల స్వర్ణలత అశోక్, సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైఎస్ ఎంపిపి సుదాటి రవీంద్రరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు అల్లం తిరుపతి, సర్పంచులు సిరికొండ బక్కారావు, మహేందర్, వేల్పూరి సంపత్ రావు, గాదం స్రవంతి శ్రీనివాస్, మేడగోని సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఇల్లెందు అశోక్, బేధ సంపత్, ఉప సర్పంచ్ దేవనూరి భాను కుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్ నిరసన, సిరిసిల్లలో ఉద్రిక్తత

నవతెలంగాణ - సిరిసిల్ల : కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను దగా చేస్తుందని విమర్శిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. గాంధీ చౌరస్తా నుండి ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లిన నాయకులు అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దగ్ధం చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకోగా మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉధతంగా మారింది. శాంతియుతంగా నిరసన చేపట్టాలని పోలీసులు నచ్చజెప్పడంతో నాయకులు శాంతించారు. ఈ సందర్భంగా నాయకులు కేకే మహేందర్ రెడ్డి, సంగీతం శ్రీనివాస్, చీటీ ఉమేష్ రావుతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను కెసిఆర్ నేతత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందని అన్నారు. దుర్మార్గాలను కప్పిపుచ్చుకునేందుకు దశాబ్ది ఉత్సవాల పేరుతో మరోసారి ప్రజలను దగా చేసేందుకు సిద్ధమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ - వేములవాడ : కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని బ్రిడ్జి నుండి ర్యాలీగా తరలివచ్చి తెలంగాణ చౌక్ లో 10 తలలున్న రావణాసురుని దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజల పాలిట రావణాసురుడిగా మారాడని, ప్రజలకు ఇచ్చిన హామీలేవి అమలు చేయలేదని ధ్వజమెత్తారు. దశాబ్ది ఉత్సవాలు ఎందుకోసం, ఎవరికోసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

నవతెలంగాణ-గోదావరిఖని: 9ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు దగా పడ్డారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా నుంచి లక్ష్మీనగర్ వరకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. మేదరీ బస్తీ వద్ద పది తలల సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బిఆర్ఎస్ పాలనలో అమలుకు నోచుకోని హామీలపై రామగుండం తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

నవతెలంగాణ-ముత్తారం: సీఎం కెసిఆర్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో దహనం చేసి, తహశీల్దార్ కె.వరంధన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ మాట్లాడారు. ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, ముత్తారం సర్పంచ్ తూటి రజిత-రఫీ, ఓబీసీ మండల అధ్యక్షుడు అల్లం కుమార స్వామి, మైనారిటీ మండల అధ్యక్షుడు వాజీద్ పాషా పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

మంత్రి కొప్పుల ఈశ్వర్

నవ తెలంగాణ-జగిత్యాల:
తెలంగాణ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్తు ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి తొలి, మలి దశల్లో ఎంతో మంది అమరులయ్యారని, ఆనాటి ఉద్యమ ఫలితమే ఈనాటి తెలంగాణ రాష్ట్రమని అన్నారు. రాష్ట్రంలోని తలసరి ఆదాయం దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందని, తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలుపరుస్తోందని తెలిపారు. శాసన మండలి సభ్యులు ఎల్.రమణ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, అమరులకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఘనంగా నివాళులర్పిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ పోరాటంలో అసువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా 36 మంది అమరవీరుల కుటుంబాలను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ భాస్కర్, అదనపు



కలెక్టర్లు మంద మకరంద, బీఎస్.లత, జడ్పీ సీఈవో రామానుజ చారి, జడ్పీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరుల సంస్మరణ దినోత్సవం
అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం జగిత్యాల పట్టణంలోని అమరవీరుల స్తూపానికి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి తో పోరాటం సాగించి మనం తెలంగాణ సాధించుకున్నామని, ఉద్యమాలు. త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు.
అమరుల సజీవ సాక్ష్యం స్తూపాలేనని తెలిపారు. అనంతరం గాలిలోకి పావురాలను ఎగురవేశారు. అమరులకు నివాళులు అర్పించిన వారిలో ఎమ్మెల్సీ ఎల్.రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు మంద మకరంద, బీఎస్ లత తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు నరేంద్ర మోడీ

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్:
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలో బీజేపీ 167,168 బూత్‌లో 'గడప గడప'కు నరేంద్ర మోడీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వీరబతిని అనిల్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కళావతి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కాసరపు శ్రీనివాస్ గౌడ్, బూత్ అధ్యక్షులు నవీన్, నిఖిల్, మనోజ్, హరీష్ చిక్కు మొదలగువారు ఉన్నారు.
జగిత్యాల టౌన్:
నరేంద్ర మోడీ 9 సంవత్సరాల సేవ, సుపరిపాలన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జగిత్యాల నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ లక్ష్మీపూర్ గ్రామంలోని 134 బూత్‌లో గడప గడపకు వెళ్లి నరేంద్ర మోడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ బూత్ అధ్యక్షులు గజ్జి మల్లేష్, రైతు నాయకులు కొట్టాల మోహన్ రెడ్డి, గ్రామ గంగపుత్ర సంఘం అధ్యక్షులు దేవరాజు, గంధం కృష్ణ, గంధం సురేష్, మైలారపు మహేష్, ముదా నరేష్, నర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
మంథని:
మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ముత్యాలమ్మవాడలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఇంటి ఇంటికీ తిరుగుతూ, బీజేపీ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయని, కేసీఆర్ పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రం చేశాడని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి, సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాష్, బోగోజు శ్రీనివాస్, ఎడ్ల సదాశివ్, పట్టణ ఉప అధ్యక్షులు దాసరి శ్రవణ్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు కాసర్ల సూర్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్ రెడ్డి

దశాబ్ది ఉత్సవాలు కాదు.. దగా ఉత్సవాలు

నవతెలంగాణ-కోరుట్ల:
తెలంగాణలో జరుగుతున్నవి దశాబ్ది ఉత్సవాలు కాదని అవి దగా ఉత్సవాలు అని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ అన్నారు. బుదవారం కొత్త బస్టాండు అంబేద్కర్ ముందు జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు నిరసన, రాస్తారోఖో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల గంగాధర్ మాట్లాడుతూ, దశాబ్ది ఉత్సవాల పేరు మీద కోట్ల రుపాయల ప్రజాధనం దిర్వినియోగం చేస్తున్నారని, ఈ ఉత్సవాలు బీఆర్ఎస్ పార్టీ పండగలా జరుపుకుంటూ డబ్బులను వృధాగా ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఆ డబ్బులతో ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తే ఎన్నో కుటుంబాలు బాగుపడుతుండేవన్నారు. కేసీఆర్ ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగులకు జీవనభృతి, విద్యార్థులకు ఫీజు రియెంబర్స్‌మెంట్ హామీలిచ్చి తొమ్మిదేళ్ల గడిచినా నెరవేర్చలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఇంటికి పంపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు అందె మారుతి, నాయకులు అమరేందర్, పన్నాల అంజిరెడ్డి, లక్ష్మన్, తుపాకుల భాజన్న, విటల్ రవీందర్ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో..

మల్యాల:
తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ దశాబ్ది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కని పెట్టి, దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది దగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మల్యాల మండలంలో ర్యాలీ తీసి, అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అవుతామంటూ వనరుల దోపిడియే లక్ష్యంగా బీఆర్ఎస్ పాలన సాగిందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధర్మపురి:
ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ ప్రజల సొమ్ముతో వేడుకలు చేయడాన్ని నిరసిస్తూ దశాబ్ది దగా అనే పేరిట నిరసన కార్యక్రమాన్ని గురువారం జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (మాజీ జడ్పీ చైర్మన్) ఆధ్వర్యంలో చేపట్టారు. ధర్మపురిలోని స్థానిక నంది విగ్రహం నుండి ర్యాలీగా బయలు దేరి గాంధీ విగ్రహం మీదుగా ఎమ్మార్వో ఆఫీస్‌కి చేరుకొని ధర్నా చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగన బట్ల దినేష్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, గొల్లపెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, పెగడపెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ 1 అధ్యక్షులు కుంట సుధాకర్, నియోజకర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాందెని మొగిలి తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల :
ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ప్రజల సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వేడుకలకు నిరసనగా గురువారం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో 'దశాబ్ది దగా' పేరిట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇందిరా భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి తహసీల్ చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత్రికేయుల పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించాలి

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్: జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో తీసుకుంటున్న ఫీజులపై 50 శాతం రాయితీ కల్పించాలని జిల్లా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ శివకృష్ణకు గురువారం రాయికల్ ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ సొసైటీ(రి) సభ్యులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నాగిరెడ్డి రఘుపతి, రాయికల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎర్దండి జితేందర్, ఉపాధ్యక్షులు కనికరపు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ఓరుగంటి భీమరాజు, కోశాధికారి కోమటి రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు వాసం లింబాద్రి, చెట్పెల్లి మారుతి, అందె రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై వినతి
రాయికల్ మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలన అధికారి నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. రాయికల్ మండలంలోని అర్హులైన, దారిద్రరేఖకు దిగువన ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు ఐక్యవేదిక సంఘాల ద్వారా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నాగిరెడ్డి రఘుపతి, రాయికల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎర్దండి జితేందర్, ఉపాధ్యక్షులు కనికరపు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ఓరుగంటి భీమరాజు, కోశాధికారి కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు వాసం లింబాద్రి, చెట్పెల్లి మారుతి, అందె రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం



ధర్మపురిలో...



మల్యాలలో...



మంథనిలో...

నవ తెలంగాణ-ధర్మపురి:
ధర్మపురి స్థానిక పురపాలక సంఘంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సతమ్మ, వైస్ చైర్మన్ రామన్న, వార్డు కౌన్సిలర్స్, కోఆప్షన్ సభ్యులు, ఆఫీస్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్థానిక పట్టణ ప్రజలు కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించి అమరవీరులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ప్రభుత్వం ద్వారా వచ్చిన అమరులవీరుల సంస్మరణ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, అధ్యక్షతన అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మైపాల్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీ మండల ఫోరం అధ్యక్షుడు రెడ్డివేణి సత్యం, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. ధర్మపురిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి అమరవీరులకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సంఘీ సత్యమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, వార్డు కౌన్సిలర్ తరాల కార్తీక్, గుర్రాల సుధాకర్, విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు, బాలరాజు, అక్కినపల్లి సురేందర్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.
మల్యాల:
మండల కేంద్రంలో తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు ఎమ్మెల్యే రవిశంకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరవీరుల స్మారక చిహ్నం ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది విద్యార్థులు, పోలీసులు, ఉద్యోగులు అమరులయ్యారని, వారి త్యాగం మరువలేనిదని అన్నారు. గ్రామ గ్రామాల నుండి కుల సంఘాల నాయకులు, ప్రజలు ఆనాడు రోడ్లపై వంట వార్పు చేసి స్వరాష్ట్రం కోసం కృషి చేశారని తెలిపారు.
మంథని:
తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, పాలకవర్గ సభ్యులు అమరవీరుల స్థూపానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం మంథని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మించడానికి స్థలాన్ని కౌన్సిల్ సభ్యుల సమక్షంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో పాటు వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
జూలపల్లి:
జూలపల్లి మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మొగ్గరం రమేష్, తహసీల్దార్ అబూబకర్, ఎంపీడీవో వేణుగోపాల రావు, డాక్టర్ సంపత్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దారబోయిన నర్సింగ్ యాదవ్, శకుంతల, ఎంపీటీసీలు గొట్టే ముక్కుల రజిని, తమ్మడవేణి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.
మంథని: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అమరవీరుల పాత్ర మరువలేనిదని, వారు చేసిన ఆత్మ బలిదానాల వల్ల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని ప్రిన్సిపల్ ఎండీ తాహెర్ హుస్సేన్, ఎంపీడీవో రమేష్ అన్నారు. మంథని ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వేరువేరుగా నిర్వహించిన తెలంగాణ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో వారు ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ తెలంగాణ అభివృద్ధికి, అమరుల త్యాగాలకు గుర్తింపు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
మంథని: బొక్కలవాగు వంతెనపై
అమరవీరుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అమరుల త్యాగాలను బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మంథని బొక్కలవాగు రెండో వంతెనపై అమరవీరుల స్మారక స్థూప నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురు ఉద్యమకారులను ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన అల్ఫోర్స్ విద్యార్థిని

నవ తెలంగాణ జగిత్యాల టౌన్ : హర్యానా రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి బాలికల కిక్ బాక్సింగ్ సబ్ జూనియర్ పోటీల్లో మల్యాల అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థిని దుబ్బాక శ్రీజ రజత పతకం సాధించింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందించారు.



లింగంపేట్‌లో పోచమ్మ తల్లి బోనాల జాతర

నవ తెలంగాణ- జగిత్యాల టౌన్: జగిత్యాల పట్టణంలోని 10వ వార్డు లింగంపేట్‌లో పోచమ్మ తల్లి బోనాల జాతర మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ భోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న, జగిత్యాల పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, మల్లీశ్వరి గ్రామస్తులు పాల్గొన్నారు.



మహిళకు ఆర్థిక సహాయాన్ని అందించిన బోలేనాథ్ కర్బల ట్రస్ట్ వ్యవస్థాపకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం భర్దిపూర్ గ్రామానికి చెందిన ఆడపడుచు భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బోలేనాథ్ కర్బల ట్రస్ట్ అధ్యక్షులు సొంతి మోహన్ యోగి ఆమెను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు సొంతి మోహన్ యోగి మాట్లాడుతూ, ప్రజలకు కష్టం వచ్చిందంటే తన వంతు బాధ్యతగా ముందుండి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మోహన్ యోగితో పాటు రఘు ప్రవీణ్, ఆశిష్, సతీష్, మణికాంత్, శ్రీకాంత్, శ్రీనాథ్‌తో పాటు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎలుక రాజు యాదవ్

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్: గొర్రెల కాపారుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా ఎలుక రాజు యాదవ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు యాదవులు, కురుమలు, గొర్ల కాపరులు ఎదురుకొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని సూచించినట్లు రాజు యాదవ్ తెలిపారు. గొర్రెల కాపరుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని, గొర్రెల పెంపకంలో పశుపోషణ, ఎగుమతులు, మార్కెటింగ్‌ల నూతన ఆవిష్కరణల కోసం, సంఘ విస్తరణ కోసం కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్‌తో పాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేష్ యాదవ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

మంథని ప్రాంతం సుభిక్షంగా ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ

నవతెలంగాణ-మంథని: మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కోరారు. మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో ఊరి పోచమ్మ కొలుపు సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల ఆశీర్వాదంతో బిట్టుపల్లి గ్రామ ప్రజలతో పాటు మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఆమె వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మంథని:
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావును మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మంథని ప్రాంత అభివృద్ధి విషయాలను, సమస్యలను జీఎం సుధాకర్ రావుకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్ ముసుకుల సురేందర్ రెడ్డి, కన్నాల గ్రామ సర్పంచ్ మంగా దామోదర్ రెడ్డి, బీసీ సెల్ మంథని మున్సిపల్ ప్రెసిడెంట్ బండారి ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐలి ప్రసాద్, మోహన్ యాదవ్, మబ్బు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



జీఎంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావుకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-మంథని:
రామగుండం ఆర్జీ-3 జనరల్ మేనేజర్ సుధాకర్ రావును గురువారం రచ్చపల్లి సర్పంచ్ కనవేన శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రచ్చపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీలో తాగునీటి సమస్యతో గ్రామ ప్రజలు నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామ లైన్ ఒక్క బోర్ చొప్పున 20 బోర్లు మంజూరు చేయాలని, కొత్తగా 30 ప్లాట్స్‌కి నీటి సరఫరా కోసం పైప్ లైన్ మంజూరు చేయాలని కోరారు.



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలం గుంపుల గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే పీసీసీ ఉపాధ్యక్షులు విజయ రమణారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నిధులను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిప్పారపు శారదా సంపత్, రూప్ నారాయణపేట సర్పంచ్ అంకం రమేష్, ఎంపీటీసీ రాగిడి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఊరకొండ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీలు రమేష్, నీళ్ల శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ బొంగోని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

నవతెలంగాణ-ఓదెల: మండలంలోని పొత్కపల్లి గ్రామంలో పెద్దపల్లి బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి దాసరి ఉష విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను కొండల, గుట్టల ప్రాంతాల్లో, ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థలాల్లో కేవలం బోర్డులకే పరిమితమయ్యేలా ఏర్పాటు చేశారని ఆరోపించారు. పొత్కపల్లి గ్రామంలో గ్రామీణ క్రీడా ప్రాంగణానికి స్థలం కేటాయించాలని పొత్కపల్లి యువత తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ కుమార్‌కి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు మహ్మద్ మోహిన్, మొండిద్దుల సతీష్‌పల్లె శివకష్ణ,వెంపటి అనిల్,మొండెద్దుల పవన్, వర్షిత్, పాల శివ, పాల ఈశ్వర్, వంగ రాజేష్, సాయి ప్రణీత్, అభినయ్, రెడ్డి అరవింద్, కళ్యాణ, మహేష్, ఎండీ వహీద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చెరువు ఆధునీకరణతో కొత్త శోభ

జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని: గత పాలకుల హయాంలో మురికికూపంలా మారిన అంబేద్కర్‌నగర్ చెరువు ఆధునీకరణతో మంథనికి కొత్త శోభ సంతరించుకుంటుందని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. అంబేద్కర్ చెరువును గురువారం ఆయన పరిశీలించి ఆధునీకరణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంథని పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బన్నె చెరువు నుంచి పైప్‌లైన్ ద్వారా అంబేద్కర్ చెరువులోకి నీటిని తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చెరువును పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్

తెలంగాణ సిద్ధాంత కర్తకు ఘన నివాళి

నవతెలంగాణ-ఓదెల:
ఓదెల మండలం కొలనూరు రైల్వే గేట్ సమీపంలో ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బుధవారం కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వారి స్ఫూర్తితోనే ముందుకు వెళుతుందని అన్నారు. ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగం కొమురయ్య, జిగురు రాజేందర్, శంకరయ్య, చంద్రయ్య, మోహన్ రెడ్డి, మల్లయ్య, రామచందర్, రవి, శ్రీనివాస్ రెడ్డి, జానీ తదితరులు ఉన్నారు.



వారసంతలో జ్యూట్ బ్యాగుల పంపిణీ


నవతెలంగాణ- యైటింక్లైన్ కాలనీ: కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో జూన్ 16 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గురువారం అఫీషియెటింగ్ ఎస్ఓ టు జీఎం బచ్చ రవీందర్ వారసంతకు వచ్చిన వ్యాపారులకు ఉచితంగా జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. క్రమక్రమంగా ప్లాస్టిక్ వస్తువులను తగ్గిస్తూ బట్ట సంచులను వాడాలని అఫీషియటింగ్ ఎస్ఓటు జీఎం బచ్చ రవీందర్ అన్నారు. కార్యక్రమంలో టీజీబీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్, అధికార ప్రతినిధి జి.రాజేంద్ర ప్రసాద్, డీజీఎం ఈఈ మురళీకృష్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పివి.రమణ, సీనియర్ ఎస్టేట్స్ అధికారి జే.సునీత, పర్యావరణ అధికారి సురేష్ బాబు, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎస్ఓటూ జీఎం బచ్చ రవీందర్

వ్యక్తి అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్యగుట్టకు చెందిన ఇప్ప సుమన్ (32) అనే వ్యక్తి బుదవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. అల్లమయ్య గుట్ట ప్రజల వివరాల ప్రకారం సుమన్ రోజు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల అతను అనారోగ్యం పాలవడంతో కొన్ని రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన కోదండ రాంచం ద్రం వద్ద రూ.80 వేలు అప్పు తీసుకున్నాడు. రాంచంద్రం పండుగకు సుమన్‌ను భోజనానికి రమ్మని పిలిచాడని అక్కడి నుండి ఇంటికి రాలేదని వారి ఇంటి దగ్గర శవమై కనిపించారని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.



మృతిచెందిన సుమన్

తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పడిపోయింది

- గతంలో బండి సంజయ్ టీఆర్ఎస్‌లో చేరుతానన్నారు
- సివిల్ సప్లయ్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్

నవతెలంగాణ - కరీంనగర్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలతో ఆ పార్టీ గ్రాఫ్ పడిపోయిందని రాష్ట్ర సివిల్ సప్లై చైర్మన్ రవీందర్‌సింగ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ప్రచారానికి వెళ్లిన బండి సంజయ్‌కి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలే దర్శనమిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఒక్కటి చేరకపోవడం ఏ ఇంటి గడప తొక్కినా ఎదురు దెబ్బలే తగులుతున్నాయని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎంపీగా కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుండి ఏం నిధులు తీసుకొచ్చావో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 2014లో కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరుతానని తనను స్వయంగా అడిగారని , అడిగిన మాట వాస్తవం కాదా చెప్పాలన్నారు. కేసీఆర్ గొప్పనాయకుడిగా కొనియాడరని తెలిపారు. రాజకీయాలలో వ్యక్తి గత విమర్శలు సరికాదన్నారు. బిజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని, కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని బండి సంజయ్ ప్రచారం చేశాడని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కూర తిరుపతి పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌లో కాసింపేటకు అవార్డు

మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న సర్పంచ్ మల్లీశ్వరివెంకన్న



మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గంప మల్లేశ్వరివెంకన్న

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని కాసీంపేట గ్రామానికి స్వచ్ఛభారత్ మిషన్‌లో ఇంటర్నేషనల్ అవార్డు గెలుచుకుంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ చేతుల మీదుగా స్వచ్ఛభారత్ మిషన్ ఇంటర్నేషనల్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని సర్పంచ్ గంప మల్లేశ్వరివెంకన్న అందుకున్నారు. సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఇటీవల గన్నేరువరం గ్రామం జాతీయస్థాయిలో ఎంపికైంది. ప్రస్తుతం 164 దేశాలలో కాసింపేట గ్రామం ఎంపికం కావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, అధికారులు, గ్రామ పాలకవర్గం సభ్యులు, ప్రజల సహకారంతో ఈ విజయం సాధించినట్టు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు నూతన పంచాయతీ చట్టం ప్రకారంగా ఇచ్చిన పనులను 100 శాతం పూర్తి చేశామన్నారు.

మూడు గ్రామాలకు ఐఎస్ఓ 9001 సర్టిఫికెట్స్ అందజేసిన మంత్రి గంగుల





నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని ఉత్తమ పరిపాలన, ప్రమాణాలు కలిగిన మహాత్మానగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్ గ్రామపంచాయతీలకు (అంతర్జాతీయ ప్రమాణాలు సంస్థ) ఐఎస్ఓ 9001 సర్టిఫికెట్స్‌ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ కర్ణన్‌లు ఆయా గ్రామాల సర్పంచులకు గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనితదేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇనుకొండ శైలజజితేందర్‌రెడ్డి, సర్పంచులు జక్కని శ్రీవాణిరవీందర్, దుండ్ర నీలమ్మరాజయ్య యాదవ్, రావుల రమేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రణీత్, మహేందర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలిచాలకు ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు



ప్రశంసా పత్రాలను అందుకుంటున్న సర్పంచ్ వీర్ల సరోజన

నవతెలంగాణ - రామడుగు

మండలంలోని వెలిచాల గ్రామం ఉత్తమ గ్రామపంచా యతీగా ఎంపికైంది. పచ్చదనం, పరిశుభ్రతపై ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్స్ వారు గుర్తించగా సర్పంచ్ వీర్ల సరోజన ప్రభాకర్‌రావు గురువారం కరీంనగర్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, సుడా చైర్మన్ జీవి.రామకృష్ణారావు, జెడ్పీ సీఈవో ప్రియాంకకర్ణన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, రామడుగు జెడ్పీటీసీ మర్కొండ లక్ష్మి పాల్గొన్నారు.

నిధుల మంజూరు పట్ల మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మానకొండూర్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కరీంనగర్‌లో బుధవారం రాత్రి తీగల వంతెన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సదాశివపల్లి నుండి మానకొండూర్ వరకు ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. వెంటనే స్పందించిన కేటీఆర్ రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

'బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలి'

నవతెలంగాణ - జమ్మికుంట : తెలంగాణ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. గురువారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం జమ్మికుంట పట్టణంలో నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పొన్నగంటి శంకరయ్య, పొన్నగంటి రవికుమార్ పి జె ఆర్, గాండ్ల సంపత్, ఆకుల పోచయ్య, కైలాసకోటి గణేష్, దేవులపల్లి నవీన్, ఆకుల సాయి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం

నవతెలంగాణ - గంగాధర : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు ప్రచారం చేసే కార్యక్రమానికి గంగాధర మండలంలో బీజేపీ నాయకులు చేపట్టారు.కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, జిల్లా కోశాధికారి వైద రామానుజం, నాయకులు తూము నారాయణ, రాజేంద్ర ప్రసాద్, పెరుక మహేష్, కముటం శ్రీనివాస్, తూము కరుణాకర్, వంశీ, వినయ్, చందు పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్

మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహత్మనగర్ గ్రామంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నాయకులు చేపట్టారు. కేంద్ర పథకాలను వివరించారు. బిజెపి రాష్ట కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వరరెడ్డి, రేగుల శ్రీనివాస్, ఎలుక మురళి, జక్కుల శ్రీనివాస్, రమణారెడ్డి, ప్రేమ్ చందు, అక్షయ్ కుమార్ పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలమే రాష్ట్ర ఏర్పాటు

మంత్రి గంగుల కమలాకర్



అమర వీరుల కుటుంబాలను సన్మానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్

అమరవీరుల ప్రాణత్యాగాలు తెలంగాణ ఏర్పాటులో ముఖ్య భూమిక వహించాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను వెలకట్టలేమని అన్నారు. అమర వీరుల కుటుంబాలను సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకున్నారని, పోలీస్ కిష్టయ్య బిడ్డ ప్రస్తుతం డాక్టర్‌గా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా 31 మంది అమరుల కుటుంబ సభ్యులను మంత్రి సన్మానించారు. అనంతరం జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులను మంత్రి సన్మానించారు. కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులందరికీ సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, సుడా చైర్మెన్ జీవీ.రామకృష్ణారావు, జిల్లా పరిషత్ సీఈఓ ప్రియాంక, జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొన్నం కార్పొరేటర్‌గా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా

కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

నవతెలంగాణ - కరీంనగర్

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కనీసం కార్పొరేటర్‌గా గెలువలేని నాయకుడని... అలాంటి వ్యక్తి మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరపాలక సంస్థలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఏనాడు ప్రజా సమస్యలు పట్టని, స్పందించని నాయకుడు పొన్నం ఎన్నికల సీజన్ రావడంతో ముందుకు వచ్చారని ఎద్దేవా చేశారు. ఒకసారి అదృష్టం కొద్ది ఎంపీగా గెలిచాడని అన్నారు. అర్బన్ బ్యాంకు డైరెక్టర్ గా గెలువలేదన్నారు. ప్రతి సారి ఎన్నికలు వచ్చినప్పుడు ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసి ఓడిపోవడం ఆయనకు పరిపాటన్నారు. కనీసం కరీంనగర్‌లోని కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఏ డివిజన్ నుంచి కూడా కనీసం కార్పొరేటర్‌గా గెలవలేడని విమర్శించారు. కనీసం తాను నివసిస్తున్న 36డివిజన్‌లో కూడా గెలిచే సత్తాలేదన్నారు. ఏ డివిజన్ నుంచి పోటీ చేసి గెలిచినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. దమ్ముంటే పొన్నం నివసించే 36వ డివిజన్‌లో ప్రస్తుత కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారని, ఆమెపై పోటీచేసి దమ్ముందా అని ప్రశ్నించారు. ఉనికి కోసం చౌకబారు మాటలు మాట్లాడవద్దని, మరోమారు మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించారని విమర్శించారు. పాము ఆకలి వేసినప్పుడు తన పిల్లలను తిన్నట్టే కాంగ్రెస్ నాయకుడిగా కరీంనగర్‌లో ఉన్న నాయకులను ఎదగకుండా చేశారన్నారు.

బీఆర్ఎస్ నాయకుల వినూత్న నిరసన

హుజురాబాద్‌లో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఓ స్క్రాప్ అని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. గురువారం నగరపాలక సంస్థ పాతవస్తువుల సేకరణ కేంద్రం ట్రిబుల్ ఆర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేయర్ వై.సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఎడ్ల అశోక్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. తుప్పు పట్టిన రేకు డబ్బాలకు పొన్నం ప్రభాకర్ చిత్రపటాన్ని అతికించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గందే మాధవి, ఎడ్ల సరిత, అర్ష కిరణ్మయి, గంట కళ్యాణి, పిట్టల వినోద, గుగ్గిళ్ల జయశ్రీ, లెక్కల స్వప్న, సల్ల శారద, నక్క పద్మ కోల మాలతి, నండెల్లి రమ, వాల రమణారావు, బోనాల శ్రీకాంత్, బండారి వేణు, నాంపల్లి శ్రీనివాస్, జంగిలి సాగర్, తోట రాములు, ఐలేందర్ యాదవ్, నాయకులు గందె మహేష్ తుల బాలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ - కరీంనగర్ : దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తుందని, ఎన్నికల ప్రచారంలో సీఎం ప్రకటించిన 10 హామీలను విస్మరించారని దశాబ్ది దగా పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీంనగర్‌లో గురువారం నిరసన తెలిపారు. నగరంలోని ఇందిరా చౌక్‌లో కేసీఆర్ విస్మరించిన 10 హామీలను సూచిస్తూ ఏర్పాటుచేసిన పది తలలకసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కత్తి వెంకటస్వామి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేనేని రోహిత్‌రావు మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.తాజ్, పడాల రాహుల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం



సహకార సంఘం చైర్మన్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీలో ఈ నెల 2 నుంచి 22 వరకు నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి గ్రామ సర్పంచ్ మీసాల అంజయ్య గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న నుస్తులాపూర్ సహకార సంఘం చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి దంపతులకు, గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, నాయకులు పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియమ్ ప్రారంభం

హాజరైన బిఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టి.వెంకటేష్



ముఖ్య అతిథిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలో రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఎసెంట్రా - 2కే23 జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేష్ హాజరై మాట్లాడారు. విఎల్ ఎస్ఐ చిప్స్, టెలికమ్ క్లౌడ్ కౌంటింగ్ రంగాలలో పరిజ్ఞానాన్ని, విదేశీ అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఇలాంటి సదస్సులను సద్వినియోగం చేసుకొని కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్టులు, పోస్టర్ ప్రజెంటేషన్ తిలకించారు. మొదటిరోజు టెక్నికల్ ఈవెంట్స్ లో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో, పిపిటి ప్రజెంటేషన్, పోస్టర్ టెక్నికల్ క్విజ్‌లలో వివిధ కళాశాల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ముఖ్య అతిథిని శాలువా, మెమోంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ విశ్వనాథ్ వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఈసీ విభాగాధిపతి డాక్టర్ వెంకట్‌రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ సీనియర్ నాయకుడు



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - రామడుగు : మండలంలోని దేశరాజు పల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వేముల శంకరయ్య కాంగ్రెస్ పార్టీలో గురువారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చేరారు. ఆయనకు వారు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేశరాజుపల్లి సర్పంచు కోల రమేష్, వన్నారం ఎంపీటీసి జవ్వాజి హరీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెరవేణి తిరుపతి, నాయకుడు కాడె శంకర్ పాల్గొన్నారు.

నా హద్దులోనే మట్టి తీశాను : పైడిపల్లి మణికంఠ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని నల్లగొండ గ్రామ శివారు 172 సర్వే నెంబరులో నాలుగు ఎకరాల భూమిని 2010లో దన్నమనేని ప్రవీణ్‌రావు, దన్నమనేని గౌతమ్‌రావు వద్ద తాము పైడిపల్లి మణికంఠ, పైడిపల్లి అంజిబాబు కొన్నామని పైడిపల్లి మణికంఠ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతు.. ఆ సర్వే నెంబర్‌లో గల భూమికి వారే హద్దులను ఏర్పాటు చేశారని, వారు చూపించిన భూమి హద్దుల వరకే మట్టిని తీసానని, కట్టను తొలగించలేదని చెప్పారు. తాము చెరువు కట్ట మట్టి తీసామని కావాలనే ప్రవీణ్‌రావు తమపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారని ఆరోపించారు.

మృతురాలి కుటుంబానికి సాయం

నవతెలంగాణ - శంకరపట్నం : ఆముదాలపల్లి గ్రామంలో ఇటీవల దొంగల కొమురమ్మ మృతిచెందగా కుటుంబ సభ్యులను గురువారం గ్రామ సర్పంచ్ భత్తుల మానస, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్‌రెడ్డి పరమర్శించారు. 50కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కే.జంపయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో యువకుడు మృతి



వంచ శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

నవతెలంగాణ - రామడుగు : ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వెదిర గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెదిర గ్రామానికి చెందిన వంచ శ్రీకాంత్‌రెడ్డి (24) తన ఇంటివద్ద బాత్‌రూం నిర్మిస్తున్నారు. బాత్‌రూం పైనుండి11కేవి విద్యుత్ లైన్ వెళుతుంది. బాత్రూం నిర్మాణ పనులు చేస్తూ ఒక్కసారిగా పైకి లేవడంతో 11కేవి లైన్‌కు తగలడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ మృతుడి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని పర్లపల్లి గ్రామంలో మహిళతో అసభ్యంగా ప్రవర్తించారని ఫిర్యాదు మేరకు ఒకరిని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ నెల 18న గ్రామానికి చెందిన మహిళ నడుచుకుంటూ వెళుతుండగా అదే గ్రామానికి చెందిన కీసర సురేష్ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

అమరవీరులకు ఘన నివాళి



జమ్మికుంట: అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - జమ్మికుంట

తెలంగాణ అమరవీరుల త్యాగం మరువలేనివని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం దగ్గర అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అమరుల సంస్మరణ తీర్మానం చేసి ఆ కాపీని జిల్లా కలెక్టర్ సిడిఎంఏకు పంపిస్తూ, అమరుల త్యాగాలు గుర్తుచేసుకుని 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సిఎల్ఆర్‌పిలు, ఆర్పీలకు మున్సిపల్ తరుపున చీరలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్స న్ దేశిని స్వప్నకోటి, కమిషనర్ బి.శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ : అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని అన్ని గ్రామాలలో అమరులను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ఎల్ఎండి కాలనీలోని అమరవీరుల స్థూపం వద్ద, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన నివాళులర్పించారు. జెడ్పీటీసీ ఇనుకొండ శైలజజితేందర్‌రెడ్డి, సర్పంచ్ జక్కని శ్రీవాణిరవీందర్, ఉపసర్పంచ్ మడుపు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీఓ కిరణ్ కుమార్, ఎంఈఓ కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శి ప్రణీత్, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



గన్నేరువరం : అమరులకు నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - గన్నేరువరం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ అమరవీరులకు ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, ఎంపీడీవో ఆవునూరి స్వాతి, ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం పాటించి నివాళులర్పించారు. ఎంపిటిసిలు గూడేల్లి ఆంజనేయులు, అటికం రాజేశంగౌడ్, నాయకులు న్యాత సుధాకర్, ఎలేటి చంద్రారెడ్డి, బొడ్డు సునీల్, ఎంపీఓ నరసింహారెడ్డి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీణవంక

అమరవీరుల త్యాగాలు ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అని ఎంపీపీ రేణుక అన్నారు. అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వీణవంక మండల పరిషత్ కార్యాలయంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ ప్రభాకర్, నాగిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సైదాపూర్ : నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ - సైదాపూర్

వే-సైదాపూర్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చంద శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమరపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంగాధర

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గంగాధర మండలం చర్లపల్లి (ఆర్) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ పాఠశాల హెచ్ఎం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు కవిత, బోధనేతర సిబ్బంది, అంగన్వాడీ టీచర్ అంజలి, విద్యార్థులు అమరవీరులను స్మరించుకుంటూ ప్రార్థన సమయంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లర్పించారు.



గంగాధర : మౌనం పాటించి అమరులకు సంతాపం ప్రకటించిన విద్యార్థులు

విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకులు సీపెల్లి రవీందర్

నవతెలంగాణ - పెద్దపల్లి : వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు జరిగిన అన్యాయంపై విచారణ చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకులు రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం చిన్న బొంకూర్ రెబలదేవ్పల్లి కొనుగోలు కేంద్రాలలో రైతులకు జరిగిన అన్యాయంపై పూర్తి వివరాలతో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణకు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సీపెల్లి రవిందర్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ పిఎసిఎస్ చిన్నకల్వల పరిధిలోని చిన్నబొంకూర్ రెబ్బలుదేరుపల్లి వరి ధాన్యం కొనుగోలు సెంటర్లలో రైతుల నుండి సేకరించిన ధాన్యానికి డబ్బులు క్వింటాల్ రేటుకు సరిపడా డబ్బులు జమ కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలలోని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఒక్కొక్క ట్రక్ ద్వారా దాదాపు 20నుంచి 25బస్తాలు ధాన్యాన్ని రైతులకు తెలువకుండా పక్కదారి పట్టిస్తూ రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కై రైతులను మోసం చేశారని, దీనిపై వెంటనే విచారణ చేపట్టి రైతులకు పడాల్సిన డబ్బులు జమ చేయాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లాల ప్రశాంత్, శ్రీకాంత్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

మద్యం డబ్బులు లేకుండా ఎన్నికకు కాంగ్రెస్ సిద్ధం.. మీరు సిద్ధమా

కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : సిరిసిల్ల నియోజవర్గానికి జరిగే ఎమ్మెల్యే ఎన్నికకు డబ్బులు మద్యం లేకుండా ఎన్నికకు వస్తామని, గతంలో కూడా వచ్చామని మీరు సిద్ధామా అని గురువారం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడిన మాటలకు స్పందిస్తూ సిరిసిల్ల అంబేద్కర్ విగ్రహం వద్ద అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్నారు. ఇప్పటివరకు పోలీసులను వాడుకోలేదని మంత్రి కేటీఆర్ చెబుతున్న మాటలకు అర్థం లేదన్నారు. నియోజవర్గానికి వచ్చే ప్రతిసారి తమ కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌లో పెట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. ఇప్పటికే సిరిసిల్లలో ఇసుక మాఫీయా, భూ కబ్జాలు, ల్యాండ్ మాఫీయా మంత్రి అనుచరుల చేత నడిపిస్తున్నారని ఆరోపించారు. నేరెళ్ల బాధితుల నుండి ఇప్పటి వరకు ప్రజలపై ఎన్ని దౌర్జన్యాలు చేయాలో అన్ని చేశారన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం అడగడం మా బాధ్యతగా అడుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు కొత్తపల్లి దేవయ్య, చెన్ని బాబు, గంట బుచ్చాగౌడ్, బీపేట రాజు, వంగ మల్లారెడ్డి, పరుశురాములు, ప్రశాంత్, లచ్చిరెడ్డిలు పాల్గొన్నారు.

గుండారం గ్రామంలో చేరికలు

గుండారం గ్రామస్తులకు గురవయ్య అటవీ భూమిని పంచేవరకు తమ పోరాటం కొనసాగుతుందని కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫారెస్ట్ భూమిలో పశువులను మేతకు తీసుకెళ్లడం, వంట చెరుకు తెచ్చుకోవడం, గిరిజనులకు ఉన్నటువంటి హక్కులను కాపాడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన సిద్దాల లచ్చయ్య, జల్ల సత్తయ్య, లాల దేవయ్య, లకావత్ లచ్చిరాం, జయరాం, తులసిరామ్‌లను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అంగన్‌వాడిలపై ఆర్‌టీఐ కార్యకర్తల హంగామా



మాట్లాడుతున్న ఏఐటీయూసీ , అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : తాము ఆర్టీఐ కార్యకర్తలమంటూ, తమకు అంగన్‌వాడీ సెంటర్ అన్ని రిజిస్ట్రర్లను చూపాలంటూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అంగన్ వాడి సెంటర్‌పై హంగామా సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలంటూ ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫోన్ చేసి కొందరు తాము ఆర్టిఐ కార్యకర్తలమంటూ, తమకు సదరు అంగన్‌వాడీ సెంటర్ టీచర్ హాజరు పట్టిక, మరికొన్ని రిజిస్టర్లు చూపాలంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. నిబంధనల ప్రకారం తనిఖీ, సమాచారం పొందాలనుకుంటే సదరు సంస్థ ఆర్టిఐ అధికారికి ముందస్తూ లేఖ సమర్పించి అనుమతి పొందిల్సి ఉంటుందని,అలా నిబంధనల ప్రకారం వస్తే ఎలాంటి సమాచారం ఇవ్వడానికైన సిద్ధమని, కానీ ఇలా ఆర్టిఐ కార్యకర్తమంటూ బెదిరింపులకు పాల్పడటం సరికాదని హెచ్చరించారు. ఇలా అంగన్‌వాడీ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు అజ్జవేణు,అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కల్లూరి చందన, ఎ.మమత పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోజివ్స్ ఏజీఎంగా కృష్ణ గోపాల్ తివారి



నవతెలంగాణ - రామగిరి : రామగుండం రీజియన్ బ్లాస్టింగ్స్ అండ్ ఎక్స్ ప్లోజివ్స్ ఏజీఎంగా కృష్ణ గోపాల్ తివారి బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎక్స్‌ప్లోజివ్స్ జీఎం విధులు నిర్వహించిన ఎల్‌వి సూర్యానారాయణ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కార్పొరేట్ సేఫ్టీ ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్న కృష్ణ గోపాల్ తివారి ఇటీవలే బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సస్పెన్స్, థ్రిల్లర్ కథాంశంతో బైరాన్‌పల్లి

- నేడు సినిమా థియేటర్లలో విడుదల

- సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి

- వివరాలు వెల్లడించిన డైరెక్టర్, నిర్మాత


మాట్లాడుతున్న సినిమా యూనిట్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

సినిమా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు సినిమా తీయడానికి తమవంతు పాత్రను పోషిస్తున్నామని సినిమా డైరెక్టర్ వెంకట్ కాచర్ల అన్నారు. సస్పెన్స్, థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన బైరాన్‌పల్లి సినిమా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లలో విడుదల కానుంది. దీనిని పురస్కరించుకొని గురువారం ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ వెంకట్ మాట్లాడుతూ రూ.కోటి 10లక్షల బడ్జెటుతో సినిమా రూపొందించామని, సినిమా ఆరంభం నుండే సస్పెన్స్ ఉంటుందని, అద్వితీయమైన మలుపులు సినిమాలో ఉండబోతున్నాయని పేర్కొన్నారు. సినిమాను పెద్దపల్లి జిల్లాలోని అటవీ, గ్రామీణ ప్రాంతాల్లోనే చిత్రీకరణ చేయడం జరిగిందని, తెలంగాణ సంస్కృతి, యాస భాషతో సినిమా నిర్మించామని వివరించారు. ఇప్పటికే హిట్ టాక్‌తో తమ సినిమా 8.8 రేటింగ్ సాధించిందని, థియేటర్ల తర్వాత ఓటిటీలో విడుదల చేస్తామని తెలిపారు. ఈ సినిమాకు పూర్ణచంద్ర బైరి సంగీతం స్వరకూర్చారని, స్వరం సాయి కీర్తన గీతాలాపన చేశారన్నారు. తెలంగాణ గ్రామీణ యాస నేపథ్యంలో కొనసాగే తమ సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయాన్ని అందించాలని వెంకట్ కోరారు. ఈ సమావేశంలో ప్రొడ్యూసర్ నరేష్ వర్మ, నటీనటులు ప్రభావతి, దామెర రాజేష్, కీసుపిట్ట స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదం బాధాకరం..


పరీక్షిస్తున్న డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ

నవతెలంగాణ- ఇల్లంతకుంట : మండలంలోని వల్లంపట్ల గ్రామంలో బుధవారం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదం బాధాకరమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించి, బాధితులను స్వయంగా పరీక్షించి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. స్థానిక ఎంపీపీ రమణారెడ్డి బాధితులను పరామర్శించి ధైర్యం నింపారు.

త్వరలో డబుల్ బెడ్రూం ఇండ్లకు నిధులు

- రానున్న రోజుల్లో రెండు గ్రామాలకో రైస్ మిల్లు

- వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

నవతెలంగాణ - చందుర్తి

డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు తెలిపారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా నర్సింగాపూర్‌లో గ్రామ పంచాయతీకి కార్యాలయానికి శంకుస్థాపన చేసి, దళిత బందు ద్వారా ఏర్పాటు చేసిన టెంట్ హౌస్‌ను ప్రారంభించారు. రెడ్డి కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. అనంతరం ఏర్పటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చందుర్తి నుంచి నర్సింగాపూర్ గ్రామం వరకు రూ.2కోట్ల 10లక్షలతో రోడ్డు నిర్మాణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. రానున్న రోజుల్లో రెండు గ్రామాలకు ఒక మిల్లు ఏర్పాటు చేసి ఐకేపీ ద్వారా ధాన్యాన్ని కోనుగోలు చేస్తామని తెలిపారు. మర్రిగడ్డ, రామారావుపల్లి, లింగంపేట, చందుర్తిలో ఐకేపీ ద్వారా వచ్చిన రైతులకు వ్యవసాయ పని ముట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బైరగొని లావణ్య, ఏఎంసీ చైర్మెన్ శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, బత్తుల కమలాకర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను కలిసిన టిడబ్ల్యూజేఎఫ్ మండల కమిటీ


ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సుల్తానాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిలను పెద్దపల్లి ఐబీ గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంక మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని వినోద్, జిల్లా సహాయ కార్యదర్శి సాబీర్ పాషా, సుల్తానాబాద్ మండలం అధ్యక్షుడు పల్ల మహేష్, మండల ప్రధాన కార్యదర్శి నూక రామదాసు, మండల కోశాధికారి పిట్టల పరమేష్, మండల ఉపాధ్యక్షుడు గోపికృష్ణ, మండల జాయింట్ సెక్రెటరీ ఓంకార్ గౌడ్, సబ్బు సతీష్ పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలతో దగా

టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణరావు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు


పెద్దపల్లి టౌన్ : సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


సుల్తానాబాద్ రూరల్ : ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలతో దగా చేస్తుందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే ,టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణ రావు అన్నారు. టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ముందు గురువారం దశాబ్ది దగా అనే నినాదంతో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తుంగలో తొక్కి ముఖ్యమంత్రి పదవిని రాజాబోగాలతో అనుభవిస్తున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూపంపిణీ, ఫీజు రీయింబర్స్మెంట్, కేజీ నుంచి పీజీ నిర్బంధ విద్య, ముస్లిమ్‌లకు 12శాతం రిజర్వేషన్, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు, ఇతర హామీలు అమలు చేయకుండా పబ్బం గడుపుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల రామూర్తి ,నుగిల్లా మల్లయ్య, భూతగడ్డ సంపత్,భుషణవేన సురేష్ గౌడ్, కడార్ల శ్రీనివాస్, అరే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - జూలపల్లి

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ జూలపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ అబు బాకర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గొట్టేముక్కల రవీందర్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొంపల్లి స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మానుమండ్ల శ్రీనివాస్, స్వామి, కొమ్మ పోశాలు, బీసీ సెల్ మండల అధ్యక్షులు పెసరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సుల్తాన్పూర్ సర్పంచ్ వెంకటేశ్వరరావు, శివపల్లి సర్పంచ్ శ్వేతసంతోష్‌రావు, కార్యకర్తలతో కలిసి సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ తిరుపతి గౌడ్‌అమ్ముల శ్రీనివాస్, అమ్ముల రాయమల్లు, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సుల్తానాబాద్ రూరల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలతో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను దగా చేస్తుందని కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండల కేంద్రంలోని నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మినుపాలా ప్రకాశరావు, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రావు, ఊట్ల వరప్రసాద్, వన్నాల రాములు, మీసా సత్యనారాయణ, దున్నపోతుల రాజయ్య, ఎంపీటీసీ మండల సిద్ధ తిరుపతి పాల్గొన్నారు.

నవతెలంగాణ-మంథని : దశాబ్ది దగా పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంథని అంబేద్కర్ చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి, పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మంథని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంథని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను ప్రభుత్వం నెరవేరుస్తుంది

ఎంపీపీ పిల్లి రేణుక

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటలు, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ అధ్యక్షురాలు పిల్లి రేణుక కిషన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి పిల్లి రేణుక కిషన్ అధ్యక్షతన గురువారం జరిగింది. తెలంగాణ రాష్ట్రం కోసం అమరులైన అమర వీరుల పేరిట తాత్కాలిక స్థూపం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసి రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి స్థూపం ఎదుట తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన అమరులకు ఎంపిపి పిల్లి రేణుక కిషన్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జబ్బార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి, ఎంపిడివో చిరంజీవి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి భూమిరెడ్డి, ఎంపిటిసి సభ్యులు ఎలగందుల అనసూయ నర్సింలు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



సుల్తానాబాద్ 04 : గ్రామ సభలో మాట్లాడుతున్న సిఐ జగదీష్

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : యువత సన్మార్గంలో పైనించి తమ అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని సుల్తానాబాద్ సీఐ జగదీష్ అన్నారు. బుధవారం రాత్రి సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి మరియు అల్లిపూర్ గ్రామంలో సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రామసభలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి సీఐ జగదీష్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన వారు ఎవరైనా సరే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. ఆన్లైన్లో జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్త వహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామానికి చెందిన యువత మద్యానికి బానిస కాకుండా నిర్దేశిత లక్ష్యంతో ఉన్నత చదువులు అధిరోహించి లక్ష సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులతోపాటు ఎస్సై విజయేందర్ పాల్గొన్నారు.

గొల్లపల్లి విద్యార్థిని అత్యున్నత ప్రతిభకు మెమెంటో, ప్రశంసాపత్రం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకుని 10జీపీఏ సాధించి, అత్యున్నత ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాచర్ల గొల్లపల్లి విద్యార్థిని గుర్రాల స్ఫూర్తిని గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సిరిసిల్లలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మెమెంటో, ప్రశంసా పత్రాన్ని ప్రజాప్రతనిధులు, అధికారులు అందించారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ అధ్యక్షురాలు పిల్లి రేణుక, జిల్లా విద్యాధికారి ఎ. రమేష్ చేతులమీదుగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా తెలంగాణ విద్యా దినోత్సవం రోజున అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దూస రఘుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సర్పంచ్ పాశం సరోజన దేవరెడ్డి, ఏఎంసి చైర్మన్ కొండ రమేష్‌గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు జబ్బార్, ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య, ఎస్ఎంసి చైర్మన్ గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గం, ఎస్ఎంసి సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గుర్రాల స్ఫూర్తిని అభినందించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో లయన్స్ విజన్ సెంటర్/ సవేరా ఆప్టికల్స్‌లో విజన్ కేర్ ఉపాధ్యక్షులు, అఫ్తాల్మిక్ అధికారి లయన్స్ అబ్దుల్ వాసే సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామని అధ్యక్షులు మదర్ ఖాన్ తెలిపారు. ఈ శిబిరంలో 112మందికి పరీక్షలు నిర్వహించగా 16మందికి కంటిలో శుక్లాలు ఉన్నాయని, వారికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ ఛార్టర్డ్ గవర్నర్ చిదుర సురేష్ సహకారంతో లయన్స్ కంటి ఆసుపత్రి రేకుర్తిలో జూన్ రెండో వారంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఛార్టర్డ్ అధ్యక్షులు, క్లబ్ పరిపాలనాధికారి పూదరి దత్తాగౌడ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బుద్దార్తి సతీష్ కుమార్, కోశాధికారి భూతగడ్డ చందు పాల్గొన్నారు.

గుండారం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి అవమానం

గ్రామపంచాయతీ కార్మికులతో బీఆర్ఎస్ పార్టీ జెండాలు కట్టిస్తున్న పాలకులు


అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను పెడుతున్న పంచాయతీ కార్మికులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలోని గుండారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ జెండాలు కట్టి అవమానించారు. అంబేద్కర్ విగ్రహానికే పార్టీ జెండాలు కట్టడమే కాకుండా గ్రామంలోని పలుచోట్ల పంచాయతీ కార్మికులతో జెండాలను కట్టించడంపై గ్రామ ప్రజలు గురువారం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ గ్రామ సిబ్బందితో చెప్పి అంబేద్కర్ విగ్రహానికి చుట్టూ బీఆర్ఎస్ జెండాలను కట్టించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సిబ్బందిని ఎవ్వరు కట్టారని అని అడుగగా సర్పంచ్ శంకర్ నాయక్ కట్టమని చెప్పారని పంచాయతీ సిబ్బంది తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఒక పార్టీ జెండాలు కట్టి అవమానించారన్నారు. తక్షణమే జెండాలు తొలగించాలని గుండారం ప్రజాప్రతినిధులు బానోత్ రాజునాయక్, సూడిది రాజేందర్, మూన్ సింగ్ రాథోడ్, తిరుపతినాయక్, శ్రీను రాథోడ్‌లు డిమాండ్ చేశారు.

బస్సు ప్రమాద బాధితులను పరామర్శ


పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండలంలోని వల్లంపట్ల గ్రామ శివారులో బుధవారం బోల్తా పడిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. వారిని గురువారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు ఆనంద్‌లు పరామర్శించి ఆదుకుంటామని భరోసానిచ్చారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మారంలో తాటి, ఈత వనం దగ్ధం



నవతెలంగాణ - కొనరావుపేట : మండలంలోని ధర్మారం గ్రామంలో ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రమా దవశాత్తు తాటి, ఈత వనం దగ్ధమైంది. బుధవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన గీత కార్మికులు మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. సుమారు 40తాటి, 20ఈత చెట్లు పూర్తిగా కాలిపోగా రూ.5లక్షల నష్టం వాటిల్లినట్టు గీత కార్మికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్సై రమాకాంత్‌లు పరిశీలించారు.

నిరుపయోగంగా మరిమడ్ల గ్రామ బస్టాండ్


మరిమడ్లలో నిరుపయోగంగా ఉన్న బస్‌స్టాప్

నవతెలంగాణ - కొనరావుపేట : మండలం మరిమడ్లలో ఉన్న ప్రయాణ ప్రాంగణంలో బస్సులు ఆగకపోవడంతో నిరుపయోగంగా మారింది. మరిమడ్ల నుంచి సిరిసిల్ల, సిరికొండ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, వాహనాలు అమరవీరుల స్తూపం వద్దనే నిలుపుతున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి నీడ సౌకర్యం లేక ఎండాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుకాణాల వద్ద చెట్ల నీడలో వేచి ఉంటున్నారు.

తంజావూర్‌లో రాఘవపూర్ కళాకారుల ప్రదర్శన



నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి జిల్లా మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారులు తమిళనాడులోని తంజావూర్ లో ఒగ్గు డోలు ప్రదర్శనకు తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, తంజావూర్ ఆధ్వర్యంలో సమ్మర్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించే కల్చరల్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి పెద్దపల్లి జిల్లా ఒగ్గు కళాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా 5రోజుల పాటు నిర్వహించే కల్చరల్ కార్యక్రమలో ఒగ్గు కళ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా రాఘవ పూర్ కళాకారులు ప్రదర్శన పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రదర్శనకు వెళ్లిన వారిలో కుంట సదయ్య, కుంట రాజ్ కుమార్, కుంట రమేష్, కుంట సదయ్య, జంగిలి దిలీప్ లతో 15మంది కళాకారులు వెళ్ళారు.

ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం : ఎస్సై రమాకాంత్

నవతెలంగాణ - కొనరావుపేట : ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని కొనరావుపేట ఎస్సై రమాకాంత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొండాపూర్ గ్రామంలో బుధవారం పోలీస్ మీకోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తే వారిపై కఠిన చర్య తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్యాల దేవయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఐఐటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ - జూలపల్లి(ఎలిగేడు) : ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామంలో రేవెల్లి రాజయ్య కొడుకు తరుణ్ ఆల్ ఇండియా ఐఐటీ ర్యాంక్ ఎస్టీ కేటగిరీలో 126వ ర్యాంక్, ఓపెన్ క్యాటగిరిలో 13338వ ర్యాంకు సాధించిన సాధించాడు. ఆ విద్యార్థిని దూళికట్ట గ్రామ కూడలి వద్ద బుధవారం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో సన్మానించారు. దాసరి ఉష దారి ఖర్చులకు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పి జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి బాబు, నియోజకవర్గం కోశాధికారి ఎండీ రియాజ్, ఎలిగేడు మండల అధ్యక్షులు మారం సతీష్ యాదవ్, ఉపాధ్యక్షులు నాగేష్, మండల కమిటి సభ్యులు అల్లి రమేష్, ప్రవీణ్, బివిఎఫ్ టీం మచ్చ రాహుల్, ఇరుగురల్ల సాగర్, బొడ్డు విష్ణు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'మేరీ మీడియా ట్రిక్స్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి'


కార్యాలయానికి వినతిపత్రం అందజేస్తున్న వృకాస జిల్లా కార్యదర్శి గణేష్

నవతెలంగాణ - మంథని : మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని మేరీ మీడియా ట్రిక్స్ పాఠశాల యజమాన్యం బుక్ స్టాల్ యజమానితో కుమ్మక్కై స్కూల్ ఎదురుగా పుస్తకాల దుకాణం తెరిచి బహిరంగంగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అన్నారు. విద్యార్థులకు బలవంతంగా పుస్తకాలు, నోట్ బుక్స్ అంటగడుతూ విద్యార్థుల నుండి అధిక రేట్లు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ప్రజా సంఘాల నాయకులు మంథని మండల విద్యాధికారికి ఫిర్యాదు చేయడానికి మండల విద్యాధికారి కార్యాయాలనికి వెళ్లగా కార్యాలయ సిబ్బంది ఎవరు అందుబాటులో లేరని తెలిపారు. దీంతో ప్రజా సంఘాల నాయకులు గేటుకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఇప్పటికైనా మండల విద్యాధికారి పాఠశాలను తనిఖీ చేసి పుస్తకాల దుకాణాన్ని సీజ్ చేసి స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకొని పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కదారి సతీష్ ఉన్నారు.

నవోదయలో సీటు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-జూలపల్లి : మండల కేంద్రానికి చెందిన న్యూ బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థి ఇపాత్ ఆరో తరగతిలో నవోదయ కేంద్రీయ విద్యాలయంలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల అధ్యాపక బృందం, ఎంఈఓ కవిత అభినందించారు. కుంద అశ్వత్ సాయి నాగులపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి కేంద్రీయ విద్యాలయం నవోదయలో సీటు రావడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. యాజమాన్యం కొండ సత్యం, గోనె పరశురాములు, ఉపాధ్యాయులు సతీష్, వర ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



హిమోగ్లోబిన్ తగ్గితే...

వయసుతో సంబంధం లేకుండా హిమోగ్లోబిన్ సమస్య ప్రతిఒక్కరిలోనూ వస్తూ ఉంటుంది. దానిని నిర్లక్ష్యం చేస్తే శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే ఈ సమస్యను గుర్తించిన వెంటనే తీసుకునే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే త్వరగా బయటపడవచ్చు. అవేంటంటే...

పుచ్చకాయ : ఈ పండులో అత్యధిక స్థాయిలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్, పొటాషియం, విటమిన్ - సి, బి ఉంటాయి. ఆహారంలో ఐరన్ ఎక్కువగా ఉన్నప్పుడు శరీరంలో శక్తి, ఓపిక పెరుగుతాయి.

బెర్రీస్ : స్ట్రా బెర్రీల్లో కొన్ని రకాల్లో అత్యధికంగా ఐరన్ వుంటుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్, ఎ, ఇ విటమిన్లు వుంటాయి.

పండ్లు - కూరగాయలు : బీట్రూట్, ఆరెంజ్, క్యారెట్ జ్యూస్ బ్రేక్ ఫాస్ట్‌కి ముందు తాగితే హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి.

ఖర్జూరం : ఖర్జూరాలలో ఆరోగ్యానికి ఉపకరించే పోషకాలు అత్యధికంగా ఉంటాయి. వీటిలో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియంలు హిమోగ్లోబిన్‌ను పెంచుతాయి.

మాంసం : మాంసాహారులైతే మటన్ తింటే మంచిగా హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. గుడ్లు కూడా తీసుకోవచ్చు.

చర్మ సంరక్షణకు ఇవి అవసరం...



వయసు మీదపడేకొద్దీ ముఖంలో మార్పులు రావడం సహజం. ముఖ్యంగా ఈ సమస్యను మహిళలు ఎక్కువగా ఎదుర్కొంటుంటారు. 35 ఏండ్లు దాటగానే ముఖ చర్మంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయి. ముఖంపై ముడతలు కనిపించడం, చర్మం వదులు కావడం, నిగారింపు తగ్గిపోవడం, నల్లగా మారిపోవడం లాంటివి కనిపిస్తుంటాయి. ఈ సమస్యలు వేసవి కాలంలో ఎక్కువగా ఉంటాయి. చలికాలంలో ముఖం పొడిబారిపోయినట్టుగా ఉంటుంది. వీటి నుంచి పరిష్కారం పొందాలంటే చిన్నపాటి ఆరోగ్య సూత్రాలను పాటిస్తే చాలంటున్నారు బ్యూటీషియన్లు.

- వాతావరణంతో ఎలాంటి సంబంధం లేకుండా గోరువెచ్చటి నీటితో స్నానం చేయటం ఉత్తమమని చెపుతున్నారు. అలా కాకుండా మరీ వేడి నీటితో స్నానం చేస్తే చర్మం త్వరగా సాగిపోయి ముడతలు పడే అకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు.
- ప్రతి రోజూ మజ్జిగలో కాస్తంత జీలకర్ర వేసి రోజుకు రెండు సార్లు తీసుకుంటే చర్మానికి మేలు చేస్తుందని చెపుతున్నారు. మంచినీటిలో వట్టివేర్లను వేసుకుని తాగాలి. ఈ నీరు శరీరానికే కాకుండా చర్మానికి కూడా మంచిదేనంటున్నారు. వీటితో పాటు.. బార్లీ, ఓట్స్‌లు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచి జరుగుతుందన్నారు.
- సజ్జ రొట్టెలు, రాగిజావలను వారానికి కనీసం నాలుగు సార్లు, అలాగే సొరకాయ, బీర, పొట్లకాయ, గుమ్మడి, కీరదోస.. లాంటి కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మానికి ఎంతగానో తోడ్పడతాయని చెపుతున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ నిద్రను నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు.

వజ్ర సంకల్ప వరలక్ష్మి

విజయం ఏ ఒక్కరి సొత్తూ కాదు. అలా అని అది సాధించడం అంత సులువైన పనీ కాదు. విజయం మన దరి చేరాలంటే కష్టపడాల్సిందే. అలా కష్టపడుతూ స్వశక్తిని నమ్ముకొని అంచలంచలుగా ఎదిగిన మహిళా మణులు ఎందరో మన జీవనయానంలో తారసపడుతుంటారు. అలాంటి వారిలో వరలక్ష్మి ఒకరు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, అనేక ఆకృతులతో తినుబండారాలు తయారు చేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా, ప్రెజర్వేటివ్స్ లేకుండా అంజీర్ పండ్లతో జామ్, చిప్స్‌తో పాటు అనేక రకాల పొడులు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. అంతే కాకుండా పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఫ్రూట్ ఫుల్ అనే ఆహార ఉత్పత్తుల సంస్థను స్థాపించి ప్రగతి పథంలో దూసుకెళుతున్నారు. ఆ విశేషాలేంటో మనమూ తెలుసుకుందాం....



నారాయణపేట జిల్లా, మాగ్నూర్ మండలంలో గుడేబల్లూరు గ్రామంలో భవాని, దుర్గారాజు దంపతులకు జన్మించారు వరలక్ష్మి. ఆమెకు ఓ తమ్ముడు. దుర్గారాజు తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. స్వగ్రామంలోనే వరలక్ష్మి పదో తరగతి పూర్తి చేశారు. పై చదువులకు ఇంట్లో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అక్కడితో చదువు మానేశారు. తర్వాత ముదునూరి శంకర్‌వర్మతో 2009లో ఆమె వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు. మొదట్లో శంకర్ జిరాక్స్ మిషనరీస్, సేల్స్, సర్వీస్ లాంటి వ్యాపారం చేశారు. పెద్దగా లాభాలు రాకపోగా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి.

వ్యవసాయం చేయాలని...

చిన్నతనం నుండి పల్లెటూరిలో పచ్చని పంటల నడుమ పెరిగిన వరలక్ష్మికి వ్యవసాయం చేయాలనే ఆలోచన వచ్చింది. ఇదే విషయాన్ని భర్తతో పంచుకుంది. అతనికి కూడా వ్యవసాయం అంటే మక్కువ. దాంతో 2013లో శంషాబాద్ దగ్గరలో బొప్పడి తోట సాగు ప్రారంభించారు. ఎనిమిది నెలల్లో పంట చేతికొచ్చింది. అందులో లాభాలు బాగానే వచ్చాయి. కానీ బొప్పడి పంట అయిపోయిన తర్వాత ఆ భూముల్లో చాలాకాలం వరకు మళ్ళీ అదే పంట పండించడానికి వీలుండదు. ఎందుకంటే ఆ భూమిలో వైరస్ ఎక్కువ. దాంతో కూరగాయల మొక్కలు వేశారు. మూడు నెలలకు పంట చేతికొచ్చింది. కానీ వాటిని మార్కెట్‌కు తరలించడానికి రవాణా చార్జీలు ఎక్కువయ్యాయి. అప్పు చేసి తీసుకెళ్ళినా గిట్టుబాటు ధర లేక చాలా నష్టాలు వచ్చాయి. అందుకే కూరగాయల పంట ఆపేసి ఇంకా ఏదైనా చేయాలని ఆలోచిస్తుండగా అంజీర గుర్తొచ్చింది.

ఏడాది పొడవునా...

అంజీర తోటకు సంబంధించిన వివరాలు సేకరించారు. చెట్టు 30 ఏండ్ల వరకు ఉంటుందని, రెండేండ్లకు ఒకసారి మొక్కను కట్ చేస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే 360 రోజులు అంజీర పండ్లు వస్తాయని తెలిసింది. అంజీరలో మొత్తం 660 రకాలు ఉంటాయి. భారతదేశంలో 34 రకాలు పండుతాయి. ముఖ్యంగా మూడు రకాల అంజీరాలలో ఒకటి టర్కీ రకం. రెండవది దయానో, మరొకటి పూనేరకం, దీన్ని బళ్లారి వెరైటీ అని కూడా అంటారు. ఇవి ఎక్కువగా కర్ణాటక రాష్ట్రం బళ్ళారిలో పండుతాయని తెలుసుకొని వరలక్ష్మి బళ్లారి వెళ్లి అక్కడి ఫామ్స్‌ను పరిశీలించి వచ్చారు. నారాయణపేటలో 12 ఎకరాల భూమిని లీజుకు తీసుకొని బళ్లారి నుండి తెచ్చిన అంజీర మొక్కలు నాటారు.

పిల్లలు ఇష్టంగా తిన్నారు

2018లో మొక్కలు నాటితే ఆరు నెలల తర్వాత కాపు చేతికొచ్చింది. మొదట్లో 30 నుండి 40 కేజీలు పండేవి. వీటిని మార్కెట్‌కు తీసుకుపోవటానికి ఖర్చు చాలా అయ్యింది. దాంతో పెద్దగా లాభాలు రాక పెట్టిన పెట్టుబడి కూడా చూడకపోయారు. దాంతో మార్కెట్‌కి పోకుండానే అంజీర పండ్లతో ఇంకా ఏమైనా చేయగలమా అనే ఆలోచలో పడ్డారు. ఒకరోజు బాగా పండిన అంజీర పండ్లను తెచ్చి ఇంట్లోనే ఒక స్వీట్ తయారు చేశారు. పిల్లలు చాలా ఇష్టంగా తినడంతో ఇలాంటి ఆరోగ్యకరమైన ఆహారం అందరికీ అందివ్వాలనే నిర్ణయానికి వచ్చారు. అప్పటి వరకు వరలక్ష్మికి అంజీర ప్రాముఖ్యం పెద్దగా తెలీదు. ఆమె పిల్లలు కూడా నేరుగా పండును తినడానికి ఇష్టపడలేదు. కానీ ఏడాది తర్వాత నెలకు 50,000 సంపాదించడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆమె పండిస్తున్న అత్తిపండ్లకు మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉంది. ఈ పండ్లతో జామ్‌లు, ఎండు అంజీర చిప్స్, రోల్స్‌తో పాటు ఆకులతో టీ పొడిని కూడా తయారు చేస్తున్నారు.

కలెక్టర్ సహకారంతో...

తన జిల్లాలోని ఓ మహిళా రైతు కుటుంబంతో కలిసి అంజీర పండిస్తున్నారని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దాసరి హరిచంద్ర ఆమె గురించి ఆరా తీశారు. అది ఆమె జీవితాన్నే మార్చేసింది. ఇప్పుడు ఆమె 'ఫ్రూట్ ఫుల్ ప్రోడక్ట్' పేరుతో మార్కెట్లో మంచి పేరు తెచ్చుకుంటుంది. లైసెన్సింగ్ ప్యాకేజింగ్, మార్కెటింగ్‌లో సహాయపడడానికి వి హబ్ అనే సంస్థ ఉందని ఆమెకు కలెక్టర్ ద్వారా తెలిసింది. ఆయనే స్వయంగా హైదరాబాద్‌లోని వి హబ్ వారితో మాట్లాడి వారి దగ్గరికి పంపించారు వరలక్ష్మిని. 2019లో ఆమె తమ ఉత్పత్తులను కేవలం సన్నిహితులు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మాత్రమే విక్రయించేవారు. ఇప్పుడు అవి వి హబ్ సహకారంతో క్యూమార్ట్ అమెజాన్‌లో కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మూడు రకాల జాములతో పాటు, అంజీర్ పౌడర్, చిప్స్ మార్కెటింగ్ చేస్తున్నారు.





మొదట్లో అవహేళన చేశారు

వ్యవసాయం చేస్తుందని మొదట్లో కొందరు వరలక్ష్మిని అవహేళన చేశారు. అవేమీ ఆమె పట్టించుకోలేదు. 2020లో వర్మ ఫామ్స్ ప్రారంభించారు. అయితే నారాయణపేట నుండి ఉత్పత్తులను హైదరాబాద్ తీసుకురావడం ఆర్థిక భారంగా మారింది. దాంతో వి హబ్ వారు హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో కొంత స్థలం ఇచ్చారు. దాంతో హైదరాబాదులోనే కొన్ని ఉత్పత్తులు తయారుచేసి ఎగ్జిబిషన్లు పెట్టి లాభాలు పొందుతున్నారు. ఇంకా ఎక్కువ ప్రోడక్ట్ తయారు చేయడానికి నారాయణపేట జిల్లాలో సెమీ ఆటోమేటిక్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మించాలని వరలక్ష్మి యోచిస్తున్నారు. అంతేకాకుండా మరో రెండేండ్లలో ఫ్రూట్ ఫుల్ బ్రాండ్ ప్రజలందరికీ చేరాలనే లక్ష్యం పెట్టుకున్నారు. పురుషాధిక్యత రాజ్యమేలుతున్న సమాజం మనది. అలాంటి చోట ఒక మధ్యతరగతి మహిళ వ్యాపారవేత్తగా ఎదుగుతున్నారు. ఎన్నో ఆటుపోట్లను, ఆర్థిక ఇబ్బందులను, పోటీ తత్వాన్ని అధిగమిస్తూ, వెలుగుదారులు పరుచుకుంటూ ముందుకు పయనిస్తున్నారు. ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయనిగా నిలిచారు.

- డా.తాళ్ళపల్లి యాకమ్మ, 9704226681



మోసపోతే గోసపడ్తం

(మొదటిపేజీ తరువాయి)



నెంబర్ వన్ స్థానంలో ఉన్నాం. ప్రగతి పథంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా ఉంది' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరులో నిర్మించిన 1660 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. అనంతరం పటాన్‌చెరులో రూ.200 కోట్లతో నిర్మించనున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో పదెకరాల భూమి వచ్చేదని, ఇప్పుడు తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఆంధ్రాలో పదెకరాలు వస్తుందని మాజీ సీఎం చంద్రబాబునాయుడు అన్నాడని గుర్తు చేశారు. ప్రశాంతమైన జీవన విధానం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందన్నారు. అమరుల త్యాగ ఫలం చాలా గొప్పదని, వారి ఆకాంక్షలు నెరవేర్చడమే నిజమైన నివాళి అని అన్నారు. రాష్ట్ర మంత్రిగా పనిచేసినప్పుడు పటాన్‌చెరు నియోజకవర్గంలో గల్లి గల్లీలో పాదయాత్ర చేశానని గుర్తు చేశారు. పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరులో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవల్ని అందించే లక్ష్యంతో రూ.200 కోట్ల వ్యయంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకోవాలని సూచించారు. హరీశ్‌రావు హయాంలో వైద్యరంగం బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాల రీత్యా హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో లైన్ విస్తరించాల్సిన అవసరముందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి మంత్రిమండలి సమావేశంలోనే పటాన్‌చెరు వరకు మెట్రోలైన్ విస్తరణ పనుల మంజూరుకు సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అనేకసార్లు కలిసి విన్నవించారని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ కార్యాలయం, మూడు మున్సిపాలిటీలు, రెండు మండలాలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కొల్లూరు ప్రాంతంలో ఐటీ పార్కు పెట్టేందుకు మంత్రి కేటీఆర్‌ను పంపిస్తానని, దారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల అవసరాలు పెరిగినందున వివిధ అభివృద్ధి పనుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన మూడు మున్సిపాలిటీలకు ఒక్కోదానికి రూ.30 కోట్ల చొప్పున, మూడు కార్పొరేషన్ డివిజన్లకుగాను ఒక్కోదానికి రూ.10 కోట్లు, నియోజకవర్గంలో ఉన్న 55 గ్రామ పంచాయతీలకు గాను ఒక్కోదానికి రూ.15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదే విధంగా రెవెన్యూ డివిజన్‌తో పాటు పాలిటెక్నిక్ కళాశాలను, రామసముద్రం చెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది' అన్నట్టుగా రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇవ్వడం వల్ల పటాన్‌చెరు ప్రాంతంలో మూడు షిఫ్టుల్లో పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. కార్మికులకు పని లభించడం వల్ల ఆదాయం కూడా పెరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో పటాన్‌చెరు ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు కరెంట్ కోతల వల్ల నడిచేవి కావని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలో నెంబర్ వన్‌గా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు రాజీవ్ శర్మ ఎంపీలు బీబీపాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాములు, జెడ్పీ ఛైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మాణిక్యరావు, చంటిక్రాంతికిరణ్, ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి, రాష్ట్ర వైద్య సేవల, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మహిళా కమిషన్ చైర్మెన్ సునీతాలక్ష్మారెడ్డి, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింత ప్రభాకర్, గిడ్డంగుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ సాయిచంద్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం పాల్గొన్నారు.

అమర వీరుల స్మారకంలోనూ బీఆర్ఎస్ అవినీతి

(మొదటిపేజీ తరువాయి)

లోపాలు ఉన్నాయని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమరవీరుల స్మారక నిర్మాణ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. అంచనా వ్యయాన్ని ఇష్టానుసారంగా పెంచారని తెలిపారు. అందులో మంత్రి కేటీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అమరుల స్మారకం చూడగానే వారి పోరాటాలు, త్యాగాలను గుర్తుకురావాలన్నారు. కానీ అమరుల త్యాగాలను రాజకీయ స్వార్థానికి సీఎం కేసీఆర్ ఉపయోగించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుంట్ల చరిత్రనే తెలంగాణ చరిత్ర అన్నట్టు వ్యవహరిస్తున్నారనీ, అమరుల బలిదానాల ను కేసీఆర్ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమంలో 1,569 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. త్యాగాలు చేసిన వారిని అవమానించేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తున్నదని తెలిపారు. అమరవీరుల స్థూపం నిర్మాణానికి సంబంధించి 2017, జూన్ 17న ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. డిజైన్, అంచనాల కోసం, పనులను పరిశీలించేందుకు ఆరు శాతం ఫీజు చెల్లించాలని నిర్ణయించారని తెలిపారు. 2018, జూన్ 28న నిర్మాణం కోసం రూ. 64 కోట్ల వ్యయంతో టెండర్ ప్రకటన చేశారని వివరించారు. ఒకే కంపెనీ మూడు డమ్మీ టెండర్లు వేసిందని పేర్కొన్నారు. కేసీ పుల్లయ్య కంపెనీ టెండరు దక్కించుకుందనీ, ఆ కంపెనీ కేటీఆర్‌తో కలిసిన తర్వాత కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌గా మారిందన్నారు. ఆ కంపెనీ ప్రొద్దుటూరు, కడప జిల్లాకు చెందిన వ్యక్తులదనీ, కేపీసీ కంపెనీ అడ్రెస్ విజయవాడకు మారిందన్నారు. కేపీసీ ప్రాజెక్ట్స్ అనిల్ కుమార్ కామిశెట్టితో వ్యూహాత్మకంగా తేలుకుంట్ల శ్రీధర్ కేటీఆర్‌కు మేలు జరిగేలా చేశారన్నారు. దీంతో నిర్మాణ అంచనా వ్యయం రూ. 127 కోట్ల నుంచి అంచెలంచెలుగా రూ. 179 కోట్లకు పెరిగిందన్నారు. ఇంత ఖర్చు చేసి కట్టిన స్మారకంలో కేవలం అమరవీరులకు జోహార్లు అని మాత్రమే రాసి సరిపెట్టడం సరికాదని రేవంత్ అన్నారు. శిలాఫలకంపై అమరుల పేర్లు పెట్టనప్పుడు రాష్ట్రంలో శిలాఫలకాలపై సీఎం కేసీఆర్ పేరు ఎందుకు పెట్టాలి అని ప్రశ్నించారు. చరిత్రను మలినం చేసేందుకే కేసీఆర్ కుట్ర చేస్తున్నారనీ, దీన్ని తెలంగాణ సమాజం గ్రహించాలన్నారు. వందలాది మంది వీరుల త్యాగాలను కేసీఆర్ కాలగర్భంలో కలిపేశారన్నారు. శ్రీకాంతాచారి, ఇషాన్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య... వందలాది మంది అమరులు గుర్తొచ్చేలా ఉండాలన్నారు. పవిత్రమైన అమరుల స్మారకాన్ని ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఇచ్చి అపవిత్రం చేశారని విమర్శించారు. పది ఎకరాల్లో నిర్మించిన ప్రగతి భవన్ పనులను తొమ్మిది నెలల్లోనే పూర్తి చేస్తే.... అమరవీరుల స్థూపాన్ని నిర్మించడానికి తొమ్మిదేండ్లు పడుతుందా...? అని అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది చనిపోయారని తాము ఎక్కడా చెప్పలేదంటూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆ నెంబర్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదా? అని ప్రశ్నించారు. తొలి, మలి ఉద్యమాల్లో 1569 మంది అమరులయ్యారని కేసీఆర్ నిండు సభలో (2014, జూన్ 14న) చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు ప్రభుత్వ తీర్మానాన్ని అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 1,569 మంది అమరుల పేర్లు శిలాశాసనంలో పొందుపరుస్తామనీ, ఆ వివరాలు చదివాకే అమరుల స్మారక స్థూపం దగ్గరికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని వ్యాఖ్యానించారు. హజ్ యాత్రికులను పంపడానికి వెళుతున్న షబ్బీర్ అలీని గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ కేఏ పాల్ లాగే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటలను అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదని చెప్పారు.

పోడు రైతులకు పట్టాలివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇస్తామని, అవి ప్రింట్ అయ్యాయని రేపో మాపో అందిస్తామని ఒకపక్క చెబుతుంటే.., మరోపక్క పోడు సాగును అటవీ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. అటవీ భూముల విషయంలో అక్కడి అధికారుల, స్థానికుల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. తెలంగాణలో పోడు భూముల సమస్య అనేది ఇప్పటిది కాదని ఎన్నో సంవత్సరాల నుంచి నలుగుతోందన్నారు. ప్రతిసారీ ఎన్నికలప్పుడు ఇది రాజకీయ అస్త్రంగా మారుతోందని, అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాబట్టి పోడు భూముల్లో కందకాలు తవ్వినా, ప్లాంటేషన్ వేస్తామని అటవీ శాఖ అధికారులు వచ్చినా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సాగుచేసుకుంటున్న అందరికీ హక్కులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పితే ఊరుకోమన్నారు. సాగుచేసుకుంటున్న అటవీహక్కుల చట్టం ప్రకారం వారందరికీ పట్టాలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న, మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, దుబ్బా గోవర్ధన్, కత్తి వెంకటేశ్వర్లు, దడిగల వెంకన్న, నట్టి శంకరయ్య, పాండురంగాపురం సర్పంచ్ ఈసం భవతి, గిరిజనులు, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



పత్రికా స్వేచ్ఛపై మోడీతో చర్చించండి

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్ మాట్లాడుతూ భారత్‌లో పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛకు ఎదురవుతున్న సవాళ్ల తమకు తెలుసునని, అయితే వాటిపై తాము ఉపన్యాసాలు ఇవ్వదలచుకోలేదని చెప్పారు. భారత్‌లో పత్రికా స్వేచ్ఛ ఆందోళనకరమైన స్థాయిలో దాడికి గురవుతోందని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఐపీఐ తెలిపింది. ఈ సమస్య పరిష్కారానికి స్వదేశంలోనూ, విదేశాలలోనూ కృషి చేయాలని బైడెన్‌ను కోరింది. భారత భద్రతా చట్టాలను ఉల్లంఘించారన్న ఆరోపణపై ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న ఆరుగురు పాత్రికేయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ సంస్థ పత్రికలలో ప్రకటనల రూపంలో సమాజం దృష్టికి తెచ్చింది.

ఎన్నో అవరోధాలు

గత సంవత్సరంలో భారత్‌లో పత్రికా స్వేచ్ఛకు సంబంధించి 200 బెదిరింపులు లేదా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని ఐపీఐ గుర్తు చేసింది. 'వేధింపులు, ఆన్‌లైన్‌లో విద్వేష పూరిత ప్రసంగాలు, భౌతిక దాడులు, బీజేపీని విమర్శించే పాత్రికేయుల నిర్బంధాలు వంటి ఘటనలు జరిగాయి. 2019లో మోడీ ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి హోదా రద్దు చేసినప్పుడు ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలలో కార్యకలాపాలు సాగిస్తున్న స్వతంత్ర మీడియాపై ఉక్కుపాదం మోపారు. అప్పటి నుండి ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. కాశ్మీర్ పాత్రికేయుల పర్యటనలపై ఆంక్షలు విధించారు. దాడులు, నిఘాలు, విచారణలు నిత్యకృత్యమైపోయాయి. పాత్రికేయుల విధులకు ఆటకం కలిగించేందుకు అనేక చట్టాలను ప్రయోగించారు. రాజద్రోహ చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ దానిని మళ్లీ తీసుకురావాలని, దాని పరిధిని విస్తరించాలని ఇటీవలే లా కమిషన్ సిఫార్సు చేసింది. దీనివల్ల దేశంలో అసమ్మతిని అణచివేయడం మరింత సులభమవుతుంది' అని ఐపీఐ వివరించింది. 'ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా పేరు గాంచిన భారత్‌లో పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాత్రికేయులపై దాడులు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి మంచిది కావు. ఇలాంటి విషయాలన్నింటినీ మోడీ దృష్టికి తీసికెళ్లాల్సిన అవసరం ఉంది. భారత ప్రధాని పర్యటనను ఇందుకోసం వినియోగించుకోవాలి. భారత పాత్రికేయులు స్వతంత్రంగా, స్వేచ్ఛగా తమ విధులు నిర్వర్తించుకునేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని మోడీని డిమాండ్ చేయాలి' అని ఐపీఐ తెలిపింది.

చీకట్లోకి భారతం..

(మొదటిపేజీ తరువాయి)



తనదైన అర్థాన్ని చెప్పింది.

శిక్ష పెంపుపై మౌనమే సమాధానం

రాజద్రోహ చట్టంపై కొంతకాలంగా దేశంలో జరుగుతున్న చర్చలను లా కమిషన్ ఏ మాత్రం పట్టించుకోలేదు. అంతేకాక వివాదాస్పద మార్పులపై సమాంతరంగా వాదనలు లేవనెత్తింది. రాజద్రోహ చట్టాన్ని మరింత విస్తృతంగా అర్థం చేసుకుంటే అది రాజ్యాంగ పరీక్షకు నిలవబోదంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యను కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. హింసను ప్రేరేపించే ఉద్దేశం ఉన్నా, ప్రజల అసమ్మతికి ఊతమిచ్చినా ఆ పనులకు విధించే శిక్షను పెంచాలని సూచించింది. నేరాన్ని నిరూపించే బాధ్యత నుంచి ప్రభుత్వాన్ని తప్పించింది. సెక్షన్ 124-ఏలో నిర్వచించిన శిక్షలోని ప్రత్యేకతలను ప్రస్తావిస్తూ ఐదవ లా కమిషన్ నివేదికను ఉదహరించింది. రాజద్రోహ నేరానికి పాల్పడితే జీవిత ఖైదు విధించవచ్చునని, లేదా మూడేండ్ల జైలు శిక్షతో సరిపెట్టవచ్చునని ఆ నివేదిక సూచించింది. అయితే తాజా సిఫారసు ప్రకారం జీవిత ఖైదు విధించవచ్చు. లేదా ఏడు సంవత్సరాల వరకూ జైలు శిక్ష విధించవచ్చు. అయితే శిక్షను మూడు నుంచి ఐదు సంవత్సరాలకు ఎందుకు పెంచాల్సి వచ్చిందో వివరించలేదు. లా కమిషన్ సిఫారసులు సుప్రీంకోర్టు ఇచ్చిన ఇతర తీర్పులకు అనుగుణంగా లేవు. వలసవాదుల పాలన నాటి 'విధేయత' సిద్ధాంతం కొనసాగింపే రాజద్రోహ చట్టం ఉద్దేశం. లా కమిషన్‌కు మాత్రం ఇదేమీ పట్టడం లేదు.

మౌనంగా..దూరంగా...

(మొదటిపేజీ తరువాయి)

హంగూఆర్భాటం ప్రదర్శించే ఈటల రాజేందర్ కొంత కాలంగా గుంభనంగా ఉంటున్నారు. తెలంగాణలో ఈటలకు ప్రచార కమిటీ చైర్మెన్‌గా బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం పెద్దఎత్తున జరగ్గా...బండి గ్రూపులోని నేతలంతా ఒక్కటై జితేందర్‌రెడ్డి ఇంట్లో ఈటలకు వ్యతిరేకంగా భేటీ అయిన విషయం తెసిందే. ప్రచార కమిటీ చైర్మెన్ పదవే లేదంటూ పెదవి విరిస్తూ ఖండించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో అధిష్టానం జోక్యం చేసుకుని పదవుల విషయంపై ఎవ్వరూ మాట్లాడొద్దని అల్టిమేటం జారీ చేసింది. అప్పటి నుంచి కినుక వహించిన ఈటల బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అడుగు కూడా పెట్టడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా మాట్లాడటం లేదు. స్వతంత్ర సంస్థలు, దుబాయి బాధితుల సంఘం పెట్టిన సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నారు. పొలిటికల్‌గా ఎక్కడా నోరెత్తడం లేదు. బండి చాలెంజ్‌గా తీసుకుని మరీ 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం ద్వారా అన్ని నియోజకవర్గాల్లో ప్రజలకు మోడీ తొమ్మిదేండ్ల పాలన గురించి వివరించాలని పిలుపునిచ్చారు. కానీ, గురువారం ఆ కార్యక్రమానికి ఈటల దూరంగా ఉన్నారు. 'ఈటల పార్టీలో ఎన్నికల దాకా ఉంటాడా? కాంగ్రెస్ పార్టీలోకి పోతాడా?' అన్న చర్చ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే జరుగుతున్నది. మరోవైపు ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరితే.. డిప్యూటీ సీఎంతో పాటు కోరిన పోర్ట్‌ఫోలియో కేటాయించేందుకు ఆ పార్టీ అధిష్టానం సుముఖంగా ఉన్నట్టు కూడా ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆయన కాంగ్రెస్ వైపు వెళ్తే బాగుంటుందనే ఆలోచనలో పడ్డట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, బీజేపీ పట్ల రాజగోపాల్‌రెడ్డి కూడా అనాసక్తి చూపుతున్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఎక్కడా పాల్గొనలేదు. ఇప్పటికే తన అనుచరుల వద్ద త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్టు స్పష్టం చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అందులో భాగంగానే బుధవారం సాయంత్రం తన తమ్ముడు రాజగోపాల్‌రెడ్డితో వెంకట్‌రెడ్డి సుదీర్ఘంగా సమావేశం అయ్యారు. ఎన్నికల సమయంలో హడావిడిగా పార్టీ మారితే కార్యకర్తలు, ప్రజలు అంత త్వరగా రిసీవ్ చేసుకోరనే భావనతో నెలరోజుల్లోపే కాంగ్రెస్‌లో చేరాలని రాజగోపాల్‌రెడ్డి భావిస్తున్నట్టు అతని సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది.

మయన్మార్ సైన్యానికి ఆయుధాలు !

విక్రయించిన ప్రభుత్వ రంగ కంపెనీ బీఈఎల్

బయటపెట్టిన జస్టిస్ ఫర్ మయన్మార్ సంస్థ



న్యూఢిల్లీ : మన దేశానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) గత ఆరు నెలల కాలంలో మయన్మార్ సైన్యానికి యాభై లక్షల డాలర్ల విలువైన ఆయుధాలు, సైనిక వినియోగ వస్తువులను విక్రయించింది. మయన్మార్ సైనికుల వినియోగం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని, సాంకేతిక పరమైన పత్రాలను కూడా అమ్మింది. జస్టిస్ ఫర్ మయన్మార్ (జేఎఫ్ఎం) సంస్థ జరిపిన విచారణలో ఈ విషయం బయటపడింది. గత ఏడాది నవంబర్, ఈ సంవత్సరం ఏప్రిల్ మధ్యకాలంలో ఈ అమ్మకాలు జరిగాయి.

భారత రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని బీఈఎల్ సంస్థ మయన్మార్ సైనికులకు ఆయుధాలు, సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానాన్ని విక్రయించిందని జేఎఫ్ఎం సంస్థ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఏడు నౌకల ద్వారా మయన్మార్‌కు సరఫరాలు జరిగాయని, వీటిలో మూడు నౌకలను నేరుగా మయన్మార్ సైన్యానికి పంపారని, మూడు నౌకలను ఆయుధ బ్రోకర్ మెగా హిల్ జనరల్ ట్రేడింగ్‌కు పంపారని, ఒక నౌకను అలియన్స్ ఇంజినీరింగ్ సర్వీసెస్ సంస్థకు పంపారని వివరించింది. అంతర్జాతీయ వాణిజ్య నౌకా కార్యకలాపాల సమాచారం కలిగిన పుంజివా కంపెనీ నుండి ఈ వివరాలు సేకరించామని చెప్పింది. 'బీఈఎల్‌కు మయన్మార్‌లో బ్రాంచ్ ఉంది. దాని ద్వారా మయన్మార్ సైన్యానికి ఆయుధాల సరఫరా జరిగింది. ఆ ఆయుధాలతో సైన్యం నేరాలకు, దారుణాలకు పాల్పడుతోంది' అని ఆ సంస్థ వివరించింది. అంతర్జాతీయ నేరాలకు పాల్పడుతున్న మయన్మార్ సైన్యానికి భారత ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, మద్దతు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మానవ హక్కులు, మానవతావాద చట్టాల పరిధిలో నెరవేర్చాల్సిన తన కర్తవ్యాలను భారత్ విస్మరిస్తోందని, వాసెనార్ ఒప్పందానికి తూట్లు పొడుస్తోందని విమర్శించింది.

2021 జులైలో కూడా బీఈఎల్ సంస్థ మయన్మార్‌కు సైనిక సామగ్రి సరఫరా చేసిందని మరో విచారణలో జేఎఫ్ఎం బయటపెట్టింది. బీఈఎల్‌లో కేంద్రానికి 51.14% వాటా ఉంది. ఇందులో మరికొన్ని ప్రముఖ సంస్థలకు కూడా వాటాలు ఉన్నాయి. మయన్మార్ సైనికులకు బీఈఎల్ సంస్థ ఆయుధాలు విక్రయిస్తున్న నేపథ్యంలో సంస్థాగత మదుపరులు దాని నుంచి బయటకు రావాలని జేఎఫ్ఎం డిమాండ్ చేసింది. సైనికులకు ఆయుధాలు సరఫరా చేస్తూ లాభాలు సంపాదిస్తున్న భారత ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలోని ఆయుధ కంపెనీలు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూనే ఉన్నాయని జేఎఫ్ఎం ప్రతినిధి యదనార్ మాంగ్ చెప్పారు.

'మయన్మార్‌కు ఆయుధాలు, ఆయుధ సామగ్రిని విక్రయించడం ద్వారా ఆ దేశ పౌరుల ఆక్రందనలను, చట్టబద్ధంగా నడుస్తున్న నేషనల్ యూనిటీ ప్రభుత్వాన్ని, పౌర సమాజాన్ని, ఐరాస తీర్మానాలను, అంతర్జాతీయ చట్టాల ప్రకారం తన బాధ్యతలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని భారత ప్రభుత్వం భావిస్తోంది. మయన్మార్ సైన్యానికి ఆయుధాల సరఫరాను నిలిపివేసేలా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భారతదేశ మిత్రులు, భాగస్వాములు విఫలమయ్యారు' అని మాంగ్ తెలిపారు. మయన్మార్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేస్తున్న ఐదు ప్రముఖ దేశాలలో భారత్ కూడా ఒకటి. భారత సంస్థల నుండి 5.1 కోట్ల డాలర్ల విలువ కలిగిన ఆయుధాలు, ఆయుధ సామగ్రి, ముడి పదార్థాలు, ఆయుధ తయారీకి ఉపయోగించే పదార్థాలు సరఫరా అయ్యాయని అంచనా. బీఈఎల్‌తో పాటు భారత్ డైనమిక్ లిమిటెడ్ సంస్థ కూడా మయన్మార్ సైనికులకు ఆయుధాలు విక్రయించింది. మొత్తంమీద 22 మంది సరఫరాదారులు మయన్మార్ సైన్యానికి ఆయుధాలు పంపారు. అయితే మన దేశం మయన్మార్‌కు ఆయుధాలు విక్రయించే ప్రధాన వనరు కాదని, గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారమే అమ్మకాలు జరుగుతున్నాయని భారత ప్రతినిధి ఒకరు చెప్పారు. మయన్మార్ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే నిర్ణయాలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బీసీ స్టడీ సర్కిళ్లలో గురుకులాల ఉపాధ్యాయులకు కోచింగ్ : డైరెక్టర్ అలోక్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని టీఎస్‌బీసీ స్టడీ సర్కిళ్లలో బుధవారం నుంచే గురుకులాల్లో ఉపాధ్యాయులకు కోచింగ్ ఇస్తున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ అలోక్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ (ఏ,బీ,డీ గ్రూపు) కమ్యూనిటీకి చెందిన అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ లో 40శాతం ఆపైన ఉత్తీర్ణులైన వారు వెంటనే నేరుగా టీఎస్ స్టడీ సర్కిల్, ఓ.యూ. సెంటర్, తార్నాక హైదరాబాద్‌లో గురుకులం కోచింగ్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి రూ. ఐదు లక్షలలోపు ఉండాలని తెలిపారు. అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిం చనున్నట్టు తెలిపారు. ఇతర వివరాల కోసం .040- 2407- 1178, 040-27077929 ని సంప్రదించాలని సూచించారు.

బ్యాడ్మింటన్‌కు మంచి ఆదరణ

జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్

హైదరాబాద్ : ప్రతిష్టాత్మక క్రీడా పోటీలు ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామెన్‌వెల్త్ సహా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాధించిన విజయాలు అమోఘమని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. 'యువతలో బ్యాడ్మింటన్‌కు ఆదరణ తారా స్థాయిలో ఉంది. ఎక్కువ మంది బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా ఎంచుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాడ్మింటన్ అభివృద్ధికి గొప్ప సహకారం అందిస్తుందని' గోపీచంద్ అన్నారు. కన్హా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా తెలంగాణ రాష్ట్ర 9వ సీనియర్ బ్యాడ్మిం టన్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించిన గోపీచంద్.. ఈ సందర్భంగా వర్ధమాన షట్లర్లతో ముచ్చటించారు. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం, యోనెక్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీల ఆరంభోత్సవంలో ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, మాజీ షట్లర్ పుల్లెల లక్ష్మి, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.



క్వార్టర్స్‌లో ప్రణయ్

• పారుపల్లి కశ్యప్ ఓటమి • తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్



తైపీ (చైనీస్ తైపీ) : భారత బ్యాడ్మింటన్ స్టార్ ఆటగాడు హెచ్.ఎస్ ప్రణయ్ జోరు కొనసాగుతుంది. గురువారం జరిగిన మెన్స్ సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో అలవోక విజయం సాధించిన వరల్డ్ నం.9 ప్రణయ్.. తైపీ ఓపెన్ 2023 క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు.

పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో ఇండోనేషియా ఆటగాడు టామీ సుగారిటో నుంచి ప్రణయ్‌కి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. 21-9, 21-17తో వరుస గేముల్లోనే గెలుపొందాడు. 39 నిమిషాల్లోనే క్వార్టర్స్ బెర్త్ దక్కించుకున్న మూడో సీడ్ ప్రణయ్.. మలేషియా ఓపెన్ తర్వాత మరో సూపర్ 300 టైటిల్‌పై కన్నేశాడు. నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్ పోరులో హాంగ్‌కాంగ్ షట్లర్, ఐదో స ఈడ్ అంగస్ లాంగ్‌తో ప్రణయ్ పోటీపడనున్నాడు. కామన్‌వెల్త్ క్రీడల మాజీ చాంపియన్ పారుపల్లి కశ్యప్ పతక ఆశలకు తెరపడింది. ప్రీ క్వార్టర్స్‌లో చైనీస్ తైపీ షట్లర్ చేతిలో 16-21, 17-21తో కశ్యప్ పరాజయం పాలయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి, రోహన్ కపూర్ జోడీ సైతం 13-21, 18-21తో ఓటమి చెందింది. మహిళల సింగిల్స్‌లో తానియా కామత్ 11-21, 6-21తో ఒలింపిక్ సిల్వర్ మెడలిస్ట్ తైజుయింగ్ చేతిలో మట్టికరిచింది. తైపీ ఓపెన్‌లో భారత ఆశలన్నీ ప్రస్తుతం హెచ్.ఎస్ ప్రణయ్‌పైనే ఉన్నాయి.

సింగిల్ బౌట్ ట్రయల్?

• ఆసియా, ప్రపంచ చాంపియన్‌షిప్స్ సెలక్షన్స్
• ఆరుగురు రెజ్లర్లపై అడ్‌హాక్ కమిటీ నిర్ణయం!



న్యూఢిల్లీ : ఓ వైపు రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్, మరోవైపు ఆసియా క్రీడలకు కౌంట్‌డౌన్ మొదలు కాగా.. పతక వేటలో భారత ఫేవరేట్ మల్లయోధులు సుమారు ఆరు నెలలుగా ఆందోళన బాటలోనే ఉన్నారు!. బిజెపి ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల కేసులో చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భారత రెజ్లింగ్ క్రీడాకారులు న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సుదీర్ఘ న్యాయ పోరాటం చేసిన సంగతి తెలిసిందే. బ్రిజ్‌భూషణ్ ఆగడాలపై ఈ ఏడాది జనవరిలో గళమెత్తిన రెజ్లర్లు.. ఇప్పటికీ పోరాడుతున్నా బిజెపి ఎంపీని అరెస్టు చేసేందుకు అవకాశం లేకుండా తాజాగా ఢిల్లీ పోలీసులు పోక్సో చట్టాన్ని ఉపసంహరిస్తూ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌కు భారత జట్లను ఎంపిక చేసేందుకు గడువు ముగియనుండగా.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అడ్‌హాక్ కమిటీ ఆందోళనలో పాల్గొన్న ఆరుగురు రెజ్లర్లకు ట్రయల్స్‌లో పోటీపడటంపై కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. ఆసియా క్రీడలకు భారత అథ్లెట్ల బృందం వివరాలను జులై 15లోగా ఆసియా ఒలింపిక్ కౌన్సిల్‌కు అందజేయాల్సి ఉంది. రెజ్లింగ్ జట్టు విషయంలో గడువు ఆగస్టు 15 వరకు పొడగించాలని తాజాగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) కోరింది. దీనిపై ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ స్పందించాల్సి ఉంది. ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్స్ వారం వ్యవధిలో జరుగనున్నాయి. బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌లు ఆసియా, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పోటీపడేందుకు సిద్ధమవుతున్నారు. ఇన్నాండ్లూ ఆందోళనలో ఉండటంతో స్టార్ రెజ్లర్లకు అసలు ప్రాక్టీసే లేదు. దీంతో ట్రయల్స్‌లో పోటీపడేందుకు ఆరుగురు రెజ్లర్లు అడ్‌హాక్ కమిటీని ఆగస్టు వరకు గడువు కోరారు. ఆగస్టు వరకు గడువు పొడగింపు వీలుకాని తరుణంలో.. ట్రయల్స్‌లో విజేతలుగా నిలిచిన రెజ్లర్‌తో సింగిల్ బౌట్ ట్రయల్ నిర్వహిస్తామని అడ్‌హాక్ కమిటీ తెలిపింది. బజరంగ్, రవి దహియ, వినేశ్, సాక్షి మాలిక్‌లు గతంలో బిజీ షెడ్యూల్‌తో ట్రయల్స్‌లో మినహాయింపులు పొందారు. కానీ సంగీత ఫోగట్ సహా ఇతర రెజ్లర్లకు ఎన్నడూ ట్రయల్స్‌లో మినహాయింపులు దక్కలేదు. ఈ విషయంలో అడ్‌హాక్ కమిటీ త్వరలోనే అధికార నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

సెలక్టర్ కావలెను

దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ

ముంబయి : ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీలో ఓ సెలక్టర్ స్థానం కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దరఖాస్తులు ఆహ్వానించింది. వరుసగా రెండోసారి సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్‌గా నియమితులైన చేతన్ శర్మ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ టెలివిజన్ చానెల్ శూల శోధనలో పిచ్చాపాటి వ్యాఖ్యల ఫలితంగా పదవికి రాజీనామా చేశాడు. దీంతో ఫిబ్రవరి నుంచి సెలక్షన్ కమిటీలో నలుగురు సభ్యులు మాత్రమే ఉంటున్నారు. నలుగురు సభ్యుల్లో సీనియర్ శివ సుందర్ దాస్ తాత్కాలిక చీఫ్ సెలక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుబ్రతో బెనర్జీ, అంకోల, శ్రీధరన్ శరత్ కమిటీలోని ఇతర సభ్యులు. రానున్న ఆసియా కప్, ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ నేపథ్యంలో బీసీసీఐ మరో సెలక్టర్ పోస్టు కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్ క్లాస్ మ్యాచులు (రంజీ) ఆడిన అనుభవం తప్పనిసరి. లేదా పది వన్డేలు, 20 టీ20 మ్యాచులు ఆడిన అనుభవం సరిపోతుంది. క్రికెట్‌కు వీడ్కోలు పలికి 5 సంవత్సరాలు ముగిసి ఉండాలి. ఇక క్రికెట్ సంఘాల్లో ఎక్కడా ఏ పదవిలో కొనసాగకూడదు. ఐదేండ్ల పాటు బీసీసీఐ సెలక్టర్‌గా కొనసాగేందుకు అర్హతలు కలిగి ఉండాలని నోటిఫికేషన్‌లో బీసీసీఐ నిబంధనలు పెట్టింది.

ఇదిలా ఉండగా, బీసీసీఐ సెలక్షన్ కమిటీ చైర్మెన్ పదవిపై మాజీ క్రికెటర్లు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం కలిగిన క్రికెటర్లు ఓపెన్ మార్కెట్‌లో రెండు కమర్షియల్ ఈవెంట్లతో కనీసం రూ.1-2 కోట్లు సంపాదిస్తున్నారు. సెలక్టర్‌కు బీసీసీఐ రూ.1 కోటి మాత్రమే చెల్లిస్తుంది. కనీసం రూ.3-5 కోట్ల వేతనం ఉంటే ప్రభావంతమైన మాజీ క్రికెటర్లు సెలక్షన్ కమిటీలో పని చేసేందుకు ముందుకు వచ్చే వీలుంది. విరుద్ధ ప్రయోజనాల నిబంధనతో ఇతర ఆదాయ మార్గాలను సెలక్షన్ కమిటీ సభ్యులు వదులుకోవాల్సి ఉంటుంది. గత కొన్నేండ్లుగా సీనియర్ సెలక్షన్ కమిటీలో పెద్దగా పేరు లేని మాజీ క్రికెటర్లే పని చేస్తుండటానికి తక్కువ వేతనాలే కారణమని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



చిరంజీవి

24న టీజర్ రిలీజ్

చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా 'భోళా శంకర్'. ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్ర టీజర్ ఈనెల 24న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన చిరంజీవి కొత్త స్టైల్ పోస్టర్ అందర్నీ అలరిస్తోంది.

'ఇటీవల భోళా మ్యూజిక్ మానియా మొదలైంది. సినిమాలో మొదటి పాట విడుదల చేయగా ఫెంటాస్టిక్ రెస్పాన్స్ అందుకుంది. ఈ సాంగ్ యూట్యూబ్, ఆడియో ప్లాట్‌ఫార్మ్‌లో ట్రెండ్ అయ్యింది. మెగాస్టార్ డ్యాన్స్, గ్రేస్‌కి తగ్గట్టు మహతి స్వర సాగర్ ఎనర్జిటిక్ డ్యాన్స్ ట్యూన్ అందించారు. లిరికల్ వీడియోలో కొన్ని స్టెప్స్ మాత్రమే చూపించినా, అవి కూడా వైరల్ అయ్యాయి. అలాగే చిరంజీవి లీక్ చేసిన సంగీత్ సాంగ్ విజువల్స్ ఆడియన్స్‌ను ఎట్రాక్ట్ చేశాయి. సినిమా నుంచి విడుదల చేసిన ప్రతి పోస్టర్ ఆడియన్స్, అభిమానుల్లో సినిమాపై హైప్ పెంచింది' అని చిత్ర యూనిట్ తెలిపింది. అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవి సిస్టర్‌గా కీర్తి సురేష్ కనిపించనుంది. సుశాంత్ లవర్ బాయ్‌గా మెరవబోతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఈచిత్రానికి స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మెహర్ రమేష్, నిర్మాత: రామబ్రహ్మం సుంకర, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల, ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్డీ, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్.

సరికొత్త అనుభూతినిచ్చే సినిమా

శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై డిఫరెంట్ సినిమాలను ప్రేక్షకులకు అందిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్. ఈ ఏడాది 'విరూపాక్ష' వంటి మిస్టికల్ థ్రిల్లర్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. తాజాగా మరో హర్రర్ థ్రిల్లర్ 'అశ్విన్స్' అనే చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వసంత్ రవి హీరోగా రూపొందిన ఈ చిత్రానికి తరుణ్ తేజ దర్శకత్వం వహించారు. విమలా రామన్ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన రిలీజ్ ప్రెస్‌మీట్‌లో దర్శకుడు తరుణ్ తేజ మాట్లాడుతూ, 'బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, బాపినీడు గైడెన్స్, సహకారంతో ఈ సినిమాను అనుకున్నట్లుగా, అనుకున్న సమయంలో పూర్తి చేశాను. ఈ సినిమాలో విమలా రామన్ పాత్ర అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులు ఆమె రోల్‌ను తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు. 'తరుణ్ కల 'అశ్విన్స్' సినిమా. దాన్ని పూర్తి చేసిన బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, బాపినీడుకి స్పెషల్ థ్యాంక్స్. ఈ సినిమాకు మ్యూజిక్ చాలా ఇంపార్టెంట్. మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ సిద్ధార్థ్ నెక్స్ట్ రేంజ్ మ్యూజిక్‌ను అందించారు. ఎడ్విన్ విజువల్స్ బ్యూటీఫుల్‌గా ఉన్నాయి. ఇలా అందరూ అద్భుతంగా వర్క్ చేసిన సినిమా ఇది' అని విమలా రామన్ చెప్పారు. హీరో వసంత్ రవి మాట్లాడుతూ, ' ఈ సినిమా నాకెంతో స్పెషల్ మూవీ. ఇందులో సౌండ్ డిజైనింగ్ ప్రత్యేకంగా ఉంటుంది. సినిమా చూసే ఆడియెన్స్‌కి ఓ వైబ్రేషన్ ఉంటుంది. విజువల్స్, మ్యూజిక్ అనే కాకుండా తరుణ్ తేజ ఈ సినిమాలో ఓ మంచి మెసేజ్ ఇచ్చారు. అందరూ స్ట్రాంగ్ మైండ్‌తో ఉండాలని చెప్పారు. ఆ మెసేజ్ ఇప్పటి యూత్‌కి ఎంతో అవసరం' అని అన్నారు. నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ, 'హర్రర్ జోనర్‌లో తరుణ్ తేజ్‌తో కలిసి మా అబ్బాయి బాపినీడు ఈ సినిమాను చేశాడు. ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలి. ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇస్తుంది' అని తెలిపారు.



తరుణ్ తేజ, విమలా రామన్, వసంత్ రవి

నవచిత్రం

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్



విజయ్

విజయ్, లోకేష్ కనగరాజ్ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'లియో'. గురువారం హీరో విజయ్ బర్త్‌డేని పురస్కరించుకుని మేకర్స్ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ తీరు చూస్తుంటే ఇందులో యాక్షన్ సీక్వెన్స్‌లు ఎక్కువగా ఉంటాయని వేరే చెప్పక్కర్లేదు. అలాగే యాక్షన్ మోడ్‌లో ఉన్న విజయ్ లుక్ అందర్నీ అలరిస్తోంది. అలాగే విజయ్ బర్త్ డేకి గిఫ్ట్‌గా ఫస్ట్ సింగిల్ 'నా రెడీ..' లిరికల్ వీడియోని కూడా మేకర్స్ విడుదల చేసారు. ఫుల్ బీట్స్‌తో ఉన్న ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అక్టోబర్ 19న లియో విడుదలకు ప్లాన్ చేస్తున్నారు.7 స్క్రీన్ స్టూడియోపై ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మిస్తుండగా, జగదీష్ పళనిసామి సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్రిష కృష్ణన్, సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ తదితరులు ఇతర ముఖ్య తారాగణం.

మెప్పించే నట రత్నాలు

సుదర్శన్, రంగస్థలం మహేశ్, తాగుబోతు రమేష్ కీలక పాత్రధారులుగా నర్రా శివనాగు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నట రత్నాలు'. ఇనయా సుల్తానా కథానాయిక. మర్డర్ మిస్టరీ క్రైం థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డా.దివ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ మాజీ ఎంఎల్ఏ ఎరపతినేని శ్రీనివాసరావు ఆడియో సీడీలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దర్శకుడు శివనాగు మాట్లాడుతూ, "సినిమా ఇండస్ట్రీలో ఇబ్బందులు ఎదుర్కొన్న వారి ఇతివృత్తంతో తీసిన సినిమా ఇది. మంచి విజయం సాధిస్తుంది' అని తెలిపారు. నిర్మాత దివ్య మాట్లాడుతూ, 'సినిమా బాగా వచ్చింది. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

ఈ చిత్రానికి నిర్మాతలు: డా దివ్య, వై. చంటి, ఆనంద్ దాస్ శ్రీ మణికంఠ, కో ప్రొడ్యూసర్: కోయ సుబ్బారావు.



థ్రిల్ చేసే స్పై

నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యమీనన్ జంటగా నటించిన పాన్ ఇండియా సినిమా 'స్పై'. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఈ ట్రైలర్ రిలీజ్ వేడుక సత్యం మాల్‌లోని ఏషియన్ అల్లు అర్జున్ సినిమాస్‌లో గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా హీరో నిఖిల్ సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'మేము అనుకున్న కథను అనుకున్నట్లు చాలా బాగా తీశాం. సినిమా బాగుంటుందనే నమ్మకంతో బయ్యర్లంతా హ్యాపీగా ముందుకొచ్చారు. డైరెక్టర్ గ్యారీ బీహెచ్ ఈ సినిమాను చివరి నిమిషం వరకు చెక్కుతున్నారు. ఈ సినిమాకు సెన్సార్ నుంచి ఒక్క కట్ కూడా లేకుండా యు/ఏ సర్టిఫికెట్ వచ్చింది. రానా కథ చెప్పగానే ఎంతగానో నమ్మి చేశారు. ఆయన నిజంగా సర్‌ప్రైజ్ చేస్తారు. ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ థియేటర్లలో విడుదల చేస్తున్నాం. అందరినీ ఈ సినిమా ఎంతగానో థ్రిల్ చేస్తుంది' అని చెప్పారు.

'ఇలాంటి సినిమాలు అన్నప్పుడు రెస్పాన్సిబిలిటీ ఇంకా ఎక్కువ పెరుగుతుంది. ఈ మూవీలో నేను రెండు పాటలు చేశాను. త్వరలో ఒక బ్యాంగర్ సాంగ్ రిలీజ్ అవుతుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదిరిపోయేలా ఉంటుంది. యాక్షన్ సీక్వెన్సెస్, ఎమోషనల్ స్టఫ్‌తో సాంగ్స్ ఉంటాయి. ఈ సినిమాకు పని చేయడం సంతోషంగా ఫీలవుతున్నా' అని సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల అన్నారు. హీరోయిన్ ఐశ్వర్య మీనన్ మాట్లాడుతూ, "ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. ఇలాంటి టీమ్‌తో వర్క్ చేయడం నా అదృష్టం. నిఖిల్‌తో కలిసి పని చేయడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. నన్ను నమ్మి అవకాశం ఇచ్చినందుకు డైరెక్టర్ గ్యారీకి రుణపడి ఉంటా' అని తెలిపారు.

'క్వాలిటీ పరంగా ఈ సినిమా చాలా బాగుంది. 'స్పై' నుంచి రిలీజ్ అయిన ప్రతి కంటెంట్‌ను అందరూ ఎంతగానో ఆదరిస్తున్నారు. ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా ఒక బెస్ట్ రిలీజ్ జరుగుతుంది. ఈ సినిమాలో రానా యాక్ట్ చేయడానికి ఒప్పుకున్నందుకు ఆయనకు థ్యాంక్స్. ఆయన పాత్ర ఎంత బాగుంటుందో సినిమాలో మీరే చూస్తారు. నిఖిల్‌కి ది బెస్ట్ థియేటర్స్ ఇస్తున్నాం. ప్రతి కంట్రీలో, ప్రతి స్టేట్‌లో అన్ని లాంగ్వేజస్‌లో ది బెస్ట్ క్వాలిటీతో, ది బెస్ట్ స్టోరీతో హండ్రెడ్ పర్సెంట్ హిట్ కొట్టబోతున్నాం' అని సీఈవో చరణ్ తేజ్ అన్నారు.



ఐశ్వర్య మీనన, నిఖిల్, సానియా

ఆవారా కుర్రాళ్ళ కథ

బిగ్ బాస్ శ్రీహాన్, ముక్కు అజయ్, ఢీ చెర్రీ, జస్వంత్, షియాజీ షిండే నట *నటులుగా దేపా శ్రీకాంత్ రెడ్డి దర్శకత్వంలో విభా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత నంద్యాల మధుసూదన్ రెడ్డి నిర్మించిన చిత్రం 'మా ఆవారా జిందగీ'. ఈ చిత్రానికి కంభంపాటి విజయ్ కుమార్ సహ నిర్మాతగా వ్యవహరించగా, ప్రతీక్ నాగ్ సంగీతం అందించారు.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని నేడు (శుక్రవారం) గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు దేపా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, 'హైదరాబాద్‌లో నలుగురు ఆవారా కుర్రాళ్ల పనులు ఎలా ఉండబోతున్నాయి?, ఆ పనులకు కామెడీ ఎలా లింక్ చేశారు? అనే ఫన్ ఓరియెంటెడ్, యూత్ ఫుల్ కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రమిది' అని అన్నారు.

బిగ్ బాస్ ఫేమ్ శ్రీహన్ మాట్లాడుతూ, 'ఇలాంటి బోల్డ్ కంటెంట్ సినిమా చేయాలంటే ధైర్యం ఉండాలి. మంచి ఎంటర్టైన్మెంట్‌తో వస్తున్న ఈ సినిమాలోని మా నటనకు ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఫుల్ ఎంటర్టైన్ అవుతారని కచ్చితంగా చెప్పగలను' అని చెప్పారు.

చెర్రీ మాట్లాడుతూ, 'ఒక డ్యాన్సర్‌గా లైఫ్ స్టార్ట్ చేసిన నాకు మా చిట్టి మాస్టర్ ద్వారా ఈ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. మా సినిమాను చూసి ప్రేక్షకులు అందరూ బిగ్ హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'ఈ సినిమా ఆవారా తనానికి, పోరంబోకు తనానికి పరాకాష్ట అని చెప్పవచ్చు. ఇందులో నటించిన పోరగాళ్లు ఎంతో అల్లరి చేశారు. దర్శకుడు శ్రీకాంత్ కూడా యూత్‌కి కనెక్ట్ అయ్యే సీన్స్ చాలా బాగా తీశాడు. ఇందులో శ్రీహాన్‌కు ఫాదర్‌గా నటించాను. ఈ సినిమా చూసిన తర్వాత నన్ను ఆవారాకి ఫాదర్ అనేలా ఉంటుంది. యూత్ అందరూ కచ్చితంగా ఎంటర్టైన్ అవుతారు' అని నటుడు మహేందర్ నాథ్ చెప్పారు.



'మా ఆవారా జిందగీ' చిత్ర బృందం

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.